గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# ఆగస్ట్ 2014
# కథలు




ఆరోజు కోర్టు హాలు కిక్కిరిసి వుంది. కరడుగట్టిన ఏ కసాయి కేసో వాదనకు వచ్చిందనుకుంటున్నారేమో! ఓ విచిత్రమైన కేసు వచ్చింది. ప్రముఖ దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు తాజాగా రూపొందించిన 'అరటిపండు ' చిత్రంపై ఒక ప్రేక్షకుడు కేసు వేశాడు. ఎంతో ఆశగా టిక్కెట్ కొనుక్కుని థియేటర్ కి వెళితే ఒక్కసారి కూడా అరటిపండు కనిపించలేదనీ, తనకు న్యాయం చేయాలనీ కోర్టును ఆశ్రయించాడు సదరు ప్రేక్షకుడు.

నిందితుడినీ, ఫిర్యాదుదారునీ కోర్టులో ప్రవేశపెట్టి ఎదురెదురుగా వున్న బోనులలో నిలబెట్టారు. న్యాయమూర్తి రావడంతో అప్పటివరకూ కోలాహలంగా వున్న కోర్టు హాలు నిశ్శబ్దంగా మారింది. ఆనవాయితీ ప్రకారం న్యాయమూర్తి టేబుల్ మీదున్న సుత్తిని తీసుకుని మూడుసార్లు కొట్టి 'ఆర్డర్... ఆర్డర్... ఆర్డర్...' అన్నారు.

"వాద ప్రతివాదనలు మొదలెట్టండి!" అంటూ న్యాయవాదులిద్దరినీ ఆదేశించారు న్యాయమూర్తి.

"మిలార్డ్... కాఫీ తాగి, టిఫిన్ చేసి వచ్చారా?" అన్నాడు లాయర్ నల్లకోటును సర్దుకుంటూ...

"నా క్షేమసమాచారాలడగడానికి నువ్వు నా బామ్మర్దివి కాదు. విషయమేంటో మొదలెట్టు..." కర్కశంగా అన్నారు న్యాయమూర్తి.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిసుక్కున నవ్వడంతో కోర్టు హాలంతా ప్రతిధ్వనించింది. లాయర్ అతడిని ఖోపంగా చూసి జడ్జివైపు తిరిగి తన వాదన మొదలెట్టాడు.

"మిలార్డ్... బోనులో వున్న నా క్లయింటు..."

"ఐ అబ్జక్ట్ యువరానర్..." అంటూ మధ్యలోనే లేచాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"అబ్జక్షన్ ఓవర్ రూల్డ్..." అని న్యాయమూర్తి అన్నారు.

"మిలార్డ్... కోర్టు హాలులో రెండు బోనులున్నాయి. కానీ, లాయర్ గారు కోర్టువారిని తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో 'బోనులో వున్న నా క్లయింటు ' అంటున్నారు. ఏ బోనులో వున్న క్లయింటో స్పష్టంగా చెప్పాలని సవినయంగా కోరుతున్నాను" అన్నాడు ప్రాసిక్యూటర్.

వెంటనే రాహుల్ గోపాల్ రాజు వైపు చూపిస్తూ "యువరానర్... ఈ బోనులో వున్న నా క్లయింటు తన మానాన తను సినిమాలకు దర్శకత్వం వహిస్తూ బతికేస్తూంటే... ఓ సాధారణ ప్రేక్షకుడైన అతడు..."

"ఐ అబ్జక్ట్ యువరానర్..." అంటూ మళ్లీ లేచాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్. లాయర్ తో సహా జడ్జి కూడా విసుగ్గా చూశారు.

"సినిమాకి ఫైనల్ జడ్జి అయిన నా క్లయింటుని పట్టుకుని సాధారణ ప్రేక్షకుడు అని సంబోధించడం కులం పేరుతో దూషించినంత నేరం యువరానర్..." ఆవేశంగా అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"అబ్జక్షన్ ఒవర్ రూల్డ్..."

"యువరానర్... ఇలా మాటిమాటికీ మనోభావాలు దెబ్బ తింటూంటే కోర్టు సాగినట్టే... సరే, ప్రేక్షకుడు థియేటర్ కి వెళ్లి సినిమా చూసి ఇంటికి వెళ్లాలే తప్ప ఇలా కోర్టుకి వస్తే ఇదిగో... ఇలాగే వుంటుంది. సినిమా ఎలా తీయాలన్నది దర్శకుడి ఇష్టం. దానికి ప్రేక్షకుడు అభ్యంతరం చెప్తే ఎలా యువరానర్?"

"యువరానర్... వినియోగదారుడికి చెప్పినదాన్నే ఉత్పత్తిదారుడు అందించాలి. అది అతడి ధర్మం. బయట బుక్ స్టాల్ అని బోర్డు పెట్టి లోపల కోళ్లను అమ్ముతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. 'అరటిపండు ' అని టైటిల్ పెట్టిన దర్శకుడు సినిమాలో ఒక్కసారి కూడా అరటిపండుని చూపించక మోసం చేశాడనేది నా క్లయింటు అభియోగం. దీనికి ప్రాసిక్యూటర్ గారు దయచేసి కోర్టువారికి సమాధానం చెప్పాల్సిందిగా కోరుతున్నాను"

జడ్జి ఒకసారి బుర్ర గోక్కున్నాడు. పైకప్పుకేసి చూస్తూ ఆలోచించాడు.

"యువరానర్... దీనికింతగా ఆలోచించాల్సిన పనిలేదు. ఒక్కసారి మీరు 'అరటిపండు ' ఒరిజినల్ డి.వి.డి. తెప్పించుకుని చూస్తే సినిమాలో అరటిపండుని ఒక్కసారి కూడా చూపించని ఈ దర్శకుడికి ఎంత కఠినమైన శిక్ష విధించాలో మీకే తడుతుంది" ఆవేశంగా అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"నేను ఛస్తే ఒప్పుకోను యువరానర్... నిన్నగాక మొన్న రిలీజై ఇంకా థియేటర్లలో ఆడుతున్న నా సినిమాను మీరు ఒరిజినల్ డి.వి.డి.లో చూడ్డం సెక్షన్ అలీ 369/ఎబిసిడి/అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకారం చట్టరీత్యా నేరం యువరానర్..." అన్నాడు దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు.

"నువ్వుండవయ్యా బాబూ... నీ లాయర్ని నేను కదా... నేను వాదిస్తానుండు... అనవసరంగా ఆవేశపడిపోతావ్... అంచేత యువరానర్... నా క్లయింటు బాధను అర్థం చేసుకోగలరని కోర్టువారిని సవినయంగా కోరుతున్నాను. నవమాసాలూ మోసి బిడ్డను కన్న తల్లికి, తన కళ్ల ముందే నర్సు బిడ్డడిని మరొకరికి ఇచ్చేస్తుంటే ఎలా వుంటుంది యువరానర్?" అంటూ ఆవేశంగా ప్రశ్నించాడు లాయర్.

"ఏమో, నాకు తెలీదు. ఎందుకంటే, నేనెప్పుడూ కనలేదు, నర్సు అలా ఎవరికీ ఇవ్వలేదు. అయినా, ఇది నాకెందుకు

చెప్తున్నట్టు?" జడ్జి భృకుటి ముడివడింది.

"కొంచెం సెంటిమెంటుని టచ్ చేసి చెప్తే మీరు నా క్లయింటు బాధను అర్థం చేసుకుంటారేమోనన్న ఆశతో చెప్పాను మిలార్డ్... మీరు సినిమా చూస్తానంటే నేను టికెట్ కొని మీరు చూసే ఏర్పాటు నేను చేస్తాను యువరానర్..." అంటూ తన పాకెట్లోని డబ్బుని తీసి లెక్కేసుకున్నాడు లాయర్.

"నీ దయా దాక్షిణ్యాలు నాకేమీ అక్కర్లేదు. సినిమా చూసి నేను తీర్పు చెప్తాను. ఈరోజు కోర్టు వాయిదా వేయడమైనది. నేను సినిమా చూసిన తర్వాత తెలియపరుస్తాను. అప్పుడు అందరూ లేట్ చేయకండా కరెక్టు టైముకి రావాలి" అంటూ జడ్జి తన కుర్చీలో నుండి లేచి బయటకు నడిచాడు.

అందరూ బయటకు వచ్చేసరికి మైకులు, కెమెరాలు పట్టుకుని మీడియా మొత్తం రెడీగా వుంది.

"సార్... అరటిపండు కేసు ఏమైంది? దర్శకుడు రాహుల్ గోపాల్ రాజుకి తీర్పు అనుకూలంగా వచ్చిందా, వ్యతిరేకంగా వచ్చిందా? అసలు ఈ కేసుపట్ల జడ్జిగారు ఎలా స్పందించారు? ఇకమీదట కూడా కోర్టులో ఇలాంటి కేసులను ఎక్స్ పెక్టు చేయవచ్చా?" అంటూ ప్రశ్నల వర్షాన్ని కురిపించారు.

ఈ ప్రశ్నలకు లాయర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతిస్పందిస్తూ "జడ్జిగారు ఇరువైపులా వాదనలను పూర్తిగా, ఓపిగ్గా విన్నారు. సినిమా చూసిన తర్వాత తన తీర్పును వెలువరించనున్నారు" అని చెప్పి స్పీడుగా అక్కడినుండి వెళ్ళిపోయారు.

మర్నాడు న్యూస్ పేపర్లు, న్యూస్ ఛానెల్స్ ఇష్టమొచ్చినట్టుగా ప్రతిస్పందించాయి.

న్యాయమూర్తి 'అరటిపండు ' చిత్రాన్ని చూశారు. దాని తర్వాత ఒకరోజు కోర్టు సమావేశమైంది.

నరాలు తెగే ఉత్కంఠతో అందరూ జడ్జి వంకే చూస్తున్నారు. ఆయన తన సీట్లో కూర్చుని భారీ నుంచి అతిభారీ పుస్తకాలన్నింటినీ తిరగేశారు. కోర్టు హాలంతా నిశ్శబ్దంగా వుంది. సుమారు ఇరవై రెండు నిమిషాల నిశ్శబ్దాన్ని తన సుత్తితో బద్దలుగొట్టారు న్యాయమూర్తి. "సైలెన్స్... సైలెన్స్... సైలెన్స్..."

"హాలంతా ఆల్రెడీ సైలెన్సుగానే వుంది మిలార్డ్" అన్నాడు లాయర్.

"నాకు తెలుసు. నేను మాట్లాడబోతున్నానని ఇండికేషన్ ఇస్తున్నానన్న మాట. ఏతావాతా నేను చెప్పొచ్చేదేంటంటే... దర్శకుడు ఈ చిత్రానికి అరటిపండు అనే టైటిల్ పెట్టాలని ఎందుకు నిర్ణయించుకున్నాడనేది అతడి స్వవిషయం. నిజానికి కథాపరంగా చూస్తే అరటిపండుకీ, కథకీ ఎక్కడా పొంతన కనిపించలేదు"

జడ్జి మాటలను మధ్యలోనే ఖండిస్తూ "యువరానర్... దీనికి నేనొప్పుకోను. అరటిపండును అనేకచోట్ల సింబాలిగ్గా చూపించాడు నా క్లయింటు..." అంటూ అడ్డుకున్నాడు లాయర్.

"నువ్విక్కడ అరటిపండు సినిమాకి రివ్యూ రాయడం లేదు... నేను మాట్లాడేది కాస్త విను. అసలు అరటి పండు రంగు ఎలా వుంటుంది, దాని రుచి, ఉపయోగాలు, పండులో వుండే విటమిన్లూ... ఇలా అన్నింటినీ వివరించాల్సిన బాధ్యత దర్శకుడి మీద వుంది. కానీ, వాటన్నింటినీ మరచి అసలు అరటిపండు ఊసే లేకుండా సినిమా తీసినందుకు గానూ, సదరు ప్రేక్షకుడికి దర్శకుడు డజను అరటిపండ్లు కొనివ్వాలని తీర్పు ఇవ్వడమైనది..." అంటూ తీర్పు చెప్పారు న్యాయమూర్తి.

కోర్టు హాలంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

అందరూ బయటకు వచ్చారు. యదావిధిగా మీడియా అంతా ఎదురు చూస్తోంది.

"డైరెక్టరుగారూ, లోపల ఏంజరిగింది? జడ్జిగారు ఏం తీర్పు చెప్పారు? ఇకమీదట మీరు తీయబోయే సినిమాలకు ఆ తీర్పుని పాటించబోతున్నారా?" అంటూ ప్రశ్నల వర్షాన్ని కురిపించారు మీడియా సోదరులు.

దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు ఈ ప్రశ్నలేవీ పట్టించుకోకుండా "అరటిపండు తర్వాత నేను తీయబోయే చిత్రం పేరు... 'గుమ్మడికాయ ' " అన్నాడు.

"పండు మీద నుండి వెళ్లి కాయ మీద పడుతున్నారా? ఇంతకీ ఈ చిత్రం ప్రత్యేకత ఏంటి సార్?" అన్నాడు ఒక మీడియా సోదరుడు.

"ఈ సినిమాలో అసలు గుమ్మడికాయే కనిపించదు, దాని గురించిన ప్రస్తావన వుండదు..." అని సమాధానం చెప్పేసి హుందాగా, తన స్టైల్లో నడచుకుంటూ వెళ్లిపోయాడు దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు.

మీడియా సోదరులతో పాటు అక్కడున్న వారంతా అవాక్కయ్యారు.




నాలుగో తరగతి చదువుతున్న చందు, సరస్వతి కవలలు. తనను అతిగా గారాబం చేసే నాయనమ్మ రవణమ్మంటే చందుకి ప్రాణం. 'వాడు మారాజురా! ఆడపిల్లతో వాడికి పోలికేంటి?' అని రవణమ్మ అస్తమానూ అనడం చందు, సరస్వతిల తల్లిదండ్రులు నీరజ, మురళీకృష్ణలకు సుతరామూ నచ్చదు. 'అమ్మా! అమ్మాయిలను ఒకప్పుడు చిన్నచూపు చూసేవారు, అణగదొక్కేవారు. కానీ, ఇది పాతకాలం కాదు. అప్పుడైనా, ఇప్పుడైనా అమ్మాయిలు అబ్బాయిలకు దేంట్లోనూ తక్కువ కాదు.

కొన్ని సందర్భాల్లో పైచేయి కూడా కనబరుస్తూంటారు.' అని మురళీకృష్ణ ఎన్నోసార్లు కోప్పడ్డాడు కూడా! కానీ, నాయనమ్మ మాటంటే చందుకి వేదమంత్రం కాబట్టి అది వాడి తలకు బాగా ఎక్కింది. ప్రతిదాంట్లోనూ సరస్వతిని తక్కువచేసి చూడ్డం, నిర్లక్ష్యంగా మాట్లాడ్డానికి అలవాటు పడ్డాడు. ఈ విషయాన్ని ఓ కంట గమనిస్తూనే వున్నారు నీరజ, మురళీకృష్ణ. వాడికి బుద్ధి చెప్పేందుకు తగిన సమయం కోసం వేచి చూస్తున్నారు భార్యాభర్తలిద్దరూ! సంక్రాంతి సమీపిస్తూండగా ఇంట్లో అందరికీ కొత్తబట్టలు కొనేందుకు షాపింగ్ కి బయలుదేరారు. తల్లి నీరజ ముచ్చటపడి తీసుకున్న బట్టాలను సరస్వతి కూడా సంతోషం కనబరచిందే తప్ప ఎదురు చెప్పలేదు. కానీ, అదే రేటులో తీసుకున్న కారణంగా తన బట్టలను తిరస్కరిస్తూ 'నేను బగాణ్ణి. ఆడపిల్లకు తీసుకున్న రేటులోనే నాకూ తీసుకుంటారేంటి?' అన్నాడు చందు నిర్లక్ష్యంగా. కోప్పడబోయిన నీరజను వారించి చందు కోరిన ఎక్కువ రేటు బట్టలను కొన్నాడు మురళీకృష్ణ.

సంక్రాంతి గడచిపోయింది. తిరిగి స్కూళ్లు మొదలయ్యాయి. చందు, సరస్వతిలతో పాటు తను కూడా స్కూలుకి రెడీ అయ్యాడు మురళీకృష్ణ. 'స్కూలుకు నువ్వెందుకు వస్తున్నావు డాడీ?' అని అడిగాడు చందు. 'ఇన్నాళ్లూ నీకు అన్యాయం జరిగిపోయిందిరా! సరస్వతికన్నా నీకు ఎక్కువ సబ్జెక్టులు, ఎక్కువ పాఠాలు ఇవ్వాల్సింది కాస్తా సమానంగా ఇచ్చారు. ఎక్కువ ఇవ్వమని మీ ప్రిన్సిపల్ తో మాట్లాడతాను.' మాట్లాడతాను.' అన్నాడు మురళీకృష్ణ. చందు ఖంగు తిన్నాడు. 'అదేంటి డాడీ? ఇద్దరమూ ఒకే క్లాసు కదా! అలాంటప్పుడు నాకు ఎక్కువ సబ్జెక్టులు, ఎక్కువ పాఠాలు ఇవ్వడమేంటి?' అన్నాడు. 'కదా! ఈ సొసైటీ కూడా ఒక క్లాసులాంటిదే! ఈ క్లాసులో అమ్మాయైనా, అబ్బాయైనా సమానమే! అలాంటప్పుడు అన్నింట్లోనూ సరస్వతికన్నా నిన్ను ఎక్కువచేసి ఎందుకు చూడాలి?' అని చందుని సూటిగా ప్రశ్నించాడు మురళీకృష్ణ. చందుకి విషయం పూర్తిగా బోధపడక బుర్ర గోక్కున్నాడు. కొడుక్కి వివరంగా చెప్పదలచుకున్నాడు మురళీకృష్ణ.

'చూడు కన్నా! మదర్ థెరిసా, ఇందిరాగాంధీ, సరోజినీ నాయుడు... వీళ్లంతా లేడీసా, జెంట్సా?'

'లేడీసే డాడీ!'

'కానీ ప్రపంచం వాళ్లను ఆడవాళ్లా, మగవాళ్లా అని చూడదు. జీవితంలో ఉన్నత శిఖరాలకెదగాలనే బలమైన లక్ష్యంతో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచినవారుగానే చూస్తుంది. అందుకే, వారు చరిత్రలో నిలిచిపోయారు. అలాంటప్పుడు మగవాళ్లకన్నా ఆడవాళ్లు తక్కువ అనేందుకు ఒక్క ఆధారమైనా చెప్పగలవా? నవమాసాలూ మోసి జన్మనిచ్చే అమ్మ ఎంత గొప్పది! సృష్టికి మూలం స్త్రీ. చదువుల తల్లి సరస్వతి. యత్ర నార్యస్తు పూజ్యంతే తత్ర రమం దేవతా! అన్నారు పెద్దలు. అంటే స్త్రీలు ఎక్కడ పూజింపబడుదురో అక్కడ దేవతలు సంచరిస్తారని అర్థం.' చందు తలమీద చెయ్యివేసి సౌమ్యంగా అన్నాడు మురళీకృష్ణ.

'సారీ డాడీ! సరస్వతినే కాదు, ఏ లేడీస్ గురించి తక్కువ చేసి మాట్లాడను ఇంకోసారి...' పశ్చాత్తాపంతో తలవంచుకుని అన్నాడు

చందు.

నీరజ, మురళీకృష్ణ ఆనందంగా చిరునవ్వు నవ్వుతూ మొహాలు చూసుకున్నారు.




"ఒరేరాఘువా! ఇంట్లోఏడ్చావా?"

"నీవెక్కడ్నుంచి ఏడుస్తున్నావో ముందు చెప్పి అఘోరించు"

"మీ ఇంటికే బయల్దేరా! ఇంట్లో అఘోరిస్తే వచ్చి మాట్లాడుతా! లేకపోతే ఇంకో చోటి కెళ్ళి నా శ్రార్ధం పెట్టుకుంటా"

"ఇక్కడే పెట్టుకుందువుగానిరా!" ఫోన్ల సంభాషణంతా వింటున్న రాఘవరాం శ్రీమతి సుగుణ ," ఐనా ఎప్పుడూ అలా తప్ప మాట్లాడుకోలేరా మీ ఇద్దరూనూ?!చిత్రమైన స్నేహితులు. "అంటూలోనికెళ్ళింది .

మరో పదేపదినిముషాల్లో ఊడిపడ్డాడు ఫోన్ చేసిన పెద్దమనిషి మాధవయ్య. ఆయన్ని చూడగానే ముందుగా తయారుచేసి ఉంచిన చల్లని చల్లగ్లాసు అందిస్తూ ,"తీసుకోండి అన్నయ్యగారూ! ఎండనపడివచ్చారు" అంది సుగుణ.

"పడిరాక ఏం చేస్తానమ్మా! మేనకోడలిపెళ్ళి నానెత్తినుంది కదా! తండ్రిలా ఎలా నిమ్మకునీరెత్తినట్లు హాయిగా కూర్చోగలనూ!" అంటూ ఖాళీగ్లాసు అందించారు.

"మహావిరగబడుతున్నావ్ లేవోయ్! ఇంతకూఎందుకఘోరించినట్లూ!" " ముందీమాటచెప్పి అఘోరించు ,ఆ అమలాపుర సంబంధం కుదర్లేదుగా?" "లేదురా! వాళ్ళ గొంతెమ్మ కోరికలతో తూగలేక మానేశాం."

"హమ్మయ్య శుభవార్త చెప్పావు. .సంబంధం చెడిందని" "ఏంట్రా ఏదో ఉద్ధరించే మేనమావలా మాట్లాడి ,పెళ్ళిసంబంధం కుదర్లేదని సంతోషిస్తున్నావా? కనీసం, కూతురి కంటే పెద్దకొడుకును ఒక్కడ్ని కనలేని వెధవ్వి కబుర్లు చెప్తావురా! పైగా సంబంధం కుదర్లేదని చిరునవ్వొకటి! కాళ్ళిరగొట్టేవాళ్ళు లేక" "అన్నయ్యా! ఇద్దరూ ఇలా మాటాల కర్రల్తో కొట్టుకోడమేనా విషయం చెప్పేదేమైనా ఉందా ! నా కవతల పొయ్యిమీద నూనె కాగిపోతున్నాది. పకోడీలు చేసేందుకు.." అంటూ సంభాషణ మధ్యలో కొచ్చింది సుగుణ.

" మీ అన్నాచెల్లెళ్ళకే నాడైనా నేరుగా మాట్లాడటముందీ! ఇలా పక్కదార్లు తప్పించి? పళ్ళూడగొట్టే వారులేక" "విరగ్గొట్టుకుందూగాని లేకానీ, అసలు అమ్మాయికి ఏమేం వచ్చో చెప్పుముందు.." "అదేంటన్నయ్యగారూ తెలీనట్లు అడుగుతున్నారూ !" ఆశ్చర్యంగా అంది సుగుణ" ముందుగా వీడి నోట ఆ పకోడీలు లు కొట్టవే సుగుణా !" "అమ్మాయ్! అనంతా !పిండి కలిపి ఉంచాను, నూనె కాగిపోతున్నట్లుంది ఆ పకోడీలు వేయించమ్మా! సరే అన్నయ్య గారూ! అడిగారు గనుక చెప్తున్నా. అమ్మాయ్ పేరు అనంత, అనంతపద్మనాభ వ్రతం నాడు పుట్టిందని ఆ పేరు పెట్టారు మీ స్నేహితులు. ఇహ వయస్సు 21, కాలేజీల్లో చదివించే శక్తి లేక ఉన్న ఊర్లో ఇంటర్ తో ముగించాం. కుట్టువచ్చు, సరదాకు కరాటే నేర్చుకుంది, యోగాలో అభ్యాసముంది. ఆంగ్లం చక్కగా మాట్లాడుతుంది. భరతనాట్యం వచ్చును, సంగీతం నేనే నేర్పించాను .వంట చేతనవును. ఏదో మాత్రం అందం, రంగు..." సుగుణ మాటలకు అడ్డువస్తూ" బుద్ధి తక్కువై అడిగానమ్మా చెల్లెమ్మా! ఇవన్నీ నాకు తెలీవాయేం? అదేదో మీ నోటవిని, నా నోట ఈ నోకియా నోట, వారికీ మాట వినిపిద్దామనీ , అమేరికా సంబంధంరా" ఐనా అమేరికా సబంధం అంటే మాటలు టోయ్! నీ మాటలతో మమ్మల్ని కోటలు దాటించి కమ్మని పకోడీలు నోట కొట్టుకోనేనా వచ్చావ్! అనంతా పకోడీ ఆపేయమ్మా!, వేసినా వీడికి తేకు, నాకేపట్టుకరా!" అంటూ ఉరిమాడు స్నేహితుడ్ని .

నవ్వుతూ రెండు పళ్ళెల్లో వేడివేడి ఘుమఘుమలాడే పకోడీలతో వచ్చిన అనంత "కులాసానా మామయ్యా!" అంది. "నీకున్న మాత్రం ప్రేమ ఈ స్నేహితుడి మీద మీ నాన్నకు లేకపోయె!" "మామయ్యా! ఈ ఇద్దరి జగడాలు ఈనాటి వా ఒకటో క్లాస్ నుంచి చదువు, వయస్సులతో పాటు పెరిగిపెరిగీ ఈ నాటికి యాభైవస తరాలాయె! ఎవరెరుగరు మీ తగవుల తరంగాల తమాయింపులు.. "అంటూ మంచి నీళ్ళగ్లాసు అందించి లోనికెళ్ళింది. సుగుణ కూడా తానూ గుమ్మం పక్కనున్న అరుగుమీద కూర్చుంటూ" అన్నయ్యా! అసలు విషయం చెప్పండి!" అంది." అందుకే గదమ్మా! ఎండనపడి మూడుఫర్లాంగులు నడుచుకుంటూ వచ్చిందీ! బాగావినమ్మా సుగుణమ్మా!.." అంటూ నీళ్ళు తాగేందుకు ఆగాడు " మహారుచిగా ఉన్నాయమ్మా పకోడీలు." "మరికాసిన్ని తెమ్మంటారా మామయ్యా! అంటూ వచ్చింది అనంత. "వద్దు కాని నీవూ వినమ్మా! వారిది ఆమంచర్ల. ఆయుర్వేద వైద్యులు ఆనంతయ్యగారి కుమారుడు, అమేరికాలో అదేదో ఎమ్మెస్సుట చేసి ,అక్కడే మంచి ఉద్యోగంలో చేరాడుట! మన దేశపు సాంప్రదాయ కుటుంబంలోని పిల్లను చేయాలని వారి ఆరాటం." "మనం తూగగలమా! అన్నయ్యగారూ! ఆ అమలాపురం సంబంధమూ అంతేగా ఇంజనీరనీ, అంతే చదువుకున్న పిల్లన్నా కావాలిట లేదా పాతిక లక్షలు కావాలిట! మన వద్ద పెళ్ళి చేయనే డబ్బులేదు.." "వాళ్ళ ఆశకూలా! అమ్మాయ్ సుగుణా! అన్నీ కనుక్కునే వచ్చాను కాని ! ఎప్పుడు రమ్మంటారో చెప్పండి ! ఇప్పుడే ఫోన్ చేసేస్తున్నాను." అని మాధవయ్య అంటూండగానే, చూర్లో దోపిన పంచాంగం అందుకున్నాడు రాఘవరాం.

శుక్రవారం దివ్యంగా ఉందిరా!" అంటూ భార్యకేసి చూశాడు అదోలా." సుగుణ అర్థం చేసుకుని అంగీకారంగా తలూపింది. ఆడవాళ్ళ ఇబ్బందులేవీ లేవని ఆ చూపుల అర్థం." అన్నయ్యా! పిల్ల నచ్చినా.." "పిల్ల నచ్చకపోటానికి వాళ్ళు గ్రుడ్డివాళ్ళై ఉండాల్సిందే! బంగారపుఛాయ, బంగారానికి శోభా, సుగంధం ఇచ్చే సుగుణం ,మర్యాద ఇంకేం కావాలమ్మా!" "అవన్నీ కావు అన్నయ్యా! అమేరికా సంబంధమంటే పెళ్ళికే లక్షలవుతాయేమోని నా అనుమానం. పై పిల్లలకిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి అంతా ఐపోయింది. ఇహ ఆ పిల్లాడికి డిగ్రీ ఐనా చెప్పించాలా. .ముగ్గురి తర్వాత పుట్టుకొచ్చాడు కదా! " "అమ్మాయ్! నీవవన్నీ మర్చిపో! శుక్రవారమంటే ఎల్లుండే! వాళ్ళు వచ్చాక నీవే చూస్తావుగా! అంటూ రొంటినున్న చరవాణీని అందుకుని కొన్ని నెంబర్లు నొక్కి " అయ్యా! నేనండి ! మాధవయ్యని! మీ అబ్బాయికి అమోఘమైన సంబంధం ఉంది, మా స్నేహితుని కుమార్తె చూపులకు చక్కనిచుక్క ్వభావానికి సుగుణాలరాసి, మొన్న మిమ్మ కలిసినపుడు వారూ ఒక సంబంధం చూస్తున్నారు, అందుకే చెప్పలేదు, మన అదృష్టం కొద్దీ ఆ సంబంధం చెడింది ,అంతా మీ అబ్బాయి అదృష్టమండీ! మీ మింటికి లక్ష్మి లక్ష్మండీ వస్తున్నది! ఎల్లుండి శుక్రవారం వస్తారా! మీరే చూస్తారుగా! సాంప్రదాయకమైన సంబంధం, సరి సరి, సాయంకాలం నాల్గింటికి, రాహుకాలం ఉదయం 10/30--12 కదండీ! ఔను అంతా బాగే,సరే నండీ! ఎదురు చూస్తాం" అంటూ ఇంటి టెంకి చెప్పి, చరవాణిని రొంటిన దోపి " ఇహ వస్తానోయ్! నడిచి అఘోరించు అందాకా నాలో. నేను ఆ లొల్లాయ్ లక్షీపతిని కలిసి ఇంటికి చస్తాను, ఎన్నాళ్ళకూ వాడి కొడుకు సంబంధం తేల్చడు, కనిపించినప్పుడల్లా గొణిగిచస్తాడు, "అంటూ బయల్దేరబోతున్న మాధవయ్యను దగ్గరగా వచ్చి, గుచ్చి కౌగలించుకుని" ఒరే! నీ ఋణమెలా తీర్చుకోనురా!" అంటూ కండువాతో కళ్ళు వత్తుకుంటున్న రాఘవరాంను "ఓరి నీ! నీదంతా మేకపోతు గాభీర్యమని నాకు తెలిదుట్రా! వెధవాయ్! మన మధ్య ఋణాలూ, వడ్డీలూ ఏంటిరా! అమ్మాయ్! వీడికో గ్లాసెడు చల్లని నీ రివ్వూ!" అంటూ జోళ్ళు తొడుక్కుని బయల్దేరాడు, అటు తిరిగి కళ్ళు కండువాతో అద్దుకోడం సుగుణ గమనించక పోలేదు. పేరు అరుణ్ !మీకు అంట్లు తోమటం వచ్చా!" కనీసం తన పేరైనా అడక్కుండ ఇలా అడిగిన వాని వైపు చిత్రంగా చూసింది అనంత. 'వచ్చ'న్నట్లు తలూపింది. వంటవచ్చా!"," ఇల్లు చిమ్మటం వచ్చా?"

,"బట్టలు విస్త్రీ చేయటం వచ్చా?" ,అన్నింటికీ వచ్చన్నట్లు తలూపింది.' ఖర్మకాలి పెళ్ళిచేసుకుని అక్కడ పని మనిషిగా పెట్టను తీసుకెళ్ళడు గదా!' అనుకుంది అనంత." ఇవన్నీ అడుగుతుంటే మీకు అనుమానం రావచ్చు, అక్కడ పని మనిషిగా పెడతానేమోని.. "మనస్సు చదివినట్లే అంటున్న అతడి వేపు చిత్రంగా చూసింది అనంత. "తప్పుగా అనుకోకండి అనంతగారూ! అక్కడ పని చేయను ఇక్కడలా సర్వెంట్స్ ఉండరు. అన్నీ మనమే చేసుకోవాలి. మీకు డ్రైవింగ్ నేను నేర్పుతాను. అన్నీ కార్లలో వెళ్ళి తెచ్చుకోవాలి .ఆ దేశంలో కారు లేకపోతే కాళ్ళు లేనట్లే, మన దేశానికి మూడున్నర రెట్లు దేశం, మూడోవతు జనాభా ఉండే దేశమది .పనిలో ఎక్కువ తక్కువ లెవ్వరూ పట్టించుకోరు. నాకు మీరు నచ్చారు. మీకు నేను నచ్చితే మన వివాహం' అన్నవరం' కొండ మీద జరిపించి, వీసా రాగానే నాతోనే తీసుకెళతాను." అంటూ తన వేపు చూస్తున్న అరుణ్ ను చూసింది పరిశీలనగా అనంత.

ఆరడుగుల ఎత్తు .ఆడవారికుండే గులాబీ రంగు శరీరఛాయ. మంచి మర్యాద, అన్నీ ముందే చెప్పే స్వచ్ఛమైన మనస్తత్వం. మరి కట్నం ఎంత డుగుతారో! 'అనుకుంది అనంత. అప్పుడు పెదవి విప్పారు వారి తండ్రి "అయ్యా! ముందుగా పిల్లవాడు పిల్ల మాట్లాడుకుని వారు పరస్పరం నచ్చితేనే, మేము మాట్లాడాలని మా నియమం .మాకేమీ కట్న కానుకలు అవసరం లేదు. మావాడు చెప్పేడుగా అన్నవరం కొండమీద పెళ్ళి సింపుల్ గా జరిపించడి.అంతే మీరు, మేము పిల్లాపిల్లాడు కూడా వస్తార్లెండి. "అనగానే అంతా నవ్వారు హాయిగా.ఏంటో! మహారాణి గారు నవ్వుకుంటున్నారుతనలోతాను, ఈభృత్యుడికికాస్తంతచెప్పవచ్చా!"అంటున్న అరుణ్ని నవ్వుతూచూసి, "మన పెళ్ళిచూపుల రోజు గుర్తుకు వచ్చి.." అంది మరో మారు నవ్వుతూనూ "ఏమ చేయనూ అమేరికాలో ఉద్యోగం చేసే పిల్లవాడంటే అంతా తాగుతాడా! సిగరెట్లూ, మత్తు మందులూ అలవాటులేవని నమ్మకం ఎలా! ఇంతకు ముందే అక్కడ తెల్లదానితో పెళ్ళి కాలేదని గ్యారంటీ ఏంటి? పెళ్ళి చేసుకుని పని మనిషి కోసం అంటూ రకరకాల సందేహాలతో నా దుంపతెంపారు ఆడ పిల్ల తల్లిదండ్రులు. వారి భయాలు వారివనుకో. అందుకే నేనే అలా మొదలెట్టాను పెళ్ళి చూపుల తతంగం." అన్నాడు అరుణ్." నిజమే నండీ నిజానికి నా కిప్పుడు తీరుబాటుగా, మీతో మాట్లాడ నే సమయం లేకుండా ఉంది. ఏదో మా తమ్ముడు ఉన్నాడు గనుక కొంత వెసులుబాటుగా ఇలా శుక్రవారం రాత్రన్నా మీతో మాట్లాడను అవుతోంది." "ఔను సుమా నీవో పెద్ద నృత్య కళాశాలకు డైరెక్టర్ వు, కరాటే స్కూల్ ఓనర్వు, ఒక పెద్ద ఆడవారి వస్త్ర తయారీ సంస్థ యజమానురాలివి, సంగీత సరస్వతివి, నీ ఆదాయంతో పోల్చితే నా జీతం ఎంత అనంతా!" అంటున్న అరుణ్ నోటిని మూసింది చేత్తో కాదు సుమండీ.. మీకూ తెల్సులెండి చెప్పక్కర్లేదు మరి.




దేవదాసు పార్వతి..రోమియో జూలియెట్..లైల మజ్ను..జగ ద్విఖ్యాత ప్రేమికులు. వాళ్ళ ప్రేమ అజరామరం. ఎన్నో కథలకీ, కవితలకీ మార్గదర్శకం. ప్రేమికులకి నిత్య స్మరణీయం..ఆరాధనీయం.

వాళ్ళ కథ విషాదాంతం అయింది. అందరిచేత కంటతడి పెట్టించింది. ఒకవేళ..ఒకవేళ వాళ్ళప్రేమ సుఖాంతమైతే?

రైలు వేగంగా దూసుకెళుతోంది. ఇంకొద్ది గంటల్లో రాంబాబు దంపతులని చూడబోతున్నానన్న ఆనందం నన్ను నిలవనీయడం లేదు. కారణం...! గతం లోకి నా మనసు ఉరకలెత్తింది.

రాంబాబు ప్రేమలో పడ్డాడు. రాంబాబు నా ప్రాణ స్నేహితుడు. మాట మెతక. మనసువెన్న.

అసలు వాడు ప్రేమలో పడడమే వింత. నాకు తెలిసి, వాడు ఏ అమ్మాయివంకా ఆశగా..ఆబగా కాదు కదా కనీసం మర్యాదపూర్వకంగా కూడా చూడడు. అలాంటిది ప్రేమలో పడడం. అమ్మాయి ఎవరని పదే పదే వాడిని అడిగిన మీదట చెప్పాడు రమణి అని.

"రమణి అంటే బుల్లబ్బాయిగారి కూతురు కాదు కదా!" ఒకింత భయపడుతూ అడిగాను.

అవునన్నట్టుగా చిన్నగా తలూపాడు.

అయిపోయింది. వీడు ప్రేమలో పడడమంటే మృత్యు ముఖంలో నిలబడడమన్న మాట. బుల్లాబ్బాయి అంటే సినిమాల్లో విలన్ లాగానే బాగా ఆస్తిపరుడు. రౌడీ. వాడంటే అందరికీ భయమే! అలాంటి వాడి కూతురిని ప్రేమించాడా? ఇంకేవన్నా వుందా?

"ఒరేయ్! నువ్వు ఏ అమ్మాయిని ప్రేమించావో తెలుసుకదా! నా మాటిని ప్రేమాలేదు..దోమాలేదు. హాయిగా గంతకుదగ్గ బొంతను చూసుకుని పెళ్ళిచేసుకుని తర్వాత ప్రేమించు. అంతేకాని ముందు ని ప్రాణానికి ఆనక నీతో పాటు వుండే నాలాంటి వాళ్ళ ప్రాణాలకి ముప్పు తీసుకురాకు."అన్నాను.

"ప్రేమకు ఆస్తి, అంతస్తూ, హోదాలు అడ్డురావురా! ప్రేమ ఎప్పుడు ఎలా పుడుతుందో తెలియదు. అది అసంకల్పితం! నా ప్రాణంపోయినా ఫర్వాలేదు. కానీ చచ్చేప్పుడు రమణి పేరే జపిస్తూ చనిపోతా"అని చెప్పాడు.

"ఏరా! ప్రేమ సినిమాలు కాని ఎక్కువగా చూస్తున్నావా? నిజ జివితంలో అవన్నీ సాధ్యం కావు. వాళ్ళ నాన్నకి తెలిసిందంటే ఎముకలోకి సున్నం లేకుండా చేస్తాడు. ఏమనుకుంటున్నావో!"అన్నాను ప్రేమగా కోప్పడుతూ.

"నువ్వెన్నన్నా అనరా తను లేని నేను లేను."అని వెళ్ళిపోయాడు.

చెట్లమ్మటా పుట్లమ్మటా తిరుగుతూ..ఒకరికొకరు బహుమతులిచ్చుకుంటూ..ఊరివాళ్ళ దృష్టిలోకి తద్వారా బుల్లబ్బాయి

చెవుల్లోకీ వెళ్లారు.

బుల్లబ్బాయి అగ్నిహోత్రుడయిపోయాడు.

కూతుర్ని ఇల్లుదాటకుండా కట్టడి చేసి. రాంబాబుకి స్ట్రాంగ్‌గా వార్నింగ్ ఇచ్చాడు.

రమణి కనిపించక మా వాడు తిండి మానేశాడు. ఒంటి మీద శ్రద్ధ పెట్టట్లేదు. వాడిని చూస్తే జాలివేస్తోంది. వాడు ఏమైపోతాడోనన్న బెంగ పట్టుకుంది.

"ఒరేయ్..నువ్వు ఆమెని అంతగా ప్రేమిస్తున్నావు గాని తను నిన్ను ప్రేమిస్తుందంటావా?" కోపంగా అడిగాను.

"ప్రేమన్నది వ్యాపారం కాదురా నేనింతిస్తాను..నువ్వింతియ్యి అనడానికి"అన్నాడు నిర్లిప్తంగా.

"నీ కిదే చెబుతున్నాను. నువ్వు ఆమెని ఎంతగా ప్రేమిస్తున్నావో..ఆమె కూడా నిన్నంతగా ప్రేమిస్తేనే నేను మీ ఇద్దర్నీ ఒకటి చేసే బాధ్యత తీసుకుంటా. ఒకవేళ నీది వన్వే లవ్ అయితే మాత్రం నేనేం చేయలేను" అన్నాను.

నేను ఆర్మీ సెలెక్షన్స్ లో సెలెక్ట్ అయ్యాను. నాకు మొదటినుండి సైనికులంటే చాలా గౌరవం..ఇష్టం. అందుకే అదే కోరికతో అహర్నిశలూ శ్రమించి నా బాడీని తీర్చుదిద్దుకున్నాను. నేనింకో వారంరోజుల్లో ట్రైనింగ్ కి వెళ్ళాలి. నేనెళ్ళేలోపులో వాడికేమన్నా చేయాలి. నేను లేకపోతే వాడు ఒంటరి వాడైపోతాడు.

ఆ మరుసటిరోజు తనని స్నేహితురాళ్ళతో ఒకసారి గుడికి రమ్మని చాకలి మంగమ్మతో కబురుపెట్టాను.

రమణిని చూశాను. దిగులూ విచారం ముఖంలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. ఆమె దగ్గరగా వెళ్ళి "మావాడంటే నీకిష్టమేనా?"అని అడిగాను.

తను "ఊ"అంది.

"చాలు..ఈ సమాధానం కోసమే నేనొచ్చాను. ఇహ మీ ఇద్దరి పెళ్ళి సాక్షాత్తు ఆ దేవుడు దిగొచ్చినా ఆపలేడు"అన్నాను.

చెప్పకూడదు కాని.. నాకూ గొప్ప ఉద్వేగంగా వుంది. ఇద్దరు ప్రేమికులని దగ్గరుండి కలపబోతున్నాను.

రాత్రి పదకొండు గంటలు.

పల్లెటూరు కాబట్టి చీకటి వీరవిహారం చేస్తోంది.

వాళ్ళని కలిపేందుకు పకడ్బందిగా ప్లానేశాను.

వాళ్ళిద్దరి చేత గుడిలో దండలు మార్పించి రైల్ ఎక్కే ఏర్పాటు చేశాను.

విషయం బయటకి పొక్కి బుల్లబ్బాయి రౌడీల్ని పంపేదాకా వెళ్ళింది.

రైలు బయల్దేరుతోంది.

రౌడీలు మమ్మల్ని తరుముతున్నారు. నేను వాళ్ళని ఎదుర్కొంటూ ప్రేమికులిద్దరిని వేగమందుకోబోతున్న రైల్లో ఎక్కించేశాను.

హమ్మయ్యా వాళ్ళు వెళ్ళిపోయారు. తర్వాత నేనూ హైవే మీదకెళ్ళి సిటీ వెళుతున్న లారీ ఎక్కేశాను.

చావుతప్పి కన్ను లొట్టబోవడమంటే ఏమిటో అర్థమైంది. ఇప్పటికీ అంత రిస్క్ ఎలా తీసుకున్నానో తల్చుకుంటే ఒళ్ళు గగుర్పొడిచే ఆశ్చర్యం కలుగుతుంది.

నేను నా ట్రైనింగ్ హడావుడిలో బిజీ అయిపోయాను. ఆ తర్వాత నార్త్ ఇండియాలో పోస్టింగ్. ఊరికి వెళ్ల లేకపోయాను. దానికీ కారణం వుంది. ఆ ఊళ్ళో నా అన్న వాళ్ళెవరూ లేరు. మా అమ్మ రాంబాబు పెళ్ళికి ఆర్నెళ్ళ ముందే చనిపోయింది.

తర్వాత ఢిల్లీలో మా ఊరివాడొకడు కనిపించి..రాంబాబు రమణి మా ఊళ్ళోనే ఉంటున్నారని..వాళ్ళ నాన్న మాత్రం వీళ్ళని చేరదియ్య లేదని. వాళ్ళకి పుట్టిన పిల్లాడికి నా పేరే పెట్టారని. కనీసం మనవడిని చూసైనా తాత మారతాడని రమణి ఆశ పడుతోందని చెప్పి వాళ్ళ అడ్రస్ ఇచ్చాడు.

నేను ఒకట్రెండు ఉత్తరాలు రాస్తే జవాబు లేదు. అవునులే నాకంటే ఏ బాదర బందీ లేదు. వాళ్ళ సంసారం ఎన్ని ఒడిదుడుకులెదుర్కుంటోందో?

ఇన్నాళ్ళకి వాళ్ళని చూడ్డానికి వెళుతున్నాను.

నన్ను చూడగానే వాళ్ళెలా రియాక్ట్ అవుతారు?. నా మూలంగా కలిసిన వాళ్ళు నన్ను ఆకాశానికి ఎత్తేస్తారేమో. వాళ్ళబ్బాయికి నా పేరే పెట్టారంటే వాళ్ళ ప్రేమకి జీవం పోశానని..నేనంటే ఎంత అభిమానం?

నేను ఊరికి చేరి అడ్రస్ కనుక్కుంటూ వాళ్ళింటి దగ్గరకి చేరాను. బయట అరుగు మీద రాంబాబు కూర్చుని వున్నాడు. మనిషి నిస్తేజంగా..నిర్లిప్తంగా వున్నాడు. చూడంగానే గుర్తుపట్టడం కష్టం. ఎన్నో సమస్యల్లో..బాధల్లో కూరుకుపోయినట్టుగా వున్నాడు. నేనింకో పది అడుగులు వేశాను. లోపలినుండి రమణి సాధింపులు వినిపిస్తున్నాయి.

"..అనవసరంగా నిన్ను పెళ్ళి చేసుకున్నాను. మా అమ్మానాన్న చెవినిల్లు కట్టుకుని చెప్పారు. ప్రేమా లేదు దోమాలేదు అని. నేను విని చస్తేగా. నెత్తిమీద శని గాడు వున్నాడు. ఐశ్వర్యంలో పుట్టి పెరిగిన నేను నీ దగ్గర ఇలా ముష్టి జీవితం గడపాల్సొస్తోంది. గాడిద చాకిరి తప్ప సుఖ పడింది లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా మా నాన్న నన్ను చేరదియ్యడం లేదు. నా ముందే నా తోడ బుట్టిన వాళ్ళు జల్సాగా కార్లలో తిరుగుతూ..డబ్బు కర్చు పెడుతూ హాయిగా వున్నారు. నా కడుపు కుత కుతలాడుతోంది. పైగా నీ స్నేహితుడొకడు. తగదునమ్మా అని మన ప్రేమ వ్యవహారంలో కలగజేసుకుని మనిద్దరిని ఒకటి చేశాడు. ఈసారెప్పుడైనా కనిపిస్తే ముఖాన పేడనీళ్ళు జల్లుతాను.అనుభవిస్తా డు ..అంతకంత అనుభవిస్తాడు. నిన్ను ఎన్నన్నా ఏం లాభం? అసలు నీలో చలనం వుంటేగా?.."ఆమె వాగ్ధోరణి సాగిపోతోంది.

"నాకూ అర్ధమయిందిలేవే! ప్రేమంటే సినిమాల్లో..నవలల్లో కనిపించినంత అందంగా వుండదని..జీవితాన్ని నరకం చేస్తుందనీ..ఛ..ఛ..ప్రేమ పెళ్లిచేసుకుని సరిదిద్దుకోలేని తప్పుచేశాను.."మావాడు గట్టిగానే గొణుగుతున్నాడు.

నేను భూమి లోకి కూరుకుపోతున్న అనుభూతి కలిగింది. ఇంకానయం వాళ్ళు ఎదురుపడ్డాను కాదు..అమ్మో ఎంత ప్రమాదం తప్పింది. అప్పుడు వీళ్ళని కలపడానికి ప్రాణాలకి తెగించి ఎంత రిస్క్ చేశాను? ప్రేమికులని ఒకటిచేయడం తప్పని అర్ధమైంది. ప్రేమ కథ సుఖాంతమైతే ఆ తర్వాతి జీవితం దుఖాంతమవుతుందని బాగా అర్ధమైంది. నేను వడి వడిగా స్టేషన్ వైపు అడుగులేశాను..శాశ్వతంగా ఆ ఊరి నుండీ బంధం తెంచుకుంటూ..



“ ఏదో ఒక  ప్లే స్కూలులో చేరుద్దాం.  అంటే పట్టుపట్టి తీసికెళ్ళి  ఆ స్కూలులో చేర్పించావు. ఇప్పుడు చూడు. వాళ్లు మనల్ని ఎలా సతాయిస్తున్నారో”... మా వారు నా పైన విరుచుకుపడ్డారు.

“శనివారం ...ఓ బాక్సులో కాస్త ఫ్రూట్ సలాడ్ చేసి పంపండి.”  అని స్కూలు వాళ్లు పాపకిచ్చిన పంపిన నోట్ అప్పుడే ఆఫీసు నుంచి తిరిగొచ్చిన ఆయన చేతిలో పెట్టాను.

“ మొన్ననే కదా.. పాత బట్టలుంటే పట్టుకురండి అంటే తీసికెళ్లి ఇచ్చొచ్చాం. మళ్లీ కొత్తగా ఇదేంటి?”

“ అక్కడ మామూలు స్కూళ్లలా ఉండదట. ఎప్పుడూ ఏదో ఒక యాక్టివిటీ ఉంటుంది” ఆయనకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాను.

“ డబ్బులు దండుకోటానికి ఏదో ఒకటి చేస్తూంటారులే

ఓ రోజు తలో పది రూపాయలు పట్టుకురమ్మంటారు. ఇంకోసారి మీరు చదివిన కథలు పుస్తకాలు తెమ్మంటారు. ఏమిటిదంతా?

“ అక్కడకు వెళితే కదా మనకు తెలిసేది... ఓసారి చూసొద్దాం”

“ పేరెంట్స్ కూడా వెంట రావాలి” అని  నోట్ లో ఉంది.  అది గుర్తు చేసుకుంటూ చెప్పాను.

“  శనివారం మాత్రం  బయటకు రావటం నా వల్లకాదు. కుదిరితే నువ్వువెళ్లు” కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు.

“ మనం వెళ్లకపోతే సిరి  చిన్నబుచ్చుకుంటుంది.  ” అన్నాను.

అంతే ఆయన కోపం పొంగు చప్పున చల్లారింది.

“ సరే...చూద్దాంలే” అంటూ  బాత్రూంలోకి వెళ్లిపోయారు.

మేము ఇద్దరం సాఫ్ట్ వేర్ ఉద్యోగులం.

ఉదయం ఆఫీసుకు వెళితే రాత్రి దాకా తిరిగిరాం.

సిరికి ఇంకా మూడేళ్లు నిండలేదు.

పగలంతా తనని చూసుకోటానికి ఓ ఆయాను ఏర్పాటు చేశాం.

వీడియోగేమ్స్ ఆడుకోవటం, టీవీ చూడటం.. ఇదే పాప పని.

ఓ ఆరు నెలలపాటు ఎక్కడయినా మంచి ప్లే స్కూలులో చేరిస్తే తన వయసు వాళ్లు స్నేహితులవుతారు. ఆటపాటలతో ప్రయోజనకరమైన కాలక్షేపం అవుతుంది అనిపించింది.

గూగుల్ సెర్చి చేస్తే నగరంలో పేరుమోసిన ప్లే స్కూలు వివరాలొచ్చాయి. నలుగురైదుగురు కొలిగ్సుని కూడా ఆరా తీశాను.

" ఏదో ఒక స్కూలులో చేరిస్తే సరిపోయేదానికి... దేనికింత అవస్థ? అని ఆయన విసుక్కున్నా.. నా ప్రయత్నాలు మాత్రం నేను మానలేదు.

ఇంట్లో అమ్మానాన్నలు చెప్పిందాని కంటే, బయట వాళ్లు చెప్పిన విషయాలు పిల్లల్ని బాగా ఆకర్షిస్తాయి. త్వరగా కొత్త అంశాలు నేర్చుకోగలుగుతారు. అది నాకున్న బలమైన అభిప్రాయం.

ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటూ కూడా పాపకి సరైన చదువు చెప్పించకపోతే ఎలా? అన్న పట్టుదల కూడా దానికి తోడయ్యింది.

చివరికి ఓ ప్లే స్కూలు ఎంపిక చేసుకున్నాను.

అన్ని హంగులూ ఉన్నాయి అక్కడ. విశాలమైన హాలు, పిల్లలకు ఆటవస్తువులు, పెయింటింగ్ సామాగ్రి, బొమ్మల పుస్తకాలు అద్దాల బీరువాల్లో కనిపిస్తున్నాయి. పిల్లలు కాసేపు ఆడుకున్న తర్వాత పడుకోటానికి కుషన్ బెడ్స్ లాంటివి ఏర్పాటు చేశారు.

నలుగురు పిల్లలు కనిపించారు

పళ్లెంలో ఉన్న పిండిని తీసి ఓ బాక్సులో పోస్తోంది ఓపాప.

ఇంకో పిల్లాడు బొమ్మకు రంగులద్దుతున్నాడు.మిగిలిన ఇద్దరు పిల్లలు నాలుగయిదు కారు బొమ్మలు ముందేసుకుని ఈ లోకంతో తమకు సంబంధం లేనట్టుగా ఉన్నారు.

“ మాది మాంటిసోరి విధానం. మూడేళ్ల వయసు నుంచి ఎనిమిదేళ్ల వయసు వారు వరకూ చదవవచ్చు. ఆ తరగతులు పక్కనున్న భవనంలో సాగుతాయి. క్రమంగా ఏడాదికో తరగతి చొప్పున పెంచుకుంటూ పోవాలనుకుంటున్నాం ” చెప్పింది ఆవిడ. ఆమె మాటతీరు ముచ్చటగొలిపేలా ఉంది.

అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసి మన దేశానికి తిరిగొచ్చి పిల్లలకు విలువైన విద్య అందించాలనే సంకల్పంతో ఈ ప్లే స్కూలు ఏర్పాటు చేశానని మాటల్లో చెప్పుకొచ్చింది.

అక్కడున్న ముగ్గురు టీచర్లు మంచి ఇంగ్లిషు మాట్లాడుతున్నారు. ఈ వాతావరణంలో సిరి బాగా రాటుదేలుతుందనిపించింది.

అన్నింటిలోకి నాకు నచ్చిన విషయం..

“ఇరవై మందిని మించి తీసుకోం” అని చెప్పటం.

“ అమ్మో అంత ఫీజా? చిన్న పిల్లకి ఇంత అవసరమా?” అని ఆయన అభ్యంతర పెట్టినా నేను పట్టించుకోకుండా స్కూలు వాళ్లడిగిన ఫీజు మొత్తం చెల్లించి తిరిగొచ్చాను.

మర్నాటి నుంచి సిరి స్కూలుకి వెళ్లటం ప్రారంభించింది. రోజుకి మూడు గంటలు.. ఓ చిన్న బాక్సులో కాసిని బిస్కెట్లు, పాలు ఇచ్చి ఆటోలో పంపేవాళ్లం. తను తిరిగొచ్చేసమయానికి ఆయా ఇంటి దగ్గర ఉండేది. అంతా బానే సాగుతోందని నాకు అనిపించినా, ఆయనకి మాత్రం భిన్నాభిప్రాయం ఉండేది.

“డబ్బులు దండుకునేందుకే ఈ హంగామా అంతా...” అని నా మాటల్ని తేలిగ్గా కొట్టి పడేసేవారు.

శనివారం రానే వచ్చింది.

సిరిని వెంటబెట్టుకుని స్కూలుకు వెళ్లాం.

పాపను తమకు అప్పచెప్పి, పేరెంట్సు అందరినీ దగ్గర్లోని ఇంజనీరింగ్ కాలేజికి రావలసిందిగా సూచించారు స్కూలు వాళ్లు.

“ ఈ స్కూలు వాళ్లకి పనిలేదు. మనల్ని ఇబ్బంది పెట్టటానికి కాకపోతే దేనికిదంతా ...” మళ్లీ విసుకున్నారు ఆయన.

“ ఇంత దూరం వచ్చాం కదా... అసలేమిటో చూద్దాం” అన్నాను ఆయనకి సర్ది చెబుతూ.

వాళ్లు చెప్పిన కాలేజికి వెళ్లాం. మరికాసేపటికి పిల్లలు, స్కూలు టీచర్లు వ్యానులో అక్కడికొచ్చారు.

అక్కడ జరుగుతున్నదేమిటో మాకు అర్థం కాలేదు.

“ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా ఈ కార్యక్రమం చేపట్టాం. పిల్లలు తమ ఇంటి నుంచి తెచ్చిన ఫ్రూట్ సలాడ్ కొనుగోలు చేయండి. మీకు నచ్చిన మొత్తం ఆ చిన్నారులకు చెల్లించండి”

ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ అక్కడ గుమిగూడిన దాదాపు వంద మంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చెప్పారు.టీచర్లు చిన్న కప్పుల్లో ఫ్రూట్ సలాడ్ నింపితే... పిల్లలు వాటిని విద్యార్థుల దగ్గరకు స్వయంగా తీసికెళ్లి అందించటం మొదలు పెట్టారు. పదిరూపాయలు విలువ చేసే కప్పు సలాడ్ కి ఒక్కొక్కరు రూ. 50, రూ.100 ఇవ్వటం ప్రారంభించారు. ఒక విద్యార్థయితే సిరికి ఏకంగా రూ.500 కిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

పిల్లలే కాదు. స్కూలులో పనిచేసే ప్రతి ఒక్కరూ సలాడ్ తెచ్చిన వాళ్లలో ఉన్నారు.

గంటలోపే కార్యక్రమం పూర్తయింది. బాగానే డబ్బు పోగయ్యింది.

అక్కడ వీడ్కోలు తీసుకున్నాక ఐదు నిముషాల లోపు దూరంలో ఉన్న వృద్ధాశ్రమానికి పిల్లల్ని వెంట బెట్టుకుని వెళ్లారు. వచ్చిన సొమ్మును అక్కడున్న వృద్ధులకు కాస్తకాస్త చొప్పున పిల్లల ద్వారా అందించారు. అది అంత పెద్ద మొత్తం కాకపోవచ్చు. కానీ వృద్ధులంతా కదిలిపోయారు. పిల్లల్ని ప్రేమగా గుండెలకు హత్తుకుని ముద్దులతో ముంచెత్తారు. కొందరయితే కన్నీళ్లుపెట్టుకున్నారు.

నిజంగా ఇదో అద్భుత దృశ్యమనిపించింది.

పాఠాలు చెప్పే స్కూళ్లు చాలానే ఉంటాయి. కానీ..పిల్లలకు మానవత్వం గురించి నేర్పేవి, ఎదుటి మనిషికి ఇవ్వటంలో కలిగే ఆనందం గురించి తెలియచెప్పేవి అరుదుగా ఉంటాయనిపించింది . బాల్యంలోనే ఇలాంటి వాటికి అలవాటుపడితే భవిష్యత్తులో వారు మరింతగా రాణి స్తార నటం లో ఎలాంటి సందేహంలేదు.

''పాప స్కూలు విషయంలో నా ఎంపిక సరైనదే'' అన్న నిర్ణయానికొచ్చాను.

మా వారు కూడా అదే అభిప్రాయానికి వచ్చినట్టున్నారు. అప్పటివరకూ నామీద చిర్రుబుర్రులాడిన ఆయన నోరు మెదపలేదు. మేమే కాదు.

అక్కడి కొచ్చిన తల్లిదండ్రులందరం జీవితంలో కొత్తపాఠం నేర్చుకున్న విద్యార్థులమయ్యాం.




ముందు మెల్లగా మొదలైంది. .....

'టక్. టక్.. తేజా! తేజా!'

నిశ్శబ్దం!..

'ఠాక్.. . ఠాక్.. ఈ సారి గట్టిగా!

' తేజా! తలుపు తెరు..'

నిశ్శబ్దం...

'తేజా!తలుపు తెరువు నాయనా!..' ఇప్పుడు గొంతు మారింది. తలుపు మీది శబ్దం దరువు మారింది. 'ధబ్..ధబ్.. ధబ్..'

'తమ్ముడూ! తలుపు తెరవరా! అన్నం నీళ్ళు లేకుండా ఎన్నాళ్ళురా!'

ఆ గదిలో...చీకటిలో.. వెలుగు ప్రసరించదు. శబ్దం వినపడదు.

చీకటి అనిర్వచనీయమైన సుఖం. శాశ్వత శాంతి. వెలుతురు అక్కడ నిషిద్ధం!

కళ్ళు తెరిచాడు తేజ. చీకటి నల్లని కన్ను .. కళ్ళ ముందు.... కను రెప్పలు భారంగా మూత పడ్డాయి. కన్ను తెరిచినా, కన్ను మూసినా ఒకటే! తేజ శ్వాస భారంగా ఆడులోంది. , నెమ్మదిగా కొట్టుకునే గడియారంలా. అది ఒకప్పుడు కమ్మరి కొలిమిలో ఊదిన నిప్పు రవ్వ. దాని మీద చీకటి సుత్తి. అదే జీవ శక్తి. .....ఇప్పుడు... క్రమంగా బలహీన మవులోంది.

తేజ బయటి శబ్దాలు లీలగా వినపడుతున్నాయి. తల తిప్పి చూసాడు.

ఒక వెలుగు రేఖ కత్తిలా, తళ తళ మెరుస్తూ!!

ఛీ.ఛీ. వెలుతురు చీకటిని హత్య చెయ్యాలని చూస్తున్నది.. .

తలలో జోరీగల గుంపులు తిరుగుతున్నాయి.

'తేజ టెన్త్ లో రాంక్ హోల్డర్. ఇంటర్ లో మంచి మార్కులు సంపాదించాడు. ఎంసెట్ లో రాంక్ వంద లోపే! అక్కడే ఏదో మాయదారి రోగం పట్టుకుంది. అంతా మా ఖర్మ.!' తల్లి తల్లడిల్లుతూ అన్న మాటలు. ఈ గదిలోకి వచ్చిన తర్వాత, ఈ చీకటితో మమేకం అయిన తర్వాత, తల్లి మాటలు తేజను ఏ మాత్రం కదిలి౦చలేదు. తల్లి ప్రేమ ఉందా? ఉంటె! నిజంగా వుంటే, వీణ గురించి హేళనగా, వ్యంగంగా మాట్లాడుతుందా? తల్లి ప్రేమ లేదు. చిన్నప్పటి నుంచి పెంచినది కాబట్టి 'అనుబంధం' మాత్రమే వుంది. పిల్లల మీద పెద్దలకు, 'వాత్సల్యం' అనే ఒక మెరుపు దారం మాత్రమే వుంటుంది. అది అభేధ్యమైన లోహ నిగళం కాదు..

అనుబంధం ప్రేమ కాదు!.

వాత్స్యలం ప్రేమ కాదు!.

వీణ ను కాలేజ లో చేరే వరకు చూడలేదు. చూడగానే.. విద్యుత్ ప్రవాహపు చరుపు చెళ్ళు మంది. షాక్ ఆఫ్ ఎలక్ట్రో మోటివ్ ఫోర్స్! అంతలోనే.. షాక్ పోయి నిర్మల నిర్వాణ ప్రశాంతత. పూర్ణ చంద్రుని కాంతిలో వికసించిన కలువను చూసినట్టు అనిపించింది. మలయ పర్వతాల మీదనుంచి వచ్చిన తుషార శీతల పవనంలా అనిపించింది. కాంతి నిండిన మనోహరమైన కన్నులలో మనసుని శాసించే చల్ల దానాలు ఎన్నో!

'ప్రేమ, దోమా కాదు. అది కామ. ఈ వయసులో అందరికీ వచ్చే రోగం వీడికి వచ్చింది. పట్టాభి రామ్ దగ్గరికి తీసుకు వెళితే, ఆయన వీడి కళ్ళు తెరిపిస్తాడు.' తండ్రి కర్ణ కఠోరమైన స్వరం…

'ఆ. ఇదంతా ఈ వయసులో వచ్చే జబ్బు. దీనికి మందు లేదు. అన్ని వైరస్ లాగానే అది కూడా 'స్వయం నాశనం' చెందుతుంది. ఈ వైరస్ కొన్ని వారాల్లో, నెలలో, మరీ ఉధృతమైన రోగమైతే కొన్ని సంవత్సరాలు వుంటుంది. అంతే.. . జీవన క్రమంలో ఇదో దశ.. ఫేజ్ .. 'నువ్వు లేక నేను జీవించ లేను' అన్న వాళ్ళలో దాదాపు వంద శాతం మంది ఇంకా బతికే వున్నారు ఆ 'నువ్వు' లేక పోయినా!

తలుపు బయట మాటలు. ఎవరో ఆ మహానుభావుడు. ఇంత టేలెంట్ ఇక్కడే వుంటే ఇంకా పట్టాభి రామ్ ఎందుకు?

క్రమంగా తలుపు బయట ఇతర గొంతుకుల శబ్దం బలహీన మైంది. కొత్త 'వింత' అయి పోయింది. గొంతులు, ఆ తాలూకు మనుషులు రావడం తగ్గాయి.

ఇంటి వాళ్లే! రోజుకు కనీసం మూడు సార్లు తలుపు కొడతారు. ఇవాళ అక్క వచ్చింది. ఆమెకు విసుగు వచ్చే వరకు ఇలా 'ద్వార బంధ రోదన' వుంటుంది. తర్వాత, అదీ ఆగి పోతుంది...ఏదీ శాశ్వతం కాదు.

నిత్యమైన, స్వచ్ఛమైన చీకటి ఒక్కటే మిగిలి వుంటుంది.

వెలుతురు మోసం! దగా!. ఇదే నిజమని నమ్మిస్తుంది! స్వల్ప కాలానికి సంతోషాన్ని ఇస్తుంది.

వీణ ను చూస్తానని అమ్మ చెప్పింది. తేజ కళ్ళల్లో వెలుతురు! మోసకారి వెలుతురు!

నమ్మాడు. వీణ ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఆ సందుల్లో కారు వెళ్ళ లేక పోయింది. పెద్ద రోడ్డు దగ్గర దిగి సందులోకి వెళ్ళారు.

చిన్న పెంకుటిల్లు. ఒకటే తలుపు. ఇంటినీ, వీధినీ విడ దీస్తూ చిన్న అరుగు. వీణ తలుపు దగ్గరే వుంది. ఎప్పటి నుంచి ఎదురు చూస్తోందో? వీణ చూడగానే రక్తంలో, నరాలలో, మెదడులో, గుండెలో, మనసులో అనిర్వచనీయమైన ఆనందం! నల్లటి వత్తైన జుట్టు మెరుపు చుక్క లాటి ఆమె మోహం పై కప్పు కుంది. అప్పుడు తెలియలేదు అది విషాదపు తొలి మెట్టు అని.

లోపలికి ఆహ్వానించింది...

లోపల రెండు కర్ర కుర్చీలు, ఒక ప్లాస్టిక్ కుర్చీ. పాత కాలపు టీ పాయ్... శబ్దం చేస్తూ ఫేన్ తిరుగుతూ వుంది.

స్టీల్ గ్లాస్ లో మంచి నీళ్ళు తీసుకు వచ్చి ఇచ్చింది వీణ. అమ్మ నీళ్ళు తాగ లేదు. నడుము వంగిన ఒక ముసలాయన వచ్చాడు. 'మా నాన్న.' అంది వీణ. లోపలనుంచి అంత కన్న వంగిన ఒక ముసిలావిడ వచ్చింది... ఆవిడ

చేతిలో టీ కప్పులు. 'మా అమ్మ' అంది ఆవిడను చూపిస్తూ. తీక్షణమైన కాంతి వేడిలో పచ్చటి మొక్కలు ఎండి పోతాయి. అలాగే, లేమి అనే వేడికి వయసు, అందం, లాలిత్యం ఇగిరి పోయాయి. వయసు కన్న ముందే ముదిమి వచ్చింది.

అసహనంగా కూచుని వుంది అమ్మ...టీ తాగలేదు. ఎలాగో చిరాకు బయటకు కనపడకుండా నిగ్రహంతో నిర్వహించ గలిగింది. కారులో కూర్చున్న తర్వాత అంది. 'బాగుంది.. బాబూ.. చాలా బాగుంది.' అంది. ఆ మాటల్లో వ్యంగం స్పష్టంగా అర్థమైంది తేజ కు.ఆ రాత్రి నిద్ర పట్ట లేదు. బోలెడంత సిలబస్... చదవాల్సింది చాలా వుంది... రాత్రి హాలులో మాటలు వినపడ్డాయి.

'చూసావా పిల్లని.''ఆఁ.. అయ్యింది ఆ భోగం.'పిల్ల బాగుందా?''బాగుంటే చాలా? అదొక్కటేనా? పాత బొళ్ళ కొంప.. అలాగా జనం వుండే బస్తీ. పిల్ల పేరే చిత్రం గా వుంది. వీణ ట. వీణ. మరీ జాణ లా వుంది. మన వెంగళప్ప ని బుట్టలో పడేసింది. గొప్ప ఇంటి కోడలవాలని పేరాశ..'శూలాల్లాటి వెటకారపు మాటలు...'మర్యాదలు?'

'ఆఁ.. ముందు పంపు నీళ్ళు...తర్వాత టీ చూరు నీళ్ళు.''అయితే మన వాడికి జీవితాంత నిరీక్షణ.. వీణ కోసం.'పెద్ద పెట్టున నవ్వులు. 'అంతు లేని నిరీక్షణ. ఇక వీణ, ముసలి, గూని తండ్రి, చిరుగు చీర తల్లి, పొగ మంచు లాటి జ్ఞాపకాలే!'

మరొక్క సారి నవ్వులు. జంతువును చంపేటప్పుడు హైనా మృగాలు నవ్వే నవ్వులు. మర్నాడు వీణ కాలేజీ కి రాలేదు. మరో రెండో రోజులూ అదే పరిస్థితి.

నాలుగు రోజుల తర్వాత తేజ వెళ్ళాడు .......రాత్రికి రాత్రి ఎక్కడకో వెళ్లి పోయారుట.మరునాడు కాలేజీ కి ఉత్తరం రాసింది వీణ.'చీకటికి వెలుతురుతో స్నేహం కుదరదు. మన స్నేహం నాకు, మా తల్లి తండ్రులకు, అంధకారం మిగిల్చింది. లేడి పిల్ల, తన తోటిదే కదా అని పులి పిల్ల తో స్నేహం చెయ్య కూడదు. అది ప్రకృతి విరుద్ధం. అందరినీ కలిపేది చీకటి. మళ్ళీ మన కలయిక వుంటే..... అక్కడే.' తేజ కి అర్థం అయ్యింది ఏమై వుంటుందో! దుర్మార్గులు తల్లి తండ్రులు...వీణను బతక నిస్తారా! ఎప్పటికైనా వీణ బ్రతుకు ప్రశ్నార్థకమే !చీకటి అంటే తిరోగ మనమనీ, తిరోగామ వైఖరి అని, వాదించే వాడు తేజ. ' చీకటి అంటే తిమిరం, ఈ 'తి' అనే అక్షరం తో మొదలయ్యే పదాలన్నీ ఈ వైఖరినే సూచిస్తాయని నేను అనుకుంటాను. తిరిపెం (బిక్షాటన), తిట్టు (దుర్భాష), తిక్క (మూర్ఖత్వం), తీట (దురద ), తీపు (సన్నని నొప్పి) ఇలా ఎన్నో.' ఇప్పుడు.. అది మారి పోయింది. చీకట్లు లోకానికి అందానిస్తాయి. చీకటి తన నల్లని చుక్కని నిండు జాబిల్లి మీద కూడా పెట్టింది. చందమామ అందం దానితో ద్విగుణీకృత చీకటిలో సౌందర్యం వుంది. చిరు నవ్వుల పాపాయి పాల బుగ్గల మీద చుక్క బొట్టు, కంటి

పాప, కను బొమ్మలు, మబ్బులు, కాళీయ మర్దనుడూ, కలువలు, చీకటీ అన్నీ నలుపే! నల్లని రంగు బొల్లి రోగాన్ని దరి చేరనీయదు. తీయని గొంతుల కోకిలలు, తళ తళ మెరుపులా నెమలి ఈకలు, తుమ్మెదలు నల్లనివే. నలుపు, చీకటి లేక

పోతే మనుషులే లేరు.

మనిషి లేని భూమి కరిగించిన సీసం పొంగే ఎడారే! మిణుగురు పురుగులూ, నల్లటి మేఘాల్లో తటిల్లతలూ, నక్షత్రాల కాంతి, చంద్ర కాంతి అందాలు, చీకటి లేక పోతే ఉండగలవా? ఈ గదిలో, ఈ నిబిడాంధకారంలో నల్లటి మబ్బులు కవోష్ణ జలరాసులను కురుపించాయి.

ఉప్పు సముద్రం చేరని వాన నీరు. ఇంకెందుకు.. ఇదీ 'ఉప్ప'నేగా.. 'చీకట్లు నల్లని కాంతులతో భూమి మీద అడుగు పెట్టాయి. నిశ అనే స్త్రీ భుజాల మీద ఎక్కి, శిరస్సు మీద నిలబడి, నక్షత్రాలనే స్త్రీల చెక్కిళ్ళను స్పృశించి, ఆకాశం లోకి పాకి, చంద్రుని తాకి, కొండలలో దూకి, మెల్లగా భూమి మీద ప్రవేశించింది చీకటి. చీకట్లు లోకానికి అందాన్ని చేకూరుస్తాయి.

చంద్రముఖి ముఖం మీద కస్తూరి బొట్టు పెట్టాయి. నల్లని వంకీల జుట్టు కలిగిన స్త్రీ కనుబొమ్మలనే విల్లు బాణాన్ని తొడిగాయి. కలువ వంటి కను రెప్పల మీద వాలాయి. లేడి కన్నుల వంటి కన్నులు కలిగిన స్త్రీ బంగారు చెక్కిలి మీద అగరు చుక్కని పెట్టాయి. వెండికొండ మీద మన్నులాగా కనిపించాయి. చంద్రుడనే పొలంలో జింక లా తిరిగాయి...' ఏవో పద్యాలు, అర్థాలు, తెరలు తెరలు గా, పీచులు గా పీచులుగా, చెట్ల ఆకుల నీడలో నాట్యం చేసే చీకటి రేఖల్లా సుళ్ళు తిరుగుతూ తన లో కలుసుకుంటున్నాయి. చివరిలో ..'కానుగు చెట్ల నీడల్లో ఒక స్వప్న శయ్య మీద ఈ మహాంధకారంలో హాయిగా శాశ్వతంగా నిద్ర పోవడంలో మనస్సు శాంతి పొందింది.' 'ఎన్నో నాళ్ళ క్రితం నా కోసమే రాసావా .. నాకు చల్లని కానుగ చెట్ల నీడల్లో సేద తీరాలని వుంది. ఇక నిరీక్షించే ఓపిక లేదు. వీణ లేని బతుకు నాకొద్దు. నేను పిచ్చి వాడిననీ, లోక శత్రువుననీ అననీ! ఈ వస్తు మాయ ప్రపంచంలో నాకు చోటు లేదు. .. ఇప్పుడు హాయి గా వుంది. ప్రశాంతంగా వుంది. చుట్టూ చీకటి దట్టంగా అలుముకుంటూ వుంది. భూమ్యాకర్షణ శక్తి అనే అవరోధం లేదు. శరీరం, మనసు తేలిక పడుతూ వుంది. లోకమా.. నన్ను క్షమించు. నన్ను అనుసరించకు. నా లా చీకటిని ప్రేమించకు.. చీకటిలో కలవాలని అనుకోకు.' భళ్ళున తలుపులు బద్దలయ్యాయి.

'బాబూ! ఇలా అయి పోయావేమిట్రా?.. ఇలా అవుతుందని అనుకోలేదే?' తేజ శరీరాన్ని ఒడి లో తీసుకుని ఏడుస్తూ వుంది తల్లి. 'తమ్ముడూ ? ఎవత్తిరా ఆ రాక్షసి? నీ ప్రాణాలు తీస్తోంది.' అక్క అక్కసులో తిడుతూ వుంది. ఆ తిట్లు తేజకి కోపం తెప్పించ లేదు. 'తేజా! డబ్బు తో అన్నీ కొన గలననుకున్నాను. అది తప్పని తెలిసింది.' మనసులో అనుకుంటూ తేజ దగ్గరగా వచ్చాడు తండ్రి. ఆయన కాలు తగిలి సీసా దొర్లుకుంటూ దూరంగా వెళ్లి పోయింది. దూరంగా వెళ్లి పోయింది. వెళ్లి...పోయింది.




"ఒరే! మనవడా! ఇంకొక్క రెండట్లు తినరా! మానాయనకదే! మాబాబుకదే! చచ్చినీకడుపునపుడతారా! "

" ఇపుడే నీ బాధపడలేకున్నా, ఇంకా నాకడుపున పుట్టిచంపుకు తింటానంటావుటే ! వద్దే వద్దు బామ్మా!ఐనా నీ ' లక్షట్లనోము' పూర్తి కానుఇంకాఎంతకాలం పడుతుందే! ఇలా రోజా నాకు ఉదయం సాయంకాలం      మధ్యాహ్నం లంచికీ మూడొందలరవై రోజులూ అట్లు పెట్టి ఎందుకు తిట్లు తింటావే! ఈరోజు నుంచి నావల్లకాదు. నేను తినను.తినలేను." అంటూ లేచి చెయ్ కడుక్కని ఇంట్లోంచి బయట పడ్డాను . మా బామ్మ లక్షట్ల నోముపట్టిందిట! దాన్ని పూర్తిచేయటం కోసమని ఇంటికొచ్చినవారి కందరికీ, అట్లుపోసి తిని పిస్తున్నది. మాఇంటికి నా స్నేహితులు రాను భయపడుతున్నారు.బంధువులు రావటం మానేశారు.

ఆఫీస్ లో నాలంచ్ బాక్స్ ఓపెన్ చేయగానే మొదట్లో అంతా వాసనపీల్చుకునేవారు రాను రానూ అంతానవ్వటం మొదలెట్టారు., ఇంతకు ముందు చాటుగా నవ్వుకునేవారు ,ఇప్పుడు పైకే నవ్వుతున్నారు.ఈ అవమానం బాధ భరించలేక మాబామ్మ లక్షట్ల నోము ఎలాపూర్తి చేయాలా అని ఆలోచించసాగాను. నాపక్క సీటులో ఉన్న సీతామహాలక్ష్మిని పేరు పురాతనంగా ఉంది కదా,ఆమాత్రం అట్ల గురించిన నాలెడ్జ్ లేకపోతుందాని అడిగాను .

" ఏమండీ సీతగారూ! ఒక లక్ష అట్లకు ఎన్ని బియ్యంకావాలి? " అని ఆమె స్పృహ తప్పి నంత పనై తేరుకుని " ఓమైగాడ్ ! లక్ష అట్లా! " అంది .

" ఔనండీ ! మాబామ్మ లక్ష అట్ల నోము పట్టింది . అదిపూర్తి కావాలనే రోజూ అట్లు తినిపిస్తున్నది. కాదంటే తాను నరకానిపోతానని ఏడుస్తున్నది. పైగా ఆమె నన్ను పెంచి పెద్దచేసింది. ప్లీజ్ కాస్తంత లెక్కకట్టి ఎన్ని బియ్యం ,మినప్పప్పుకావాలో చెప్తే ఒకరోజున అట్ల సంతర్పణ చేయిస్తానండీ!" అని బ్రతిమాలాను.

" నాకసలు అట్లుపోయటమే రాదండీ! ఐనా జీవితాంతం తిన్నా లక్ష అట్లు పూర్తికావనుకుంటా ." అంటూ నవ్వసాగింది.

" ప్లీజ్ సీతగారూ! కాస్తంతా సాయంచేయరూ!"అన్నాను దిగాలు మొహంతో ." రేపుమా అమ్మ నడిగిచెప్తాన్లెండి " అనిహామీ ఇచ్చింది.

మర్నాడు రాగానే అడిగాను. " ఒక వందగ్రాముల బియ్యానికి 25గ్రా.మినప్పప్పు తో చేస్తే మూడు అట్లు వస్తాయిటండీ , దాని ప్రకారం మీరే లక్ష అట్లకు ఎన్ని బియ్యం పప్పుకావాలో లెక్కేసుకోండి." అని తన ఫైల్స్ తెరిచి పనిలోపడింది .

నేను వెంటనే ఆఫీస్ కాయితాలే అనుకోండి , తీసుకుని లెక్కలు కట్టడం మొదలెట్టాను. పదికాయితాలు పూర్తయ్యాయి , ఐనా లెక్క తేలలేదు. నేనసలే లెక్కల్లో పూరు. ఇంతలో మా ఆఫీసర్ గారు నా ఫైల్ పూర్తైతే తీసుకు రమ్మని కబురంపగానే నేను లక్ష అట్లకు కట్టి న లెక్కల లెడ్జర్ తీసుకుని లోపలికెళ్ళి ఆయన ముందుంచాను.

ఆయన ఫైల్ తెరిచి చూసి ఏమీ అర్ధంకాక ,ముఖం పైకెత్తినా వేపు చూసి " ఏమిటయ్యా! ఇదేంటీ! బియ్యమేంటీ ,

మినప్పప్పేంటీ, నూనేంటి.. ఈక్యాలికులేషన్సేంటీ.? ఉద్యోగం మానేసి హోటలేమైనా పెట్టబోతున్నావా?" అన్నారు.అప్పుడుగానీ నేను చేసినతప్పేంటో తెలిలేదు.

"పొరబాటైందిసార్ ! ఇదోపరధ్యానం లో ఇంకోటితెచ్చాను. ఒక్క నిముషంలో తెస్తాను ." అంటూ ఆయనచేతిలో ఫైల్ గుంజుకుని అసలు ఫైల్ తీసుకెల్ళాను.

ఎలాగో గండం గడిచింది. మాబామ్మను మనసారా తిట్టుకుంటూ ఇంటి కెళ్ళాను.

అసలు మీకూ మా బామ్మ గురించి కొంచెంచెప్పాల్సిఉంది. మా అమ్మానాయనా రైల్ యాక్సిడెంటలో ఒక్కమారే పోతే, ఎక్కడో బెర్తుల చాటున పడివున్న నన్ను వెతికి తెచ్చుకుని , కంటికి రెప్పలాకాపాడుకుని పెంచిపెద్దచేసి చదువు సంస్కారం నేర్పి ఉద్యోగస్తుడ్ని చేసి, ప్రాణాలన్నీ నామీద ఉంచుకుని బ్రతుకు తున్నది బడుగుబామ్మ.ఐతే ఆమె కు పిత్రార్జితంగా అంటే వాళ్ళనాన్నకు ఆమెక్కొర్తే ,ఆమెకు మానాయ ఒక్కరే , అందువల్ల కోట్లు చేసే ఆస్తిని నన్నూ కాపాడుకుంటూ , నేను బాగుండటంకోసం ఎన్నెన్నో నోములూ వ్రతాలూ చేస్తున్నది.చిన్నతనంలో బామ్మ వాళ్ళబామ్మ దగ్గరుండి పట్టిచ్చిననోములన్నీ పూర్తిచేసి , చివరకు ' లక్షట్ల నోమూ పట్టింది. అదినా ప్రాణానికొచ్చింది.

బామ్మ కుపెద్ద లంకంత బంగళాఉంది, దానిచుట్టూ అన్నిరకాలపళ్ళచెట్ల తోట , పూలతోట దానికి ఇద్దరు తోటమాలులు మాఇంటి వెనకే గెస్ట్ హౌస్ లో ఉంటారు కుటుంబాలతో.ఆఇంటినంతా నవీకరించి అన్ని సౌకర్యాలతో పోర్షన్స్ గామార్చి , పదికాపురాలకు అద్దె కిచ్చింది, ఆసొమ్ముతో తోట నుండీ వచ్చే ఆదాతో, పొలంలో పండే పంటతో నన్నొక చిన్నపాటిజమిందార్నుచేసింది. కోట్లకు వారసుడ్ని చేసింది. మరీపెద్ద చదువులు చదివిస్తే దేశాలుపట్టిపోతానని ఎంకాం చదివించింది. నేనేమో ఎలాగో పోటీపరీక్షలురాసి LIC. లో ఉద్యోగం సంపాదించుకున్నాను. ఐనా చాలా సాదాసీదాగా తానుంటూ వృధావ్యయంచేయక .జీవనంసాగిస్తూ నాకోసమే నోములన్నీ , నాచదు వు కు కొన్నినోములూ ,నా ఆరోగ్యానికి కొన్ని నోములూ, నా ఉద్యోగానికి కొన్ని నోములూ ఇలా పాపం మాబామ్మ నాకోసం నోము లు పడు తూనే ఉంది. అలాంటి బామ్మను కాదనలేను.

మీకింకోవిషయం చెప్పాలి.మా ఇంట్లో అద్దెలకుండే వాళ్లకంతా అట్లు రోజూ వ్యక్తుల్ని లెక్కేసి పంపుతుంటుంది. మాఇంట్లో అద్దెలకుండే వారు , బామ్మాఅట్లుపోసి తెచ్చేలోగా ఇంట్లొంచిపారిపోయి ఏరాత్రికో వస్తుంటారు. మాఇంటికి 'అట్లవారిల్ల 'నిపేరుకూడా వచ్చింది.ఆ అట్ల ఇంట్లో పోర్షన్ ఖాళీగా ఉంది , అట్లకు భయపడకపోతే వెళ్ళిచేరండి" అనికూడాచెప్పు కుంటారు. దేవుకిని నివేదన చేసిన అట్లు పారేయ కూడదని వారి బాధన్నమాట! మాఇంటిముందు బిచ్చగాడి కేక ఏంటంటే " అమ్మా! అట్లుతప్ప ఏమున్నా పెట్టమ్మా!" అని ఆకేక విని అంతా నవ్వుకుంటారు.

మా బామ్మంటే నాకూ ప్రాణమే ! ఐనా 'ఈ లక్షట్ల నోమునెలా పూర్తిచేయాలి' అనేదే నాముందున్న సమస్య.

ఒకరోజని మా బామ్మనే అడిగాను. "బామ్మా! ఇంతవరకూ ఎన్ని అట్లు పూర్తయ్యాయే! లెక్కకట్టిచెప్పు.మొత్తం పూర్తిచేసే మార్గం ఆలోచిద్దాం. అట్లునోము పూర్తైతేగానీ నాపెళ్ళి జరిగేలాలేదే!అసలింతకూ ఈ పిచ్చినోములేంటే !" అని నేనడిగినదానికి మా బామ్మ ఇలాచెప్పింది." మీ అమ్మ ఏనోమూ నోయక ఉద్యోగమని తీరికలేదని అనేది అలా అర్ధాంతరంగా పోయిందిరా! నీవైనా బావుం డా లని , నావంశాంకురానివి అందుకేరా నాయనా ఈ నోములన్నీని. "

" ఐనా ఎన్ని నోములునోస్తావేబామ్మా! నీం జీవితం అంతా నోములతోనే గడిచి పోతున్నది ! ఎన్ని నోములు నోచావే ఇప్పటికి?" అని పొరబాటున అడిగినందుకు , "16 కుడుముల తద్దె నోము,అక్షయ బొండాల నోము,అన్నం ముట్టని ఆదివారాల నోము,బచ్చల గౌరీ నోము, అట్ల మీద ఆవ పూల నోము,అట్ల తద్దె నోము,ఆపద లేని ఆదివారము నోము,చిలక ముగ్గుల నోము, చిత్ర గుప్త నోము,కన్నె తులసమ్మ నోము ,ఉప్పు గౌరీ నోము, చిట్టి బొట్టు నోము,దీప దాన నోము,కుందేటి అమావస్య నోము, ధైర్య లక్ష్మి నోము,గడప గౌరీ నోము,లక్ష పసుపు నోము,కైలాస గౌరీ నోము,కళ్యాణ గౌరీ నోము, కంద గౌరీ నోము,మాఘ గౌరీ నోము,మాఘ సప్తమి నోము,మార్గశిర లక్ష్మి వారాల నోము,మహాలక్ష్మి నోము , లక్ష వత్తులనోము , ముప్పైమూడు పౌర్ణాలనోము ఇంకా...."

" ఆపవేతల్లీ ఆపిహ . ఇంతకూ ఈ 'లక్షట్లనోము' ఎందుకోసమే బామ్మా! ఈ నోముతో మన ఇంటి పేరేమారిపోయిందికదే!"

" ఓరీ! కడుపు చలవకు అట్లు పెడతారురా! తిన్నవారు దీవిస్తారు."

" కానీ మనంపెట్టే అట్లుతినేవారు విసుక్కుంటున్నారే! లోలోపల తిట్టుకుంటున్నారుకూడా! "

" అదేమోనాకు తెలీదు కానీ , డెబ్బై ఏళ్ళదాన్ని ఇంకా ఎన్నాళ్ళుంటానుగా ! నీపెళ్ళిచూసిపోవాలి, దానికి ముందే ఈ లక్షట్లనోము, ఉద్దేపనా పూర్తవాలి. దానికి దారిచూడు." అంది. ఇహ నేను ఆలోచన్లోపడ్డాను.

మా స్నేహితుడు రామాచారిని సాయమడిగాను. వాడికి నాటకానుభవమూ ఉందిలెండి. వాడుచక్కగా పురోహితుని వేషం

ధరించి మాఇంటికి పంచాంగంతో వచ్చాడు. మాబామ్మ కు ఉద్దేపనతీర్చను ముహూర్తం నిర్ణయించను వచ్చిన పూజారిగా పరిచయం చేశా ను. మాబామ్మ వాడికి తగుమర్యాదలు చేసి," పంతులుగారూ! ఈనోము పూర్తిచేయించి నేను నరకం పాలుగాకుండా కాపాడి, మా వాడి పెళ్ళికూడా మీ చేతులమీదుగా జరిపించండి.పెద్దముండాదాన్ని ఎంతోకాలం బ్రతకలేను." అనిబ్రతిమాలసాగింది. మావాడు

" మీరింతగాచెప్పాలాబామ్మగారూ!ఐతే మీరు నామాట శ్రధ్ధగావినండి. వినాయక చవితికీ సత్యనారాయణ వ్రతానికీ బంగరు ప్రతిమ గానీ, వెండిప్రతిమగానీ, చివరకు పంచలోహప్రతిమ గానీ అదీలభ్యంకానిచో పసుపుతోనైనాచేసి పూజిస్తాం కదా!అలాగే ప్రత్యామ్నాయం గా అట్లపిండి అంతామీరు రుబ్బలేరు గనుక , ఒక గ్రైండర్ తెప్పిస్తాను,దాన్ని మీరు స్విచ్ వేసి ఆంచేయండి , నా ఎరికలో ఒక వసతి గృహముంది.అక్కడికి వెళదాం , మరో విషయం అట్ల సైజ్ తగ్గించి చిట్టిగారె ప్రమాణం చేశామంటే మీ నోము ఒక్క వారంలో పూ ర్తై ఉద్దేపన కూడా తీర్పిస్తాను. హాస్టల్లో మీరు స్టవ్ వెలిగిస్తే అక్కడివంటవారు దోసెలుపోసి బాగా ఆకలిమీదున్న అక్కడి ఐదొందలమంది పిల్లలకూ ఇస్తారు.మీ నోము ఒక్కవారం లో ఫినిష్. ఇహ ఉద్దేపన విషయానికొస్తే ,ఇదినీ అవసరాన్ని బట్టి లభ్యతను అనుసరించి ఒక చిన్న అరచేతిలో పట్టే సూక్ష్మమైన రోలు పత్రాన్నిచిరమడతలో ఉంచి,చిట్టిగారె ప్రమాణపు అట్లు,వెయ్యికి ఒకటిచొప్పున మీ లెక్కప్రకా రం పదిపోసి ఆరోట్లో ఉంచి ఒక ముత్తైదువకు ఇప్పిస్తాను. మీ నోము,ఉద్దేపనా కూడా తీర్చేఏర్పాటు చేస్తాను." అని బామ్మను ఒప్పిం చా డు. లేకపోతే బామ్మ రోలు ఒళ్ళోపెట్టుకుని ఉద్దేపన తీసుకోవాలని పట్టుదలతో ఉందిలెండి.మా వాడి పధకం ప్రకారం ఒక్క వారం లో ఆవసతిగృహ విద్యార్ధులంతా, చిట్టిగారె ప్రమాణపు అట్లు తలో ఇరవై హాయిగాతిని త్రేన్చారు. మావాడు వాళ్ళచేత " బామ్మగారికీ జై, లక్షట్లనోముకూజై " అని నినాదాలుకూడా చేయించాడు. అంతా వరసగా వచ్చి బామ్మకు నమస్కరించారు. 'లక్షాట్లనో' మేమోగానీ పాపం ఆవసతిగృహ విద్యార్ధులకు ఒక్క వారం రోజులైనా కమ్మని ఆహారం అందించి నందుకు నేను మాబామ్మను మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. ఇదండీ మామా నోముల బామ్మ ,లక్షట్ల నోము.'




ఆరోజు ఆదివారం. ఉదయం తొమ్మిదవుతోంది. అప్పుడే తలస్నానం చేసి బాత్రూం లో నుండి బయటికొచ్చిన చైతన్య టవలు తీసుకుని ఈలవేస్తూ బాల్కనీలోకి నడిచాడు.

ముందుగదిలో కూర్చుని బట్టల మిషను మీద కూర్చుని పనిచేసుకుంటున్న కృష్ణమూర్తి " ఏమిటో ఇవాళ సారు పొద్దున్నే లేచి రెడీ అవుతున్నారు ! " అన్నాడు కొడుక్కేసి చూస్తూ వ్యంగ్యంగా..

" మళ్ళీ తెల్లారిందా వాణ్ణి ఏదో ఒకటి అనడానికి ? " అంది వంటింట్లో నుండి సరస్వతి.

" నేనేమన్నా సపోర్ట్ చేయడానికి తమరున్నారుగా..."

భర్త మాటలకి ఎమీ అనలేక తనపనిలో తాను నిమగ్న మైపోయింది సరస్వతి.

ఇదేమీ పట్టించుకోకుండా చైతన్య బెడ్రూం లోకెళ్ళి జీన్స్ ప్యాంటూ, టీ షర్టూ వేసుకుని తల దువ్వుకున్నాడు. చేతికి వాచి పెట్టుకుని గాగుల్స్ తీసుకుని బయటికొచ్చాడు.

" డాడీ ఓ ఫైవ్ హండ్రెడ్ రుపీస్ ఇవ్వు " అని అడిగాడు తండ్రిని.

" ఎందుకూ ? " మొహం చిట్లించాడు కృష్ణమూర్తి.

" ఖర్చు చేయడానికి "

" నీ పంచ్ డైలాగులు విని ఎంజాయ్ చేయడానికి ఓపిక లేదు నాకు "

" కాకపోతే ఏంటి డాడీ? ఇవాళ సండే కదా, అలా సరదాగా బయటికెళ్ళొస్తాను, పెట్రోలుకీ, సినిమాకీ కావాలి. " చిరాగ్గా మొహం చిట్లించి అన్నాడు చైతన్య.

" సోమవారం నుండి శనివారం వరకు ఉద్యోగాలు చేసేవాళ్ళకు ఆదివారం కావాలి తమరికి ప్రతిరోజూ ఆదివారమేగా? "

" ఏమిటండీ? కొడుకుతోఅ మాట్లాడే తీరేనా అది..? ముందు గదిలోకి వస్తూ అంది సరస్వతి.

" వాడు కొడుకులా ప్రవర్తిస్తున్నాడా ? ముప్పై ఏళ్ళొచ్చాయి. నాలుగు రోజులు ఇదనీ, నాలుగు రోజులు అదనీ ఏదీ పూర్తిగా చదవక కాలేజికి తిలోదకాలిచ్చాడు. గవర్నరు గిరీ తప్ప ఉద్యోగం చేయనని గాలికి తిరుగుతున్నాడు...." అని ఇంకా ఏదో కోపంగా అనబోతున్న కృష్ణమూర్తి మాటలకు అడ్డొచ్చాడి చైతన్య.

" అర్థం లేకుండా మాట్లాడకు డాడీ ! నచ్చిన చదువు, నచ్చిన ఉద్యోగం కాకుండా కాంప్రమైజ్ అవలేను లేదంటే అత్తెసరు జీతంతో అద్దెగదుల జీవితాన్ని గడపాలి...."

" అవునా, ఆ అత్తెసరు జీతంతోనే రోజూ ఐదువేళ్ళూ నీ నోట్లోకెళుతున్నాయి....ఈ అద్దె గదిలోనే తలదాచుకుంటున్నావు...."

" అంటే ఏంటి నీ ఉద్దేశం? నేనిలాగే ఉంటాననా? అయినా నా వయసెంతనీ....నాకు నచ్చిన ఉద్యోగం, లంకంత ఇల్లు సంపాదించి చూపిస్తాను..."

" ఎప్పుడు? నేను చచ్చాకనా? " కోపంగా అరిచాడు కృష్ణమూర్తి.

" హబ్బబ్బ...ఏమిటండీ ఆ మాటలూ? " చూస్తూ ఊరుకోలేక అంది సరస్వతి.

" కాకపోతే ఏమిటే? యాభైతొమ్మిదేళ్ళు వచ్చినా నా కష్టం నాకు తప్పడం లేదు. అప్పటికీ జీతం రాళ్ళు చాలక కళ్ళు సరిగా కనబడకపోయినా, ఇంట్లో ఉన్నంతసేపూ బట్టలు కుడుతూ కాలం వెళ్ళదీస్తున్నాను...."

ఏడుపు గొంతుతో అన్నాడు కృష్ణమూర్తి.

" నీ సెంటిమెంట్ సబ్జెక్ట్ వినడానికి నేనేమీ ప్రొడ్యూసర్ ని కాదు డాడీ. నేనడిగిన అమౌంట్ ఇస్తావా, ఇవ్వవా, చెప్పు..." లేచి నిలబడి ఖచ్చితంగా అన్నాడు చైతన్య.

కృష్ణమూర్తి విసురుగా లేచెళ్ళి తన షర్టు జేబులో నుండి రెండొందలు తీసుకొచ్చి టేబుల్ మీద పెడుతూ " నా దగ్గర ఇంతే ఉన్నాయి. నీ ఇష్టమొచ్చినట్టు తగలడు ! " అన్నాడు.

చైతన్య ఆ డబ్బులు తీసుకుని బయటికొచ్చి బైక్ స్టార్ట్ చేసాడు...

చైతన్య కృష్ణమూర్తికి ఒక్కగానొక్క కొడుకు. అతడితర్వాత ఒక అమ్మాయి. చిన్నతనంలో పరిస్థితులు అనుకూలించక, పెద్దగా చదువుకోని కృష్ణమూర్తికి చైతన్య తనలాగా జీవితాన్ని వెళ్ళదీసే స్థాయిలో కాకుండా పెద్ద చదువులు చదువుకుని మంచి ఉద్యోగం చేస్తాడనీ, తననేదో ఉద్ధరిస్తాడనీ అందరు తండ్రులలాగే కలలు కన్నాడు. ఉన్నంతలో కృష్ణమూర్తి కూతురి పెళ్ళి బాగానే చేసాడు. కానీ ఆ అప్పూ, కొడుకు చదువులకని చేసిన అప్పులు, వాటి వడ్డీలూ వెంటాడుతూ అతనికి విశ్రాంతినివ్వడం లేదు... ఏనాటికైనా కొడుకు చేతికంది వచ్చి తనను ఆదుకోకపోతాడాని వేయికళ్ళతో ఎదురు చూస్తున్న కృష్ణమూర్తికి నిరాశే మిగులుతోంది...చదువుల విషయం లో పెద్దగా నాలెడ్జ్ లేని కృష్ణమూర్తి, చైతన్య చదువేమిటో, అదేనాటికి పూర్తవుతుందో అర్థం కాక సతమతమవుతున్నాడు. అది అలుసుగా తీసుకుని, స్థిర చిత్తం లేని చైతన్య ఆ కోర్సులనీ, ఈ కోర్సులనీ ఏదీ పూర్తిచేయక, దేనిమీదా కాన్సంట్రేట్ చేయక కాలం వెళ్ళదీస్తున్నాడు...

బైక్ మీద చాలా దూరం వెళ్ళిన చైతన్య ఒకచోట మలుపు తిరగగానే సడెన్ గా బైక్ ఇంజన్ ఆఫ్ కావడంతో దిగి పక్కన స్టాండ్ వేశాడు. పక్కనే ఉన్న మెకానిక్ కుర్రాణ్ణి బైక్ చూడమని, కూల్ డ్రింక్ తాగడానికేమైనా బేకరీ కనిపిస్తుందేమోనని చుట్టూ చూసాడు. బేకరీ కనిపించలేదు కానె, ఓ చిన్న చెప్పుల దుకాణం లో ఓ అమ్మాయి చెప్పులుకుడుతూ కనిపించి చైతన్య దృష్టిని ఆకర్షించింది. అనాలోచితంగానే తేరిపారా చూశాడు... ఆ అమ్మాయినెక్కడో చూసినట్టనిపించింది. ...

ఎవరై వుంటారబ్బా... రెండు క్షణాలు ఆలోచించాక గుర్తొచ్చింది. తన క్లాస్మేట్ అభిరాం చెల్లెలు నిహారిక... వాళ్ళ నాన్నకు చెప్పుల దుకాణం వుందని తెలుసుగానీ, షాపులో ఈ అమ్మాయి వుండేంటీ?..

బైకు ఏమైందో చూడమని పురమాయించి షాపులోకి నడిచాడు చైతన్య.

అతడిని చూస్తూనే లేచి నిలబడి "రండి సార్! ఏం కావాలి? చెప్పులా, షూనా? కూర్చోండి!" అంది చిరునవ్వుతో నిహారిక.

"నీ పేరు నిహారిక కదూ!" నిలబడే అడిగాడు చైతన్య.

"అవును. మీరు...!?

"మీ అన్నయ్య అభిరాం క్లాస్మెట్ చైతయని. గుర్తొచ్చానా?!"

నిహారిక ఒక్క క్షణం ఆలోచించి గుర్తుపట్టి "ఓహ్... అన్నయ్యా...నువ్వా! బావున్నావా? కూర్చో.... ఆంటీ, అంకుల్ బావునారా? ఒరే చింటూ కాసిని మంచి నీళ్ళు పట్రా!" అంటూ హడావిడి చేసింది.

చతన్య అక్కడే వున్న స్టూల్ లాక్కుని కూర్చుంటూ" అందరూ బావున్నారమ్మా! నువ్వేంటే, షాపులో పని చేస్తున్నావ్? డాడీ, అభి ఎలా వున్నారు?" అని అడిగాడు.

నిహారిక కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి.

"చదువుకుంటున్నప్పటి నుంచే అన్నయ్య నాన్నకి చేదోడు వదోడుగా వుండేవాడు నీకు తెలుసు కదా! చదువయ్యాక పూర్తిగా షాపు చూసుకుంటూటే నాన్న సంతోషించాడు. కానీ, ఓ రోజు ఇంటికొస్తూ యాక్సిడెంట్ లో పోయాడు. దీన్ని తట్టుకోలేక నాన్నకి పక్షవాతం వచ్చింది. అమ్మ మా చిన్నప్పుడే పోయింది. ఒంటరి పక్షిలా మిగిలిన నాన్నని చూసుకోవడం నా బాధ్యత కదన్నయ్యా.."

షాపులో పైన పూలదండలో వున్న అభి ఫోటో పై అప్పుడు చైతన్య దృష్టి పడింది.మనసు చివుక్కుమంది. అభి తనతో ఎంతో క్లోజ్ గా వుండే వాడు.

"మరి, నువు ఇంకా పెళ్ళి.."

అయిందన్నయ్యా! మా వారు ప్రైవేటు ఉద్Yఓగం చేస్తూనే ఇక్కడ నాకు మెటీరియల్ తీసుకురావడంలాంటి సాయం చేస్తుంటారు. ఇంట్లో పిల్లలిద్దరిని, చంటి పిల్లాడిలాంటి నాన్నని చూసుకుంటూ ఇదిగో... ఈ షాపుని నడుపుతున్నాను. .. డిగ్నిటీ ఆఫ్ లేబర్ కదన్నయ్యా... పనిని మనం గౌరవిస్తే అది మనల్ని సమాజం లో అందరూ గౌరవించేలా నిలబెడుతుంది...

ఇంతలో కుర్రాడు మంచి నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చాడు.

"ఆంటీ, అంకుల్ బావున్నారా అన్నయ్యా? నీకు పెళ్ళైందా, పిల్లలు ఎంతమంది? ఏం చేస్తున్నావ్?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది నిహారిక...

"అ.. అదీ.. యాక్చువల్ చి.ఎ చేద్దామనుకున్నాను. బట్ దానికి మార్కెట్ లేదు. ఒక్క టూ ఇయర్స్ లో ఏదైనా కోర్స్ చేసి మంచి జాబ్ చేద్దామనుకుంటున్నా అని తడబడుతూ చెప్పాడు చైతన్య.

"అవునా? నువ్వీపాటికి లైఫ్ లో సెటిలైపోయుంటావనుకున్నా అన్నయ్యా! పాపం అంకుల్ మాత్రం ఎంత కాలం కష్టపడతారు.... నువు ఏదో ఒక ఉద్యోగం చేసి సంపాదిస్తూంటే ఆయన ఇప్పటికైనా విశ్రాంతి తీసుకుంటారు. పైగా, కోడలు రావాలని ఆంటీకి కూడా వుంటుంది కదా! కాలం ఎంతో విలువైంది. గడిచిపోయిన కాలం తిరిగిరాదు...

ఫోన్ మోగినట్టుగా నటించి తీసి మాట్లాడ్డం ప్రారంభించాడు చైతన్య.

"చెప్పరా! అక్కడే వున్నావా? బైక్ ప్రాబ్లం వల్ల లేటయింది. వచ్చేస్తున్నా! ఓ.కే... నేనొస్తానమ్మా! మళ్ళీ కలుస్తా!" అంటూ బయటికొచ్చాడు.

ఇంట్లో డాడీ నస భరించలేక బయటికొస్తే, తన పనేదో తను చేసుకోక శ్రీరంగ నీతులు చెప్తోంది."... అనుకున్నాడు చైతన్య.

నిహారిక మాటలేవీ చైతన్య తలకెక్కలేదు. అదే జరిగితే ఎంతో మంది తల్లిదండ్రులకు ఈ బాధ తప్పేది.

తమ బాధలను కష్టాలను పట్టించుకోని ఇలాంటి బిడ్డలున్న తల్లిదండ్రుల ఆశలెప్పటికీ ఎండమావులే....




ఆదివారం ఉదయం ఏడు గంటలు.

బద్ధకంగా నిద్రలేచాను. ఆర్రోజులూ కాలపు ముల్లుకి బంధించబడి ఒక యంత్రంలా గడిపే నాకు నిజంగా ఆదివారం ఆటవిడుపే! దాన్ని ఏ ఫంక్షన్లకో వెళ్లడం..ఎవరెవరిళ్ళకో వెళ్ళి..లేదా వాళ్ళని ఇంటికి పిలిచి వ్యర్ధపరచుకోవడం ఇష్టముండదు. దాన్ని నాకిష్టమైన సాహిత్యం చదవడంలోనూ..కథలు రాయడంలోనూ..మంచి మంచి సినిమాలు చూడడంలోనూ గడపాలనిపిస్తుంది. అలా ఆదివారాన్ని నా కోసమే.. కేవలం నా కోసమే ఉపయోగించుకోవాలనిపిస్తుంది. ప్రతి క్షణం పొదుపుగా వాడుకోవాలనిపిస్తుంది. పైగా మాపిల్లలకి వేసవి సెలవులు ఇవ్వడంతో శ్రీమతి పుట్టింటికి వెళ్ళింది. ఫుల్ ఎంజాయ్ చేద్దామనుకున్నాను కాని ఈ ఆదివారంలో కొంతసమయం త్యాగం చెయ్యల్సొస్తోంది. అందుకే చిరాగ్గా వుంది. నిజానికి ఆదివారం నేను తొమ్మిదీ పదింటికి కాని లేవను. కాని ఇవాళ ఆఫీసున్నట్టే ఏడింటికి లేవాల్సొచ్చింది. ఛ..కొంతప్పుడు ఇష్టం లేకపోయినా ఫార్మాలిటీస్ కి కొంత సమయం కేటాయించాల్సొస్తుంది. తప్పదు.

మా ఆఫీసులో పనిచేసే వేణుకి నెల క్రితం యాక్సిడెంట్ అయి హాస్పిటల్లో వున్నాడు. అసలు ఆ యాక్సిడెంట్ తీవ్రతకి వాడు బ్రతక డనుకున్నారు. కాని గట్టిపిండం మేజర్ సర్జరీ జరిగాక కోలుకుంటున్నాడు. వేణు వయస్సు యాభై..యాభై అయిదు మధ్య వుంటుంది. అందరితో నమ్రతగా వుంటాడు. తన పనేదో తనేంటో. ఆఫీసులో అందరూ మిస్టర్ కూల్ అని పిలుస్తుంటారు. ఆఫీసులోని దాదాపు అందరూ చూసొచ్చారు. ఒక్క నేను తప్ప. ఆర్రోజులూ ఆఫీసు పనితో చాలా చాలా బిజీగా వుంటాను. ఆదివారం వెళదామనుకున్నా..బద్ధకంతో మరో ఆదివారానికి పోస్ట్ పోన్ చేసి నాకోసం నేనుగా జీవిస్తాను. ఈవారం తప్పనిసరిగా వెళ్ళి రావాలి. ఎందుకంటే చుట్టుపక్కలవున్న ఆఫీసుల వాళ్లు కూడా చూసొచ్చారట..ఒక్క నేను తప్ప. ఆఫీసులో అందరూ వెటకారం చేస్తున్నారు. నిజానికి నాకు హాస్పిటల్ వాతావరణమంటే తెగ చిరాకు. మా వాళ్ళెవరన్నా వుంటేనే ముళ్ళమీద కూర్చున్నట్టు పదినిముషాలుండి వచ్చేస్తాను. కాని తప్పదు కదా ఒక్క పదినిముషాలు ఎలాగోలా గడిపి వచ్చేయడమే!

అరగంటలో తయారై బైక్ మీద గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్లాను. కాంపౌండ్ లోపలికడుగెట్టగానే యుద్ధభూమిలోకి ప్రవేశం చేసి నట్టని పించింది. పేషెంట్లు క్షతగాత్రుల్లా కాళ్లకి.. చేతులకి..కట్లతో..మూలుగులతో.. నిర్సంగా అడుగులేస్తున్నారు. వాళ్ళతో పెద్ద యాతనగా వుందని ముఖంలో విసుగుని కనిపింపచేస్తూ 'కావలసిన' వాళ్ళు. లోపలికెళితే ఫినాయిల్ వాసనతో కూడిన ఒక రకమైన ముక్క వాసన. డాక్టర్ల నుండి కిందిస్థాయి దాకా మాటల్లో చేతల్లో చూపించే నిర్లక్ష్యం. మానవాధముల మధ్య మహోన్నతములమన్న ఫీలింగ్.

నేను ముక్కుకి కర్చీఫ్ అడ్డం పెట్టుకుని కావాలసిన వార్డ్ దాకా వచ్చి లోపలికెళ్ళాను.

ఒక్కో మంచంమీద వున్న పేషెంట్ ని చూస్తూ నడుస్తున్నాను. ఆ వార్డ్ యమలోకంలా, ఒక్కో బెడ్ మీద పేషెంట్ ఒక్కోశిక్ష అనుభవిస్తున్నట్టు అనిపిస్తోంది. వేణు బెడ్ దగ్గరకి వచ్చాను. తలకి పెద్ద కట్టు వుంది. అతని దగ్గర ఎవరూ లేరు. బెడ్ పక్కగా వున్న మెటల్ స్టూల్ ని కొద్దిగా జరుపుకుని కూర్చున్నాను.

ఆ శబ్దానికి వేణు లేచి నన్ను చూసి పేలవంగా నవ్వాడు. నాకెందుకో అతడిని చూస్తే జాలేసింది.

"ఎలావుంది?"అడిగాను.

"ఫర్వాలేదు" అని లేవబోయాడు.

"వొద్దొద్దు..రెస్ట్ తీసుకో"

"నీ దగ్గర ఎవరూ లేరేంటి? ఏవన్నా అవసరం వస్తే?"మాటల్లో కొద్దిగా చిరాకుని కనబరుస్తూ మందలిస్తున్నట్టుగా అన్నాను.

"మా ఆవిడ పదేళ్ళ క్రితమే కాలం చేసింది. ఇద్దరు కొడుకులు. వాళ్ళవి రెక్కాడితే కాని డొక్కాడని బ్రతుకులు. నాకోసం ఎంతకాలం పక్కన ఉత్తగా కూర్చుంటారు?"అన్నాడు.

తెచ్చిన రెండాపిల్ పళ్ళు అతని చేతిలో పెట్టి లేచాను ఇహ వెళతానన్నట్టుగా.

వెంటనే నా చెయ్యి పట్టుకుని "కొద్ది సేపుండచ్చు కదా..ఇవాళ ఆదివారమే! ఎప్పుడు పనితో బిజీగా వుండే నేను ఇలా మంచానికి అంటిపెట్టుకుని వుండడం నరకప్రాయంగా వుంది. ఏమీ తోచక పిచ్చిగా వుంటోంది. పలకరించే నాధుడు లేడు.

చుట్టాలు..తెలిసున్న వాళ్ళు..ఆఫీసు స్టాఫ్..మర్యాద కోసం పరామర్శించి వెళ్ళిపోతారు తప్ప 'సాటి మనిషి మంచాన పడి వున్నాడే' అన్న భావం వాళ్ల కళ్లలో వెదకి చూసినా కన్పించదు. నిజం చెప్పు నాకు కావలసింది రెండు పళ్ళు..'తగ్గిపోతుందిలే' అనే ఓదార్పు మాటలూనా?"

"ఇద్దరు కొడుకులంటున్నావు..వంతుల వారీగా ఒక్కొక్కరూ వుండొచ్చుగా..వాళ్ళ తండ్రివే కదా!"

"ఈ హాస్పిటల్లో చేరేదే నాలాంటి వాళ్ళు. డబ్బుతో అద్భుతమైన ట్రీట్ మెంట్ ఇప్పించుకోలేని దౌర్భాగ్యులం. అడ్మిట్ అవడం తప్ప ఎప్పుడు డిస్చార్జ్ అవుతామో తెలీదు. అడుగడుగునా ఛీత్కారాలు. అవమనాలు. ఈ వార్డ్ లో ఏ మంచం దగ్గరన్నా పేషెంట్ తప్ప మరొకర్ని చూశావా? ఒకవేళ వున్నా 'ఈ తద్దినం ఇంకెన్నాళ్ళో' అన్నట్టు వుంటారు తప్ప ప్రేమాభిమానాలతో కాదు. మా వాళ్ళ దృష్టిలో నేనే కావాలని యాక్సిడేంట్ చేయించుకున్నాను. 'పెద్దవాడివయ్యావు..చూసుకుని వెళ్ళక్కర్లేదూ' అంటాడు పెద్దాడు. 'నాన్నకి రిటైర్మెంట్ కి ముందే రెస్ట్ తీసుకోలన్పించిందేమో అందుకే రిస్క్ చేశాడు'అంటాడు చిన్నాడు ఎకసక్కెంగా.

పలకరిద్దామని వచ్చేవాళ్ళు పేషెంట్లని 'నువ్వు మాలోంచి వెలివేయబడ్డావు' అన్నట్టు కాకుండా 'నువ్వు కోలుకుని మాలో ఎప్పుడు

కలుస్తావు?' అన్న ఆదరణ చూపించాలి.

ఈ హాస్పిటల్ కాంపౌండ్ కి అవతల ఎంతో మంది ఎవరిపనుల్లో వాళ్ళు ఎంతో బిజీగా వుంటారు. కనీసం ఈ హాస్పిటల్ ముందు నుండి వెళుతున్నప్పుడైనా 'లోపల ఎంతమంది ఆఖరి శ్వాస తీసుకుంటున్నారు?..మృత్యువుతో పోరాడుతున్నారు? అని ఆలోచిస్తారా? లేదు ఎవరి సుఖం వాళ్లది. సాటి మనిషి ఏమైపోతే వాళ్ళకేం."

కాస్త ఊపిరి తీసుకోడానికి ఆగి కాసిన్ని మంచినీళ్ళు తాగి..మళ్లీ ప్రారంభించాడు."ఆ పక్క బెడ్డు పెద్దాయన్ని చూడు ఆయనకి హార్టేటాక్ వచ్చింది. చాలా సీరియస్ ట. డాక్టర్లు ఏ విషయం చెప్పలేమంటున్నారు. వాళ్లవాళ్ళ దృష్టిలో ఆయన చచ్చిపోయినట్టే! ఎప్పుడోసారి వస్తున్నారు.. ఉన్నాడో! పోయాడో చూడ్డానికి. ఆయన మంచివాడో..చెడ్డవాడో తెలియదు. తన వాళ్లకోసం ఎంతో కొంత శ్రమించే వుంటాడు! మన మనుష్యలోకంలోకొచ్చాడు. మనకీ కాస్త కనికరం వుండాలి కదా!      ఇవన్నీ నీకెందుకు చెబుతున్నానంటే..నువ్వు కథలు చదువుతావని..రాస్తావని నాకు తెలుసు..మీ మనసులు కాస్త మార్దవంగా వుంటాయి. ఓల్డ్ ఏజ్డ్ హోం జీవితాలే కాదు హాస్పిటల్లోని పేషెంట్ల జీవితాలూ హృదయ విదారకంగా వుంటాయి. పట్టించుకునే నాధుడు లేక. దయచేసి ఈ విషయం మీద కథ రాసి పేషేంట్లకి కాస్త సాంత్వన చేకూరేలా చేయి..ప్లీజ్. మేమూ మనుషులమే మళ్ళీ కోలుకునొచ్చి మీలో కలుస్తాం."అని ముగించాడు.

కలం కాగితం మీద పెట్టడం తప్ప ఇప్పటిదాకా నేను చేసిందేంలేదు.      రోడ్డు మీద బిజీగా వెళుతున్నప్పుడు హారన్ తో ఆంబులెన్స్ వస్తుంటే వాహనాన్ని పక్కకి తీసుకోవడానికి విసుగు. మృత్యువుతో పోరాడుతున్న వ్యక్తికి సహకరిస్తే మృత్యువు ఓడిపోదూ! కాని మనం అలా చేయం. మనిషి ఆలోచనలు ఉత్తమంగా..అమలు అధమంగా వుంటే సరిపోదు. అందరినీ కలుపుకుపోవాలి..అందరికోసం బ్రతకాలి. ఈ ఆదివారం నాకు ప్రత్యేకమైనది. దిశానిర్దేశం చేసింది.

మరుసటిరోజు ఆఫీసుకి గంట ముందు బయల్దేరాను. దారిలో పేపర్ ..టిఫిన్లు కొనుక్కుని హాస్పిటల్ లోకడుగుపెట్టాను. నిన్నటిలాగా చిరాగ్గా లేదు ఆ వాతావరణం. బయటవున్న పేషెంట్ల మొదలు డాక్టర్లు..సిస్టర్లు..ఉద్యోగులకి విష్ చేస్తూ వేణూ దగ్గరకి వెళ్ళాను. అతడి పక్కన స్టూల్ మీద కూర్చుని ఇడ్లీ పొట్లాం అతడికి..చుట్టుపక్కల బెడ్ల వాళ్లకిచ్చి తినమని..వాళ్ళు తింటుండగా పేపర్ చదివి వినిపించాను. నా ఫోన్ నంబరు అతడి కేస్ షీట్ మీద రాయించి ఏ అవసరమొచ్చినా నాకు ఫోన్ చేయమని చెప్పాను. ఆ కాస్తకే అక్కడున్న వాళ్ళకి ఆత్మీయుడన యిపోయాను. తిరిగి సాయత్రం ఆఫీసయ్యాక వస్తానని చెప్పి బయల్దేరాను. ఎందుకో చాలా రిలీఫ్ గా అనిపించింది. నేను నాకోసం బ్రతికినప్పుడు అలా అనిపించలేదు.

ఇప్పుడు ఆదివారం సెలవుదినాల్లో..షాపింగ్ మాల్స్..చార్మినార్..ఎన్ టి ఆర్ గార్డెన్స్..కే కాదు వివిధ హాస్పిటల్స్ కి..వృద్ధ శరణాలయాలకి వెళుతున్నాను. వాళ్ళలో ఆత్మ స్థయిర్యాన్ని నింపి బ్రతికి తీరాలన్న కాంక్షని పెంచుతున్నాను.




మాచవరం గ్రామంలో నివసించే లింగయ్యశెట్టిది చిల్లర కొట్టు కిరాణా వ్యాపారం.నిజాయితీపరుడైన వ్యాపారిగా ఊళ్ళో మంచిపేరుందతడికి. సొంత ఇంటిలోనే కొట్టు నడిపేవాడు కనుక అద్దె బాధ కూడా లేదతడికి. భుక్తికి లోటు లేకుండా అప్పుల్లేకుండా హాయిగా గడిచిపోతుండేదతడి జీవితం. ఉన్న ఇద్దరు కొడుకులనూ పటన్మ్ లోని మంచి విద్యాలయంలో చదివిస్తున్నాడు.

అయినా అతడినేదో బాధ పట్టి పీడిస్తుండేది. పెద్ద పెద్ద మేడలూ మిద్దెలూ సంపాదించలేకపోతున్నాననీ, ఊళ్ళో ఉన్న కోటీశ్వరులమధ్య తానూ ఒకడిగా వెలిగి పోలేక పోతున్నాననీ ఆత్మ న్యూనతా భావం అతణ్ణి పట్టి పీడిస్తూండేది.

అతడి భార్య రంగమ్మ మాత్రం మనకున్నదాంట్లో మనశ్శాంతిగానే ఉన్నాం కదాని అతడితో అంటూండేది. సొంతిల్లు, వ్యాపారం,

చక్కగా చదువుకుంటున్న పిల్లలు అన్నీ సవ్యంగానే ఉన్నాయి, సంతోషంగానే గడిచిపోతోంది కదాని అంటూండేది.

ఇదిలా ఉండగా ఒకసారి దేశసంచారం చేస్తూన్న ముని ఒకాయన మాచవరం గ్రామ సరిహద్దుల్లోని నదీ తీరానికి వచ్చి ఉన్నాడని తెలిసుకొని ఊళ్ళోని జనమంతా తండోపతండాలుగా వెళ్ళి ఆయన దర్శనం చేసుకుని తమ కష్టాలు చెప్పుకోసాగారు.

ఇది తెలిసి లింగయ్యశెట్టి కూడా భార్యను తీసుకుని ఆ మునిని చూడబోయాడు.

" స్వామీ ! ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది జీవితం.బోలెడంత డబ్బూ, ఇంకా మంచి జీవితం, ఊళ్ళోని కోటీశ్వరుల మధ్య ఒకడిగా గుర్తింపూ నాకెందుకు సాధ్యం కావడం లేదు? " అని తన బాధను వ్యక్తం చేసాడు.

ముని కాసేపు కళ్ళు మూసుకుని ఆలోచించి, " నాయనా అక్కడున్న కడవతో ఎదురుగా పారుతున్న నదిలోంచి నీళ్ళు ముంచి తీసుకురా.." అని చెప్పాడు.అలాగేనని ముని చెప్పినట్టే చేశాడు లింగయ్యశెట్టి. ముని నది వేపు చూస్తూ, అదేమిటి నాయనా? నువ్వు ముంచుకొచ్చినా ఇంకా నదిలో నీళ్ళు పారుతూనే ఉన్నాయే? అనడిగాడు.

దానికి లింగయ్య ఆశ్చర్యంగా, " అదేమిటి స్వామీ, కడివెడు నీళ్ళు ముంచుకొచ్చినంత మాత్రాన, నదిలో నీళ్ళింకిపోతాయా? " అనడి గాడు.

ముని నవ్వి, " అదే నాయనా నేను నీకు చెప్పబోతున్నది. మనజీవితంలోని కోరికల్ పారే నది లాంటివి. అవి మారుతుంటాయే తప్ప తీరవు...ఒక కడివెడు కాదు కదా వంద..వేయి కడవలు ముంచుకొచ్చినా అంతే..ఇక ప్రాప్తం అనేదొకటుంటుంది. అది అచ్చు మన కడవ లాంటిదే... నదికెళ్ళినా, సముద్రానికెళ్ళినా మన ప్రాప్తమెంత ఉందో అన్నే మనకు చెందుతాయి... " అంటూ వివరించాడు..

లింగయ్యశెట్టి మునికి నమస్కరించి తేలికపడిన మనసుతో ఇంటికి బయల్దేరాడు.




ఆరోజు కోర్టు హాలు కిక్కిరిసి వుంది. కరడుగట్టిన ఏ కసాయి కేసో వాదనకు వచ్చిందనుకుంటున్నారేమో! ఓ విచిత్రమైన కేసు వచ్చింది. ప్రముఖ దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు తాజాగా రూపొందించిన 'అరటిపండు ' చిత్రంపై ఒక ప్రేక్షకుడు కేసు వేశాడు. ఎంతో ఆశగా టిక్కెట్ కొనుక్కుని థియేటర్ కి వెళితే ఒక్కసారి కూడా అరటిపండు కనిపించలేదనీ, తనకు న్యాయం చేయాలనీ కోర్టును ఆశ్రయించాడు సదరు ప్రేక్షకుడు.

నిందితుడినీ, ఫిర్యాదుదారునీ కోర్టులో ప్రవేశపెట్టి ఎదురెదురుగా వున్న బోనులలో నిలబెట్టారు. న్యాయమూర్తి రావడంతో అప్పటివరకూ కోలాహలంగా వున్న కోర్టు హాలు నిశ్శబ్దంగా మారింది. ఆనవాయితీ ప్రకారం న్యాయమూర్తి టేబుల్ మీదున్న సుత్తిని తీసుకుని మూడుసార్లు కొట్టి 'ఆర్డర్... ఆర్డర్... ఆర్డర్...' అన్నారు.

"వాద ప్రతివాదనలు మొదలెట్టండి!" అంటూ న్యాయవాదులిద్దరినీ ఆదేశించారు న్యాయమూర్తి.

"మిలార్డ్... కాఫీ తాగి, టిఫిన్ చేసి వచ్చారా?" అన్నాడు లాయర్ నల్లకోటును సర్దుకుంటూ...

"నా క్షేమసమాచారాలడగడానికి నువ్వు నా బామ్మర్దివి కాదు. విషయమేంటో మొదలెట్టు..." కర్కశంగా అన్నారు న్యాయమూర్తి.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిసుక్కున నవ్వడంతో కోర్టు హాలంతా ప్రతిధ్వనించింది. లాయర్ అతడిని ఖోపంగా చూసి జడ్జివైపు తిరిగి తన వాదన మొదలెట్టాడు.

"మిలార్డ్... బోనులో వున్న నా క్లయింటు..."

"ఐ అబ్జక్ట్ యువరానర్..." అంటూ మధ్యలోనే లేచాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"అబ్జక్షన్ ఓవర్ రూల్డ్..." అని న్యాయమూర్తి అన్నారు.

"మిలార్డ్... కోర్టు హాలులో రెండు బోనులున్నాయి. కానీ, లాయర్ గారు కోర్టువారిని తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో 'బోనులో వున్న నా క్లయింటు ' అంటున్నారు. ఏ బోనులో వున్న క్లయింటో స్పష్టంగా చెప్పాలని సవినయంగా కోరుతున్నాను" అన్నాడు ప్రాసిక్యూటర్.

వెంటనే రాహుల్ గోపాల్ రాజు వైపు చూపిస్తూ "యువరానర్... ఈ బోనులో వున్న నా క్లయింటు తన మానాన తను సినిమాలకు దర్శకత్వం వహిస్తూ బతికేస్తూంటే... ఓ సాధారణ ప్రేక్షకుడైన అతడు..."

"ఐ అబ్జక్ట్ యువరానర్..." అంటూ మళ్ళీ లేచాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్. లాయర్ తో సహా జడ్జి కూడా విసుగ్గా చూశారు.

"సినిమాకి ఫైనల్ జడ్జి అయిన నా క్లయింటుని పట్టుకుని సాధారణ ప్రేక్షకుడు అని సంబోధించడం కులం పేరుతో దూషించినంత నేరం యువరానర్..." ఆవేశంగా అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"అబ్జక్షన్ ఒవర్ రూల్డ్..."

"యువరానర్... ఇలా మాటిమాటికీ మనోభావాలు దెబ్బ తింటూంటే కోర్టు సాగినట్టే... సరే, ప్రేక్షకుడు థియేటర్ కి వెళ్లి సినిమా చూసి ఇంటికి వెళ్లాలే తప్ప ఇలా కోర్టుకి వస్తే ఇదిగో... ఇలాగే వుంటుంది. సినిమా ఎలా తీయాలన్నది దర్శకుడి ఇష్టం. దానికి ప్రేక్షకుడు అభ్యంతరం చెప్తే ఎలా యువరానర్?"

"యువరానర్... వినియోగదారుడికి చెప్పినదాన్నే ఉత్పత్తిదారుడు అందించాలి. అది అతడి ధర్మం. బయట బుక్ స్టాల్ అని బోర్డు పెట్టి లోపల కోళ్లను అమ్ముతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. 'అరటిపండు ' అని టైటిల్ పెట్టిన దర్శకుడు సినిమాలో ఒక్కసారి కూడా అరటిపండుని చూపించక మోసం చేశాడనేది నా క్లయింటు అభియోగం. దీనికి ప్రాసిక్యూటర్ గారు దయచేసి కోర్టువారికి సమాధానం చెప్పాల్సిందిగా కోరుతున్నాను"

జడ్జి ఒకసారి బుర్ర గోక్కున్నాడు. పైకప్పుకేసి చూస్తూ ఆలోచించాడు.

"యువరానర్... దీనికింతగా ఆలోచించాల్సిన పనిలేదు. ఒక్కసారి మీరు 'అరటిపండు ' ఒరిజినల్ డి.వి.డి. తెప్పించుకుని చూస్తే సినిమాలో అరటిపండుని ఒక్కసారి కూడా చూపించని ఈ దర్శకుడికి ఎంత కఠినమైన శిక్ష విధించాలో మీకే తడుతుంది" ఆవేశంగా అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"నేను ఛస్తే ఒప్పుకోను యువరానర్... నిన్నగాక మొన్న రిలీజై ఇంకా థియేటర్లలో ఆడుతున్న నా సినిమాను మీరు ఒరిజినల్ డి.వి.డి.లో చూడ్డం సెక్షన్ అలీ 369/ఎబిసిడి/అమితాబ్ బచ్చన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకారం చట్టరీత్యా నేరం యువరానర్..." అన్నాడు దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు.

"నువ్వుండవయ్యా బాబూ... నీ లాయర్ని నేను కదా... నేను వాదిస్తానుండు... అనవసరంగా ఆవేశపడిపోతావ్... అంచేత యువరానర్... నా క్లయింటు బాధను అర్థం చేసుకోగలరని కోర్టువారిని సవినయంగా కోరుతున్నాను. నవమాసాలూ మోసి బిడ్డను కన్న తల్లికి, తన కళ్ల ముందే నర్సు బిడ్డడిని మరొకరికి ఇచ్చేస్తుంటే ఎలా వుంటుంది యువరానర్?" అంటూ ఆవేశంగా ప్రశ్నించాడు లాయర్.

"ఏమో, నాకు తెలీదు. ఎందుకంటే, నేనెప్పుడూ కనలేదు, నర్సు అలా ఎవరికీ ఇవ్వలేదు. అయినా, ఇది నాకెందుకు

చెప్తున్నట్టు?" జడ్జి భృకుటి ముడివడింది.

"కొంచెం సెంటిమెంటుని టచ్ చేసి చెప్తే మీరు నా క్లయింటు బాధను అర్థం చేసుకుంటారేమోనన్న ఆశతో చెప్పాను మిలార్డ్... మీరు సినిమా చూస్తానంటే నేను టికెట్ కొని మీరు చూసే ఏర్పాటు నేను చేస్తాను యువరానర్..." అంటూ తన పాకెట్లోని డబ్బుని తీసి లెక్కేసుకున్నాడు లాయర్.

"నీ దయా దాక్షిణ్యాలు నాకేమీ అక్కర్లేదు. సినిమా చూసి నేను తీర్పు చెప్తాను. ఈరోజు కోర్టు వాయిదా వేయడమైనది. నేను సినిమా చూసిన తర్వాత తెలియపరుస్తాను. అప్పుడు అందరూ లేట్ చేయకండా కరెక్టు టైముకి రావాలి" అంటూ జడ్జి తన కుర్చీలో నుండి లేచి బయటకు నడిచాడు.

అందరూ బయటకు వచ్చేసరికి మైకులు, కెమెరాలు పట్టుకుని మీడియా మొత్తం రెడీగా వుంది.

"సార్... అరటిపండు కేసు ఏమైంది? దర్శకుడు రాహుల్ గోపాల్ రాజుకి తీర్పు అనుకూలంగా వచ్చిందా, వ్యతిరేకంగా వచ్చిందా? అసలు ఈ కేసుపట్ల జడ్జిగారు ఎలా స్పందించారు? ఇకమీదట కూడా కోర్టులో ఇలాంటి కేసులను ఎక్స్ పెక్టు చేయవచ్చా?" అంటూ ప్రశ్నల వర్షాన్ని కురిపించారు.

ఈ ప్రశ్నలకు లాయర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతిస్పందిస్తూ "జడ్జిగారు ఇరువైపులా వాదనలను పూర్తిగా, ఓపిగ్గా విన్నారు. సినిమా చూసిన తర్వాత తన తీర్పును వెలువరించనున్నారు" అని చెప్పి స్పీడుగా అక్కడినుండి వెళ్లిపోయారు.

మర్నాడు న్యూస్ పేపర్లు, న్యూస్ ఛానెల్స్ ఇష్టమొచ్చినట్టుగా ప్రతిస్పందించాయి.

న్యాయమూర్తి 'అరటిపండు ' చిత్రాన్ని చూశారు. దాని తర్వాత ఒకరోజు కోర్టు సమావేశమైంది.

నరాలు తెగే ఉత్కంఠతో అందరూ జడ్జి వంకే చూస్తున్నారు. ఆయన తన సీట్లో కూర్చుని భారీ నుంచి అతిభారీ పుస్తకాలన్నింటినీ తిరగేశారు. కోర్టు హాలంతా నిశ్శబ్దంగా వుంది. సుమారు ఇరవై రెండు నిమిషాల నిశ్శబ్దాన్ని తన సుత్తితో బద్దలుగొట్టారు న్యాయమూర్తి. "సైలెన్స్... సైలెన్స్... సైలెన్స్..."

"హాలంతా ఆల్రెడీ సైలెన్సుగానే వుంది మిలార్డ్" అన్నాడు లాయర్.

"నాకు తెలుసు. నేను మాట్లాడబోతున్నానని ఇండికేషన్ ఇస్తున్నానన్నమాట. ఏతావాతా నేను చెప్పొచ్చేదేంటంటే... దర్శకుడు ఈ చిత్రానికి అరటిపండు అనే టైటిల్ పెట్టాలని ఎందుకు నిర్ణయించుకున్నాడనేది అతడి స్వవిషయం. నిజానికి కథాపరంగా చూస్తే అరటిపండుకీ, కథకీ ఎక్కడా పొంతన కనిపించలేదు"

జడ్జి మాటలను మధ్యలోనే ఖండిస్తూ "యువరానర్... దీనికి నేనొప్పుకోను. అరటిపండును అనేకచోట్ల సింబాలిగ్గా చూపించాడు నా క్లయింటు..." అంటూ అడ్డుకున్నాడు లాయర్.

"నువ్విక్కడ అరటిపండు సినిమాకి రివ్యూ రాయడం లేదు... నేను మాట్లాడేది కాస్త విను. అసలు అరటి పండు రంగు ఎలా వుంటుంది, దాని రుచి, ఉపయోగాలు, పండులో వుండే విటమిన్లూ... ఇలా అన్నింటినీ వివరించాల్సిన బాధ్యత దర్శకుడి మీద వుంది. కానీ, వాటన్నింటినీ మరచి అసలు అరటిపండు ఊసే లేకుండా సినిమా తీసినందుకు గానూ, సదరు ప్రేక్షకుడికి దర్శకుడు డజను అరటిపండ్లు కొనివ్వాలని తీర్పు ఇవ్వడమైనది..." అంటూ తీర్పు చెప్పారు న్యాయమూర్తి.

కోర్టు హాలంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

అందరూ బయటకు వచ్చారు. యదావిధిగా మీడియా అంతా ఎదురు చూస్తోంది.

"డైరెక్టరుగారూ, లోపల ఏంజరిగింది? జడ్జిగారు ఏం తీర్పు చెప్పారు? ఇకమీదట మీరు తీయబోయే సినిమాలకు ఆ తీర్పుని పాటించబోతున్నారా?" అంటూ ప్రశ్నల వర్షాన్ని కురిపించారు మీడియా సోదరులు.

దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు ఈ ప్రశ్నలేవీ పట్టించుకోకుండా "అరటిపండు తర్వాత నేను తీయబోయే చిత్రం పేరు... 'గుమ్మడికాయ ' " అన్నాడు.

"పండు మీద నుండి వెళ్లి కాయ మీద పడుతున్నారా? ఇంతకీ ఈ చిత్రం ప్రత్యేకత ఏంటి సార్?" అన్నాడు ఒక మీడియా సోదరుడు.

"ఈ సినిమాలో అసలు గుమ్మడికాయే కనిపించదు, దాని గురించిన ప్రస్తావన వుండదు..." అని సమాధానం చెప్పేసి హుందాగా, తన స్టైల్లో నడచుకుంటూ వెళ్లిపోయాడు దర్శకుడు రాహుల్ గోపాల్ రాజు.

మీడియా సోదరులతో పాటు అక్కడున్న వారంతా అవాక్కయ్యారు.




నాలుగో తరగతి చదువుతున్న చందు, సరస్వతి కవలలు. తనను అతిగా గారాబం చేసే నాయనమ్మ రవణమ్మంటే చందుకి ప్రాణం. 'వాడు మారాజురా! ఆడపిల్లతో వాడికి పోలికేంటి?' అని రవణమ్మ అస్తమానూ అనడం చందు, సరస్వతిల తల్లిదండ్రులు నీరజ, మురళీకృష్ణలకు సుతరామూ నచ్చదు. 'అమ్మా! అమ్మాయిలను ఒకప్పుడు చిన్నచూపు చూసేవారు, అణగదొక్కేవారు. కానీ, ఇది పాతకాలం కాదు. అప్పుడైనా, ఇప్పుడైనా అమ్మాయిలు అబ్బాయిలకు దేంట్లోనూ తక్కువ కాదు.

కొన్ని సందర్భాల్లో పైచేయి కూడా కనబరుస్తూంటారు.' అని మురళీకృష్ణ ఎన్నోసార్లు కోప్పడ్డాడు కూడా! కానీ, నాయనమ్మ మాటంటే చందుకి వేదమంత్రం కాబట్టి అది వాడి తలకు బాగా ఎక్కింది. ప్రతిదాంట్లోనూ సరస్వతిని తక్కువచేసి చూడ్డం, నిర్లక్ష్యంగా మాట్లాడ్డానికి అలవాటు పడ్డాడు. ఈ విషయాన్ని ఓ కంట గమనిస్తూనే వున్నారు నీరజ, మురళీకృష్ణ. వాడికి బుద్ధి చెప్పేందుకు తగిన సమయం కోసం వేచి చూస్తున్నారు భార్యాభర్తలిద్దరూ! సంక్రాంతి సమీపిస్తూండగా ఇంట్లో అందరికీ కొత్తబట్టలు కొనేందుకు షాపింగ్ కి బయలుదేరారు. తల్లి నీరజ ముచ్చటపడి తీసుకున్న బట్టాలను సరస్వతి కూడా సంతోషం కనబరచిందే తప్ప ఎదురు చెప్పలేదు. కాని, అదే రేటులో తీసుకున్న కారణంగా తన బట్టలను తిరస్కరిస్తూ 'నేను బగాణ్ణి. ఆడపిల్లకు తీసుకున్న రేటులోనే నాకూ తీసుకుంటారేంటి?' అన్నాడు చందు నిర్లక్ష్యంగా. కోప్పడబోయిన నీరజను వారించి చందు కోరిన ఎక్కువ రేటు బట్టలను కొన్నాడు మురళీకృష్ణ.

సంక్రాంతి గడచిపోయింది. తిరిగి స్కూళ్లు మొదలయ్యాయి. చందు, సరస్వతిలతో పాటు తను కూడా స్కూలుకి రెడీ అయ్యాడు మురళీకృష్ణ. 'స్కూలుకు నువ్వెందుకు వస్తున్నావు డాడీ?' అని అడిగాడు చందు. 'ఇన్నాళ్లూ నీకు అన్యాయం జరిగిపోయిందిరా! సరస్వతికన్నా నీకు ఎక్కువ సబ్జెక్టులు, ఎక్కువ పాఠాలు ఇవ్వాల్సింది కాస్తా సమానంగా ఇచ్చారు. ఎక్కువ ఇవ్వమని మీ ప్రిన్సిపల్ తో మాట్లాడతాను.' మాట్లాడతాను.' అన్నాడు మురళీకృష్ణ. చందు ఖంగు తిన్నాడు. 'అదేంటి డాడీ? ఇద్దరమూ ఒకే క్లాసు కదా! అలాంటప్పుడు నాకు ఎక్కువ సబ్జెక్టులు, ఎక్కువ పాఠాలు ఇవ్వడమేంటి?' అన్నాడు. 'కదా! ఈ సొసైటీ కూడా ఒక క్లాసులాంటిదే! ఈ క్లాసులో అమ్మాయైనా, అబ్బాయైనా సమానమే! అలాంటప్పుడు అన్నింట్లోనూ సరస్వతికన్నా నిన్ను ఎక్కువచేసి ఎందుకు చూడాలి?' అని చందుని సూటిగా ప్రశ్నించాడు మురళీకృష్ణ. చందుకి విషయం పూర్తిగా బోధపడక బుర్ర గోక్కున్నాడు. కొడుక్కి వివరంగా చెప్పదలచుకున్నాడు మురళీకృష్ణ.

'చూడు కన్నా! మదర్ థెరిసా, ఇందిరాగాంధీ, సరోజినీ నాయుడు... వీళ్లంతా లేడీసా, జెంట్సా?'

'లేడీసే డాడీ!'

'కానీ ప్రపంచం వాళ్లను ఆడవాళ్లా, మగవాళ్లా అని చూడదు. జీవితంలో ఉన్నత శిఖరాలకెదగాలనే బలమైన లక్ష్యంతో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచినవారుగానే చూస్తుంది. అందుకే, వారు చరిత్రలో నిలిచిపోయారు. అలాంటప్పుడు మగవాళ్లకన్నా ఆడవాళ్లు తక్కువ అనేందుకు ఒక్క ఆధారమైనా చెప్పగలవా? నవమాసాలూ మోసి జన్మనిచ్చే అమ్మ ఎంత గొప్పది! సృష్టికి మూలం స్త్రీ. చదువుల తల్లి సరస్వతి. యత్ర నార్యస్తు పూజ్యంతే తత్ర రమం దేవతా! అన్నారు పెద్దలు. అంటే స్త్రీలు ఎక్కడ పూజింపబడుదురో అక్కడ దేవతలు సంచరిస్తారని అర్థం.' చందు తలమీద చెయ్యివేసి సౌమ్యంగా అన్నాడు మురళీకృష్ణ.

'సారీ డాడీ! సరస్వతినే కాదు, ఏ లేడీస్ గురించి తక్కువ చేసి మాట్లాడను ఇంకోసారి...' పశ్చాత్తాపంతో తలవంచుకుని అన్నాడు

చందు.

నీరజ, మురళీకృష్ణ ఆనందంగా చిరునవ్వు నవ్వుతూ మొహాలు చూసుకున్నారు.




"ఒరేరాఘువా! ఇంట్లో ఏడ్చావా?"

"నీవెక్కడ్నుంచి ఏడుస్తున్నావో ముందు చెప్పి అఘోరించు"

"మీ ఇంటికే బయల్దేరా! ఇంట్లో అఘోరిస్తే వచ్చి మాట్లాడుతా! లేకపోతే ఇంకో చోటి కెళ్ళి నా శ్రార్ధం పెట్టుకుంటా"

"ఇక్కడే పెట్టుకుందువుగానిరా!" ఫోన్ల సంభాషణంతా వింటున్న రాఘవరాం శ్రీమతి సుగుణ ," ఐనా ఎప్పుడూ అలా తప్ప మాట్లాడుకోలేరా మీ ఇద్దరూనూ?!చిత్రమైన స్నేహితులు. "అంటూలోనికెళ్ళింది .

మరో పదేపదినిముషాల్లో ఊడిపడ్డాడు ఫోన్ చేసిన పెద్దమనిషి మాధవయ్య. ఆయన్ని చూడగానే ముందుగా తయారుచేసి ఉంచిన చల్లని చల్లగ్లాసు అందిస్తూ ,"తీసుకోండి అన్నయ్యగారూ! ఎండనపడివచ్చారు" అంది సుగుణ.

"పడిరాక ఏం చేస్తానమ్మా! మేనకోడలిపెళ్ళి నానెత్తినుంది కదా! తండ్రిలా ఎలా నిమ్మకునీరెత్తినట్లు హాయిగా కూర్చోగలనూ!" అంటూ ఖాళీగ్లాసు అందించారు.

"మహావిరగబడుతున్నావ్ లేవోయ్! ఇంతకూఎందుకఘోరించినట్లూ!" " ముందీమాటచెప్పి అఘోరించు ,ఆ అమలాపుర సంబంధం కుదర్లేదుగా?" "లేదురా! వాళ్ళ గొంతెమ్మ కోరికలతో తూగలేక మానేశాం."

"హమ్మయ్య శుభవార్త చెప్పావు. .సంబంధం చెడిందని" "ఏంట్రా ఏదో ఉద్ధరించే మేనమావలా మాట్లాడి ,పెళ్ళిసంబంధం కుదర్లేదని సంతోషిస్తున్నావా? కనీసం, కూతురి కంటే పెద్దకొడుకును ఒక్కడ్ని కనలేని వెధవ్వి కబుర్లు చెప్తావురా! పైగా సంబంధం కుదర్లేదని చిరునవ్వొకటి! కాళ్ళిరగొట్టేవాళ్ళు లేక" "అన్నయ్యా! ఇద్దరూ ఇలా మాటాల కర్రల్తో కొట్టుకోడమేనా విషయం చెప్పేదేమైనా ఉందా ! నా కవతల పొయ్యిమీద నూనె కాగిపోతున్నాది. పకోడీలు చేసేందుకు.." అంటూ సంభాషణ మధ్యలో కొచ్చింది సుగుణ.

" మీ అన్నాచెల్లెళ్ళకే నాడైనా నేరుగా మాట్లాడటముందీ! ఇలా పక్కదార్లు తప్పించి? పళ్ళూడగొట్టే వారులేక" "విరగ్గొట్టుకుందూగాని లేకానీ, అసలు అమ్మాయికి ఏమేం వచ్చో చెప్పుముందు.." "అదేంటన్నయ్యగారూ తెలీనట్లు అడుగుతున్నారూ !" ఆశ్చర్యంగా అంది సుగుణ" ముందుగా వీడి నోట ఆ పకోడీలు లు కొట్టవే సుగుణా !" "అమ్మాయ్! అనంతా !పిండి కలిపి ఉంచాను, నూనె కాగిపోతున్నట్లుంది ఆ పకోడీలు వేయించమ్మా! సరే అన్నయ్య గారూ! అడిగారు గనుక చెప్తున్నా. అమ్మాయ్ పేరు అనంత, అనంతపద్మనాభ వ్రతం నాడు పుట్టిందని ఆ పేరు పెట్టారు మీ స్నేహితులు. ఇహ వయస్సు 21, కాలేజిల్లో చదివించే శక్తి లేక ఉన్న ఊర్లో ఇంటర్ తో ముగించాం. కుట్టువచ్చు, సరదాకు కరాటే నేర్చుకుంది, యోగాలో అభ్యాసముంది. ఆంగ్లం చక్కగా మాట్లాడుతుంది. భరతనాట్యం వచ్చును, సంగీతం నేనే నేర్పించాను .వంట చేతనవును. ఏదో మాత్రం అందం, రంగు..." సుగుణ మాటలకు అడ్డువస్తూ" బుద్ధి తక్కువై అడిగానమ్మా చెల్లెమ్మా! ఇవన్నీ నాకు తెలీవాయేం? అదేదో మీ నోటవిని, నా నోట ఈ నోకియా నోట, వారికీ మాట వినిపిద్దామనీ , అమేరికా సంబంధంరా" ఐనా అమేరికా సబంధం అంటే మాటలు టోయ్! నీ మాటలతో మమ్మల్ని కోటలు దాటించి కమ్మని పకోడీలు నోట కొట్టుకోనేనా వచ్చావ్! అనంతా పకోడీ ఆపేయమ్మా!, వేసినా వీడికి తేకు, నాకేపట్టుకరా!" అంటూ ఉరిమాడు స్నేహితుడ్ని .

నవ్వుతూ రెండు పళ్ళేల్లో వేడివేడి ఘుమఘుమలాడే పకోడీలతో వచ్చిన అనంత "కులాసానా మామయ్యా!" అంది. "నీకున్న మాత్రం ప్రేమ ఈ స్నేహితుడి మీద మీ నాన్నకు లేకపోయె!" "మామయ్యా! ఈ ఇద్దరి జగడాలు ఈనాటి వా ఒకటో క్లాస్ నుంచి చదువు, వయస్సులతో పాటు పెరిగిపెరిగీ ఈ నాటికి యాభైవస తరాలాయె! ఎవరెరుగరు మీ తగవుల తరంగాల తమాయింపులు.. "అంటూ మంచి నీళ్ళగ్లాసు అందించి లోనికెళ్ళింది. సుగుణ కూడా తానూ గుమ్మం పక్కనున్న అరుగుమీద కూర్చుంటూ" అన్నయ్యా! అసలు విషయం చెప్పండి!" అంది." అందుకే గదమ్మా! ఎండనపడి మూడుఫర్లాంగులు నడుచుకుంటూ వచ్చిందీ! బాగావినమ్మా సుగుణమ్మా!.." అంటూ నీళ్ళు తాగేందుకు ఆగాడు " మహారుచిగా ఉన్నాయమ్మా పకోడీలు." "మరికాసిన్ని తెమ్మంటారా మామయ్యా! అంటూ వచ్చింది అనంత. "వద్దు కాని నీవూ వినమ్మా! వారిది ఆమంచర్ల. ఆయుర్వేద వైద్యులు ఆనంతయ్యగారి కుమారుడు, అమేరికాలో అదేదో ఎమ్మెస్సుట చేసి ,అక్కడే మంచి ఉద్యోగంలో చేరాడుట! మన దేశపు సాంప్రదాయ కుటుంబంలోని పిల్లను చేయాలని వారి ఆరాటం." "మనం తూగగలమా! అన్నయ్యగారూ! ఆ అమలాపురం సంబంధమూ అంతేగా ఇంజనీరనీ, అంతే చదువుకున్న పిల్లన్నా కావాలిట లేదా పాతిక లక్షలు కావాలిట! మన వద్ద పెళ్ళి చేయనే డబ్బులేదు.." "వాళ్ళ ఆశకూలా! అమ్మాయ్ సుగుణా! అన్నీ కనుక్కునే వచ్చాను కాని ! ఎప్పుడు రమ్మంటారో చెప్పండి ! ఇప్పుడే ఫోన్ చేసేస్తున్నాను." అని మాధవయ్య అంటూండగానే, చూర్లో దోపిన పంచాంగం అందుకున్నాడు రాఘవరాం.

శుక్రవారం దివ్యంగా ఉందిరా!" అంటూ భార్యకేసి చూశాడు అదోలా." సుగుణ అర్థం చేసుకుని అంగీకారంగా తలూపింది. ఆడవాళ్ళ ఇబ్బందులేవీ లేవని ఆ చూపుల అర్థం." అన్నయ్యా! పిల్ల నచ్చినా.." "పిల్ల నచ్చకపోటానికి వాళ్ళు గ్రుడ్డివాళ్ళై ఉండాల్సిందే! బంగారపుఛాయ, బంగారానికి శోభా, సుగంధం ఇచ్చే సుగుణం ,మర్యాద ఇంకేం కావాలమ్మా!" "అవన్నీ కావు అన్నయ్యా! అమేరికా సంబంధమంటే పెళ్ళికే లక్షలవుతాయేమోని నా అనుమానం. పై పిల్లలకిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి అంతా ఐపోయింది. ఇహ ఆ పిల్లాడికి డిగ్రీ ఐనా చెప్పించాలా. .ముగ్గురి తర్వాత పుట్టుకొచ్చాడు కదా! " "అమ్మాయ్! నీవవన్నీ మర్చిపో! శుక్రవారమంటే ఎల్లుండే! వాళ్ళు వచ్చాక నీవే చూస్తావుగా! అంటూ రొంటినున్న చరవాణిని అందుకుని కొన్ని నెంబర్లు నొక్కి " అయ్యా! నేనండీ ! మాధవయ్యని! మీ అబ్బాయికి అమోఘమైన సంబంధం ఉంది, మా స్నేహితుని కుమార్తె చూపులకు చక్కనిచుక్క ్వభావానికి సుగుణాలరాసి, మొన్న మిమ్ము కలిసినపుడు వారూ ఒక సంబంధం చూస్తున్నారు, అందుకే చెప్పలేదు, మన అదృష్టం కొద్దీ ఆ సంబంధం చెడింది ,అంతా మీ అబ్బాయి అదృష్టమండీ! మీ మింటికి లక్ష్మి లక్ష్మండీ వస్తున్నది! ఎల్లుండి శుక్రవారం వస్తారా! మీరే చూస్తారుగా! సాంప్రదాయకమైన సంబంధం, సరి సరి, సాయంకాలం నాల్గింటికి, రాహుకాలం ఉదయం 10/30--12 కదండీ! ఔను అంతా బాగే,సరే నండీ! ఎదురు చూస్తాం" అంటూ ఇంటి టెంకి చెప్పి, చరవాణిని రొంటిన దోపి " ఇహ వస్తానోయ్! నడిచి అఘోరించు అందాకా నాలో. నేను ఆ లొల్లాయ్ లక్షీపతిని కలిసి ఇంటికి చస్తాను, ఎన్నాళ్ళకూ వాడి కొడుకు సంబంధం తేల్చడు, కనిపించినప్పుడల్లా గొణిగిచస్తాడు, "అంటూ బయల్దేరబోతున్న మాధవయ్యను దగ్గరగా వచ్చి, గుచ్చి కౌగలించుకుని" ఒరే! నీ ఋణమెలా తీర్చుకోనురా!" అంటూ కండువాతో కళ్ళు వత్తుకుంటున్న రాఘవరాంను "ఓరి నీ! నీదంతా మేకపోతు గాభీర్యమని నాకు తెలిదుట్రా! వెధవాయ్! మన మధ్య ఋణాలూ, వడ్డీలూ ఏంటిరా! అమ్మాయ్! వీడికో గ్లాసెడు చల్లని నీ రివ్వూ!" అంటూ జోళ్ళు తొడుక్కుని బయల్దేరాడు, అటు తిరిగి కళ్ళు కండువాతో అద్దుకోడం సుగుణ గమనించక పోలేదు. పేరు అరుణ్ !మీకు అంట్లు తోమటం వచ్చా!" కనీసం తన పేరైనా అడక్కుండ ఇలా అడిగిన వాని వైపు చిత్రంగా చూసింది అనంత. 'వచ్చ'న్నట్లు తలూపింది. వంటవచ్చా!"," ఇల్లు చిమ్మటం వచ్చా?"

,"బట్టలు విస్త్రీ చేయటం వచ్చా?" ,అన్నింటికీ వచ్చన్నట్లు తలూపింది.' ఖర్మకాలి పెళ్ళిచేసుకుని అక్కడ పని మనిషిగా పెట్టను తీసుకెళ్ళడు గదా!' అనుకుంది అనంత." ఇవన్నీ అడుగుతుంటే మీకు అనుమానం రావచ్చు, అక్కడ పని మనిషిగా పెడతానేమోని.. "మనస్సు చదివినట్లే అంటున్న అతడి వేపు చిత్రంగా చూసింది అనంత. "తప్పుగా అనుకోకండి అనంతగారూ! అక్కడ పని చేయను ఇక్కడలా సర్వెంట్స్ ఉండరు. అన్నీ మనమే చేసుకోవాలి. మీకు డ్రైవింగ్ నేను నేర్పుతాను. అన్నీ కార్లలో వెళ్ళి తెచ్చుకోవాలి .ఆ దేశంలో కారు లేకపోతే కాళ్ళు లేనట్లే, మన దేశానికి మూడున్నర రెట్లు దేశం, మూడోవతు జనాభా ఉండే దేశమది .పనిలో ఎక్కువ తక్కువ లెవ్వరూ పట్టించుకోరు. నాకు మీరు నచ్చారు. మీకు నేను నచ్చితే మన వివాహం' అన్నవరం' కొండ మీద జరిపించి, వీసా రాగానే నాతోనే తీసుకెళతాను." అంటూ తన వేపు చూస్తున్న అరుణ్ ను చూసింది పరిశీలనగా అనంత.

ఆరడుగుల ఎత్తు .ఆడవారికుండే గులాబీ రంగు శరీరఛాయ. మంచి మర్యాద, అన్నీ ముందే చెప్పే స్వచ్ఛమైన మనస్తత్వం. మరి కట్నం ఎంత డుగుతారో! 'అనుకుంది అనంత. అప్పుడు పెదవి విప్పారు వారి తండ్రి "అయ్యా! ముందుగా పిల్లవాడు పిల్ల మాట్లాడుకుని వారు పరస్పరం నచ్చితేనే, మేము మాట్లాడాలని మా నియమం .మాకేమీ కట్న కానుకలు అవసరం లేదు. మావాడు చెప్పేడుగా అన్నవరం కొండమీద పెళ్ళి సింపుల్ గా జరిపించడి.అంతే మీరు, మేము పిల్లాపిల్లాడు కూడా వస్తార్లెండి. "అనగానే అంతా నవ్వారు హాయిగా.ఏంటో! మహారాణి గారు నవ్వుకుంటున్నారుతనలోతాను, ఈభృత్యుడికీకాస్తంతచెప్పవచ్చా!"అంటున్న అరుణ్ని నవ్వుతూచూసి, "మన పెళ్ళిచూపుల రోజు గుర్తుకు వచ్చి.." అంది మరో మారు నవ్వుతూనూ "ఏమ చేయనూ అమెరికాలో ఉద్యోగం చేసే పిల్లవాడంటే అంతా తాగుతాడా! సిగరెట్లూ, మత్తు మందులూ అలవాటులేవని నమ్మకం ఎలా! ఇంతకు ముందే అక్కడ తెల్లదానితో పెళ్ళి కాలేదని గ్యారంటీ ఏంటి? పెళ్ళి చేసుకుని పని మనిషి కోసం అంటూ రకరకాల సందేహాలతో నా దుంపతెంపారు ఆడ పిల్ల తల్లిదండ్రులు. వారి భయాలు వారివనుకో. అందుకే నేనే అలా మొదలెట్టాను పెళ్ళి చూపుల తతంగం." అన్నాడు అరుణ్." నిజమే నండీ నిజానికి నా కిప్పుడు తీరుబాటుగా, మీతో మాట్లాడ నే సమయం లేకుండా ఉంది. ఏదో మా తమ్ముడు ఉన్నాడు గనుక కొంత వెసులుబాటుగా ఇలా శుక్రవారం రాత్రన్నా మీతో మాట్లాడను అవుతోంది." "ఔను సుమా నీవో పెద్ద నృత్య కళాశాలకు డైరెక్టర్ వు, కరాటే స్కూల్ ఓనర్వు, ఒక పెద్ద ఆడవారి వస్త్ర తయారీ సంస్థ యజమానురాలివి, సంగీత సరస్వతివి, నీ ఆదాయంతో పోల్చితే నా జీతం ఎంత అనంతా!" అంటున్న అరుణ్ నోటిని మూసింది చేత్తో కాదు సుమండీ.. మీకూ తెల్సులెండి చెప్పక్కర్లేదు మరి.




దేవదాసు పార్వతి..రోమియో జూలియెట్..లైల మజ్ను..జగ ద్విఖ్యాత ప్రేమికులు. వాళ్ళ ప్రేమ అజరామరం. ఎన్నో కథలకీ, కవితలకీ మార్గదర్శకం. ప్రేమికులకి నిత్య స్మరణీయం..ఆరాధనీయం.

వాళ్ళ కథ విషాదాంతం అయింది. అందరిచేత కంటతడి పెట్టించింది. ఒకవేళ..ఒకవేళ వాళ్ళప్రేమ సుఖాంతమైతే?

రైలు వేగంగా దూసుకెళుతోంది. ఇంకొద్ది గంటల్లో రాంబాబు దంపతులని చూడబోతున్నానన్న ఆనందం నన్ను నిలవనీయడం లేదు. కారణం...! గతం లోకి నా మనసు ఉరకలెత్తింది.

రాంబాబు ప్రేమలో పడ్డాడు.      రాంబాబు నా ప్రాణ స్నేహితుడు. మాట మెతక. మనసువెన్న.

అసలు వాడు ప్రేమలో పడడమే వింత. నాకు తెలిసి, వాడు ఏ అమ్మాయివంకా ఆశగా..ఆబగా కాదు కదా కనీసం మర్యాదపూర్వకంగా కూడా చూడడు. అలాంటిది ప్రేమలో పడడం. అమ్మాయి ఎవరని పదే పదే వాడిని అడిగిన మీదట చెప్పాడు రమణి అని.

"రమణి అంటే బుల్లబ్బాయిగారి కూతురు కాదు కదా!" ఒకింత భయపడుతూ అడిగాను.

అవునన్నట్టుగా చిన్నగా తలూపాడు.

అయిపోయింది. వీడు ప్రేమలో పడడమంటే మృత్యు ముఖంలో నిలబడడమన్న మాట. బుల్లాబ్బాయి అంటే సినిమాల్లో విలన్ లాగానే బాగా ఆస్తిపరుడు. రౌడీ. వాడంటే అందరికీ భయమే! అలాంటి వాడి కూతురిని ప్రేమించాడా? ఇంకేవన్నా వుందా?

"ఒరేయ్! నువ్వు ఏ అమ్మాయిని ప్రేమించావో తెలుసుకదా! నా మాటిని ప్రేమాలేదు..దోమాలేదు. హాయిగా గంతకుదగ్గ బొంతను చూసుకుని పెళ్ళిచేసుకుని తర్వాత ప్రేమించు. అంతేకాని ముందు ని ప్రాణానికి ఆనక నీతో పాటు వుండే నాలాంటి వాళ్ళ ప్రాణాలకి ముప్పు తీసుకురాకు."అన్నాను.

"ప్రేమకు ఆస్తి, అంతస్తూ, హోదాలు అడ్డురావురా! ప్రేమ ఎప్పుడు ఎలా పుడుతుందో తెలియదు. అది అసంకల్పితం! నా ప్రాణంపోయినా ఫర్వాలేదు. కానీ చచ్చేప్పుడు రమణి పేరే జపిస్తూ చనిపోతా"అని చెప్పాడు.

"ఏరా! ప్రేమ సినిమాలు కానీ ఎక్కువగా చూస్తున్నావా? నిజ జీవితంలో అవన్నీ సాధ్యం కావు. వాళ్ళ నాన్నకి తెలిసిందంటే ఎముకలోకి సున్నం లేకుండా చేస్తాడు. ఏమనుకుంటున్నావో!"అన్నాను ప్రేమగా కోప్పడుతూ.

"నువ్వేమన్నా అనరా తను లేని నేను లేను."అని వెళ్ళిపోయాడు.

చెట్లమ్మటా పుట్లమ్మటా తిరుగుతూ..ఒకరికొకరు బహుమతులిచ్చుకుంటూ..ఊరివాళ్ళ దృష్టిలోకి తద్వారా బుల్లబ్బాయి

చెవుల్లోకి వెళ్లారు.

బుల్లబ్బాయి అగ్నిహోత్రుడయిపోయాడు.

కూతుర్ని ఇల్లుదాటకుండా కట్టడి చేసి. రాంబాబుకి స్ట్రాంగ్‌గా వార్నింగ్ ఇచ్చాడు.

రమణి కనిపించక మా వాడు తిండి మానేశాడు. ఒంటి మీద శ్రద్ధ పెట్టట్లేదు. వాడిని చూస్తే జాలివేస్తోంది. వాడు ఏమైపోతాడోనన్న బెంగ పట్టుకుంది.

"ఒరేయ్..నువ్వు ఆమెని అంతగా ప్రేమిస్తున్నావు గాని తను నిన్ను ప్రేమిస్తుందంటావా?" కోపంగా అడిగాను.

"ప్రేమన్నది వ్యాపారం కాదురా నేనింతిస్తాను..నువ్వింతియ్యి అనడానికి"అన్నాడు నిర్లిప్తంగా.

"నీ కిదే చెబుతున్నాను. నువ్వు ఆమెని ఎంతగా ప్రేమిస్తున్నావో..ఆమె కూడా నిన్నంతగా ప్రేమిస్తేనే నేను మీ ఇద్దర్నీ ఒకటి చేసే బాధ్యత తీసుకుంటా. ఒకవేళ నీది వన్వే లవ్ అయితే మాత్రం నేనేం చేయలేను" అన్నాను.

నేను ఆర్మీ సెలెక్షన్స్ లో సెలెక్ట్ అయ్యాను. నాకు మొదటినుండి సైనికులంటే చాలా గౌరవం..ఇష్టం. అందుకే అదే కోరికతో అహర్నిశలూ శ్రమించి నా బాడీని తీర్చుదిద్దుకున్నాను. నేనింకో వారంరోజుల్లో ట్రైనింగ్ కి వెళ్ళాలి. నేనెళ్ళేలోపులో వాడికేమన్నా చేయాలి. నేను లేకపోతే వాడు ఒంటరి వాడైపోతాడు.

ఆ మరుసటిరోజు తనని స్నేహితురాళ్ళతో ఒకసారి గుడికి రమ్మని చాకలి మంగమ్మతో కబురుపెట్టాను.

రమణిని చూశాను. దిగులూ విచారం ముఖంలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. ఆమె దగ్గరగా వెళ్ళి "మావాడంటే నీకిష్టమేనా?"అని అడిగాను.

తను "ఊ"అంది.

"చాలు..ఈ సమాధానం కోసమే నేనొచ్చాను. ఇహ మీ ఇద్దరి పెళ్ళి సాక్షాత్తు ఆ దేవుడు దిగొచ్చినా ఆపలేడు"అన్నాను.

చెప్పకూడదు కాని.. నాకూ గొప్ప ఉద్వేగంగా వుంది. ఇద్దరు ప్రేమికులని దగ్గరుండి కలపబోతున్నాను.

రాత్రి పదకొండు గంటలు.

పల్లెటూరు కాబట్టి చీకటి వీరవిహారం చేస్తోంది.

వాళ్ళని కలిపేందుకు పకడ్బందిగా ప్లానేశాను.

వాళ్ళిద్దరి చేత గుడిలో దండలు మార్పించి రైల్ ఎక్కే ఏర్పాటు చేశాను.

విషయం బయటకి పొక్కి బుల్లబ్బాయి రౌడీల్ని పంపేదాకా వెళ్ళింది.

రైలు బయల్దేరుతోంది.

రౌడీలు మమ్మల్ని తరుముతున్నారు. నేను వాళ్ళని ఎదుర్కుంటూ ప్రేమికులిద్దరిని వేగమందుకోబోతున్న రైల్లో ఎక్కించేశాను.

హమ్మయ్యా వాళ్ళు వెళ్ళిపోయారు. తర్వాత నేనూ హైవే మీదకెళ్ళి సిటీ వెళుతున్న లారీ ఎక్కేశాను.

చావుతప్పి కన్ను లొట్టబోవడమంటే ఏమిటో అర్ధమైంది. ఇప్పటికీ అంత రిస్క్ ఎలా తీసుకున్నానో తల్చుకుంటే ఒళ్ళు గగుర్పొడిచే ఆశ్చర్యం కలుగుతుంది.

నేను నా ట్రైనింగ్ హడావుడిలో బిజీ అయిపోయాను. ఆ తర్వాత నార్త్ ఇండియాలో పోస్టింగ్. ఊరికి వెళ్ల లేకపోయాను. దానికీ కారణం వుంది. ఆ ఊళ్ళో నా అన్న వాళ్ళెవరూ లేరు. మా అమ్మ రాంబాబు పెళ్ళికి ఆర్నెళ్ళ ముందే చనిపోయింది.

తర్వాత ఢిల్లీలో మా ఊరివాడొకడు కనిపించి..రాంబాబు రమణి మా ఊళ్ళోనే ఉంటున్నారని..వాళ్ళ నాన్న మాత్రం వీళ్ళని చేరదియ్య లేదని. వాళ్ళకి పుట్టిన పిల్లాడికి నా పేరే పెట్టారని. కనీసం మనవడిని చూసైనా తాత మారతాడని రమణి ఆశ పడుతోందని చెప్పి వాళ్ళ అడ్రస్ ఇచ్చాడు.

నేను ఒకట్రెండు ఉత్తరాలు రాస్తే జవాబు లేదు. అవునులే నాకంటే ఏ బాదర బందీ లేదు. వాళ్ళ సంసారం ఎన్ని ఒడిదుడుకులెదుర్కుంటోందో?

ఇన్నాళ్ళకి వాళ్ళని చూడ్డానికి వెళుతున్నాను.

నన్ను చూడగానే వాళ్ళెలా రియాక్ట్ అవుతారు?. నా మూలంగా కలిసిన వాళ్ళు నన్ను ఆకాశానికి ఎత్తేస్తారేమో. వాళ్ళబ్బాయికి నా పేరే పెట్టారంటే వాళ్ళ ప్రేమకి జీవం పోశానని..నేనంటే ఎంత అభిమానం?

నేను ఊరికి చేరి అడ్రస్ కనుక్కుంటూ వాళ్ళింటి దగ్గరకి చేరాను. బయట అరుగు మీద రాంబాబు కూర్చుని వున్నాడు. మనిషి నిస్తేజంగా..నిర్లిప్తంగా వున్నాడు. చూడంగానే గుర్తుపట్టడం కష్టం. ఎన్నో సమస్యల్లో..బాధల్లో కూరుకుపోయినట్టుగా వున్నాడు. నేనింకో పది అడుగులు వేశాను. లోపలినుండి రమణి సాధింపులు వినిపిస్తున్నాయి.

"..అనవసరంగా నిన్ను పెళ్ళి చేసుకున్నాను. మా అమ్మానాన్న చెవినిల్లు కట్టుకుని చెప్పారు. ప్రేమా లేదు దోమాలేదు అని. నేను విని చస్తేగా. నెత్తిమీద శని గాడు వున్నాడు. ఐశ్వర్యంలో పుట్టి పెరిగిన నేను నీ దగ్గర ఇలా ముష్టి జీవితం గడపాల్సొస్తోంది. గాడిద చాకిరి తప్ప సుఖ పడింది లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా మా నాన్న నన్ను చేరదియ్యడం లేదు. నా ముందే నా తోడ బుట్టిన వాళ్ళు జల్సాగా కార్లలో తిరుగుతూ..డబ్బు కర్చు పెడుతూ హాయిగా వున్నారు. నా కడుపు కుత కుతలాడుతోంది. పైగా నీ స్నేహితుడొకడు. తగదునమ్మా అని మన ప్రేమ వ్యవహారంలో కలగజేసుకుని మనిద్దరిని ఒకటి చేశాడు. ఈసారెప్పుడైనా కనిపిస్తే ముఖాన పేడనీళ్ళు జల్లుతాను.అనుభవిస్తా డు ..అంతకంత అనుభవిస్తాడు. నిన్ను ఎన్నన్నా ఏం లాభం? అసలు నీలో చలనం వుంటేగా?.."ఆమె వాగ్ధోరణి సాగిపోతోంది.

"నాకూ అర్ధమయిందిలేవే! ప్రేమంటే సినిమాల్లో..నవలల్లో కనిపించినంత అందంగా వుండదని..జీవితాన్ని నరకం చేస్తుందని..ఛ..ఛ..ప్రేమ పెళ్లిచేసుకుని సరిదిద్దుకోలేని తప్పుచేశాను.."మావాడు గట్టిగానే గొణుగుతున్నాడు.

నేను భూమి లోకి కూరుకుపోతున్న అనుభూతి కలిగింది. ఇంకానయం వాళ్ళ ఎదురుపడ్డాను కాదు..అమ్మో ఎంత ప్రమాదం తప్పింది. అప్పుడు వీళ్ళని కలపడానికి ప్రాణాలకి తెగించి ఎంత రిస్క్ చేశాను? ప్రేమికులని ఒకటిచేయడం తప్పని అర్ధమైంది. ప్రేమ కథ సుఖాంతమైతే ఆ తర్వాతి జీవితం దుఖాంతమవుతుందని బాగా అర్ధమైంది. నేను వడి వడిగా స్టేషన్ వైపు అడుగులేశాను..శాశ్వతంగా ఆ ఊరి నుండీ బంధం తెంచుకుంటూ..



“ ఏదో ఒక ప్లే స్కూలులో చేరుద్దాం. అంటే పట్టుపట్టి తీసికెళ్లి ఆ స్కూలులో చేర్పించావు. ఇప్పుడు చూడు. వాళ్లు మనల్ని ఎలా సతాయిస్తున్నారో”... మా వారు నా పైన విరుచుకుపడ్డారు.

“శనివారం ...ఓ బాక్సులో కాస్త ఫ్రూట్ సలాడ్ చేసి పంపండి.” అని స్కూలు వాళ్లు పాపకిచ్చిన పంపిన నోట్ అప్పుడే ఆఫీసు నుంచి తిరిగొచ్చిన ఆయన చేతిలో పెట్టాను.

“ మొన్ననే కదా.. పాత బట్టలుంటే పట్టుకురండి అంటే తీసికెళ్లి ఇచ్చొచ్చాం. మళ్లీ కొత్తగా ఇదేంటి?”

“ అక్కడ మామూలు స్కూళ్లలా ఉండదట. ఎప్పుడూ ఏదో ఒక యాక్టివిటీ ఉంటుంది” ఆయనకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాను.

“ డబ్బులు దండుకోటానికి ఏదో ఒకటి చేస్తూంటారులే

ఓ రోజు తలో పది రూపాయలు పట్టుకురమ్మంటారు. ఇంకోసారి మీరు చదివిన కథలు పుస్తకాలు తెమ్మంటారు. ఏమిటిదంతా?

“ అక్కడకు వెళితే కదా మనకు తెలిసేది... ఓసారి చూసొద్దాం”

“ పేరెంట్స్ కూడా వెంట రావాలి” అని నోట్ లో ఉంది. అది గుర్తు చేసుకుంటూ చెప్పాను.

“ శనివారం మాత్రం బయటకు రావటం నా వల్లకాదు. కుదిరితే నువ్వువెళ్లు” కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు.

“ మనం వెళ్లకపోతే సిరి చిన్నబుచ్చుకుంటుంది. ” అన్నాను.

అంతే ఆయన కోపం పొంగు చప్పున చల్లారింది.

“ సరే...చూద్దాంలే” అంటూ బాత్రూంలోకి వెళ్లిపోయారు.

మేము ఇద్దరం సాఫ్ట్ వేర్ ఉద్యోగులం.

ఉదయం ఆఫీసుకు వెళితే రాత్రి దాకా తిరిగిరాం.

సిరికి ఇంకా మూడేళ్లు నిండలేదు.

పగలంతా తనని చూసుకోటానికి ఓ ఆయాను ఏర్పాటు చేశాం.

వీడియోగేమ్స్ ఆడుకోవటం, టీవీ చూడటం.. ఇదే పాప పని.

ఓ ఆరు నెలలపాటు ఎక్కడయినా మంచి ప్లే స్కూలులో చేరిస్తే తన వయసు వాళ్లు స్నేహితులవుతారు. ఆటపాటలతో ప్రయోజనకరమైన కాలక్షేపం అవుతుంది అనిపించింది.

గూగుల్ సెర్చి చేస్తే నగరంలో పేరుమోసిన ప్లే స్కూలు వివరాలొచ్చాయి. నలుగురైదుగురు కొలిగ్సుని కూడా ఆరా తీశాను.

‘‘ ఏదో ఒక స్కూలులో చేరిస్తే సరిపోయేదానికి... దేనికింత అవస్థ? అని ఆయన విసుక్కున్నా.. నా ప్రయత్నాలు మాత్రం నేను మానలేదు.

ఇంట్లో అమ్మానాన్నలు చెప్పిందాని కంటే, బయట వాళ్లు చెప్పిన విషయాలు పిల్లల్ని బాగా ఆకర్షిస్తాయి. త్వరగా కొత్త అంశాలు నేర్చుకోగలుగుతారు. అది నాకున్న బలమైన అభిప్రాయం.

ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటూ కూడా పాపకి సరైన చదువు చెప్పించకపోతే ఎలా? అన్న పట్టుదల కూడా దానికి తోడయ్యింది.

చివరికి ఓ ప్లే స్కూలు ఎంపిక చేసుకున్నాను.

అన్ని హంగులూ ఉన్నాయి అక్కడ. విశాలమైన హాలు, పిల్లలకు ఆటవస్తువులు, పెయింటింగ్ సామాగ్రి, బొమ్మల పుస్తకాలు అద్దాల బీరువాల్లో కనిపిస్తున్నాయి. పిల్లలు కాసేపు ఆడుకున్న తర్వాత పడుకోటానికి కుషన్ బెడ్స్ లాంటివి ఏర్పాటు చేశారు.

నలుగురు పిల్లలు కనిపించారు

పళ్లెంలో ఉన్న పిండిని తీసి ఓ బాక్సులో పోస్తోంది ఓపాప.

ఇంకో పిల్లాడు బొమ్మకు రంగులద్దుతున్నాడు.మిగిలిన ఇద్దరు పిల్లలు నాలుగయిదు కారు బొమ్మలు ముందేసుకుని ఈ లోకంతో తమకు సంబంధం లేనట్టుగా ఉన్నారు.

“ మాది మాంటిసోరి విధానం. మూడేళ్ల వయసు నుంచి ఎనిమిదేళ్ల వయసు వారు వరకూ చదవవచ్చు. ఆ తరగతులు పక్కనున్న భవనంలో సాగుతాయి. క్రమంగా ఏడాదికో తరగతి చొప్పున పెంచుకుంటూ పోవాలనుకుంటున్నాం ” చెప్పింది ఆవిడ. ఆమె మాటతీరు ముచ్చటగొలిపేలా ఉంది.

అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసి మన దేశానికి తిరిగొచ్చి పిల్లలకు విలువైన విద్య అందించాలనే సంకల్పంతో ఈ ప్లే స్కూలు ఏర్పాటు చేశానని మాటల్లో చెప్పుకొచ్చింది.

అక్కడున్న ముగ్గురు టీచర్లు మంచి ఇంగ్లిషు మాట్లాడుతున్నారు. ఈ వాతావరణంలో సిరి బాగా రాటుదేలుతుందనిపించింది.

అన్నింటిలోకి నాకు నచ్చిన విషయం..

“ఇరవై మందిని మించి తీసుకోం” అని చెప్పటం.

“ అమ్మో అంత ఫీజా? చిన్న పిల్లకి ఇంత అవసరమా?” అని ఆయన అభ్యంతర పెట్టినా నేను పట్టించుకోకుండా స్కూలు వాళ్లడిగిన ఫీజు మొత్తం చెల్లించి తిరిగొచ్చాను.

మర్నాటి నుంచి సిరి స్కూలుకి వెళ్లటం ప్రారంభించింది. రోజుకి మూడు గంటలు.. ఓ చిన్న బాక్సులో కాసిని బిస్కెట్లు, పాలు ఇచ్చి ఆటోలో పంపేవాళ్లం. తను తిరిగొచ్చేసమయానికి ఆయా ఇంటి దగ్గర ఉండేది. అంతా బానే సాగుతోందని నాకు అనిపించినా, ఆయనకి మాత్రం భిన్నాభిప్రాయం ఉండేది.

“డబ్బులు దండుకునేందుకే ఈ హంగామా అంతా...” అని నా మాటల్ని తేలిగ్గా కొట్టి పడేసేవారు.

శనివారం రానే వచ్చింది.

సిరిని వెంటబెట్టుకుని స్కూలుకు వెళ్లాం.

పాపను తమకు అప్పచెప్పి, పేరెంట్స్ అందరినీ దగ్గర్లోని ఇంజనీరింగ్ కాలేజికి రావలసిందిగా సూచించారు స్కూలు వాళ్లు.

“ ఈ స్కూలు వాళ్లకి పనిలేదు. మనల్ని ఇబ్బంది పెట్టటానికి కాకపోతే దేనికిదంతా ...” మళ్లీ విసుకున్నారు ఆయన.

“ ఇంత దూరం వచ్చాం కదా... అసలేమిటో చూద్దాం” అన్నాను ఆయనకి సర్ది చెబుతూ.

వాళ్లు చెప్పిన కాలేజికి వెళ్లాం. మరికాసేపటికి పిల్లలు, స్కూలు టీచర్లు వ్యానులో అక్కడికొచ్చారు.

అక్కడ జరుగుతున్నదేమిటో మాకు అర్థం కాలేదు.

“ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా ఈ కార్యక్రమం చేపట్టాం. పిల్లలు తమ ఇంటి నుంచి తెచ్చిన ఫ్రూట్ సలాడ్ కొనుగోలు చేయండి. మీకు నచ్చిన మొత్తం ఆ చిన్నారులకు చెల్లించండి”

ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ అక్కడ గుమిగూడిన దాదాపు వంద మంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చెప్పారు.టీచర్లు చిన్న కప్పుల్లో ఫ్రూట్ సలాడ్ నింపితే... పిల్లలు వాటిని విద్యార్ధుల దగ్గరకు స్వయంగా తీసికెళ్లి అందించటం మొదలు పెట్టారు. పదిరూపాయలు విలువ చేసే కప్పు సలాడ్ కి ఒక్కొక్కరు రూ. 50, రూ.100 ఇవ్వటం ప్రారంభించారు. ఒక విద్యార్థయితే సిరికి ఏకంగా రూ.500 కిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

పిల్లలే కాదు. స్కూలులో పనిచేసే ప్రతి ఒక్కరూ సలాడ్ తెచ్చిన వాళ్లలో ఉన్నారు.

గంటలోపే కార్యక్రమం పూర్తయింది. బాగానే డబ్బు పోగయ్యింది.

అక్కడ వీడ్కోలు తీసుకున్నాక ఐదు నిముషాల లోపు దూరంలో ఉన్న వృద్ధాశ్రమానికి పిల్లల్ని వెంట బెట్టుకుని వెళ్లారు. వచ్చిన సొమ్మును అక్కడున్న వృద్ధులకు కాస్తకాస్త చొప్పున పిల్లల ద్వారా అందించారు. అది అంత పెద్ద మొత్తం కాకపోవచ్చు. కానీ వృద్ధులంతా కదిలిపోయారు. పిల్లల్ని ప్రేమగా గుండెలకు హత్తుకుని ముద్దులతో ముంచెత్తారు. కొందరయితే కన్నీళ్లుపెట్టుకున్నారు.

నిజంగా ఇదో అద్భుత దృశ్యమనిపించింది.

పాఠాలు చెప్పే స్కూళ్లు చాలానే ఉంటాయి. కానీ..పిల్లలకు మానవత్వం గురించి నేర్పేవి, ఎదుటి మనిషికి ఇవ్వటంలో కలిగే ఆనందం గురించి తెలియచెప్పేవి అరుదుగా ఉంటాయనిపించింది . బాల్యంలోనే ఇలాంటి వాటికి అలవాటుపడితే భవిష్యత్తులో వారు మరింతగా రాణి స్తార నటం లో ఎలాంటి సందేహంలేదు.

‘‘పాప స్కూలు విషయంలో నా ఎంపిక సరైనదే’’ అన్న నిర్ణయానికొచ్చాను.

మా వారు కూడా అదే అభిప్రాయానికి వచ్చినట్టున్నారు. అప్పటివరకూ నామీద చిర్రుబుర్రులాడిన ఆయన నోరు మెదపలేదు. మేమే కాదు.

అక్కడి కొచ్చిన తల్లిదండ్రులందరం జీవితంలో కొత్తపాఠం నేర్చుకున్న విద్యార్థులమయ్యాం.




ముందు మెల్లగా మొదలైంది. .....

'టక్. టక్.. తేజా! తేజా!'

నిశ్శబ్దం!..

'ఠాక్.. . ఠాక్.. ఈ సారి గట్టిగా!

' తేజా! తలుపు తెరు..'

నిశ్శబ్దం...

'తేజా!తలుపు తెరువు నాయనా!..' ఇప్పుడు గొంతు మారింది. తలుపు మీది శబ్దం దరువు మారింది. 'ధబ్..ధబ్.. ధబ్..'

'తమ్ముడూ! తలుపు తెరవరా! అన్నం నీళ్ళు లేకుండా ఎన్నాళ్ళురా!'

ఆ గదిలో...చీకటిలో.. వెలుగు ప్రసరించదు. శబ్దం వినపడదు.

చీకటి అనిర్వచనీయమైన సుఖం. శాశ్వత శాంతి. వెలుతురు అక్కడ నిషిద్ధం!

కళ్ళు తెరిచాడు తేజ. చీకటి నల్లని కన్ను .. కళ్ళ ముందు.... కను రెప్పలు భారంగా మూత పడ్డాయి. కన్ను తెరిచినా, కన్ను మూసినా ఒకటే! తేజ శ్వాస భారంగా ఆడులోంది. , నెమ్మదిగా కొట్టుకునే గడియారంలా. అది ఒకప్పుడు కమ్మరి కొలిమిలో ఊదిన నిప్పు రవ్వ. దాని మీద చీకటి సుత్తి. అదే జీవ శక్తి. .....ఇప్పుడు... క్రమంగా బలహీన మవులోంది.

తేజ బయటి శబ్దాలు లీలగా వినపడుతున్నాయి. తల తిప్పి చూసాడు.

ఒక వెలుగు రేఖ కత్తిలా, తళ తళ మెరుస్తూ!!

ఛీ.ఛీ. వెలుతురు చీకటిని హత్య చెయ్యాలని చూస్తున్నది.. .

తలలో జోరీగల గుంపులు తిరుగుతున్నాయి.

'తేజ టెన్త్ లో రాంక్ హోల్డర్. ఇంటర్ లో మంచి మార్కులు సంపాదించాడు. ఎంసెట్ లో రాంక్ వంద లోపే! అక్కడే ఏదో మాయదారి రోగం పట్టుకుంది. అంతా మా ఖర్మ.!' తల్లి తల్లడిల్లుతూ అన్న మాటలు. ఈ గదిలోకి వచ్చిన తర్వాత, ఈ చీకటితో మమేకం అయిన తర్వాత, తల్లి మాటలు తేజను ఏ మాత్రం కదిలించలేదు. తల్లి ప్రేమ ఉందా? ఉంటె! నిజంగా వుంటే, వీణ గురించి హేళనగా, వ్యంగంగా మాట్లాడుతుందా? తల్లి ప్రేమ లేదు. చిన్నప్పటి నుంచి పెంచినది కాబట్టి 'అనుబంధం' మాత్రమే వుంది. పిల్లల మీద పెద్దలకు, 'వాత్సల్యం' అనే ఒక మెరుపు దారం మాత్రమే వుంటుంది. అది అభేధ్యమైన లోహ నిగళం కాదు..

అనుబంధం ప్రేమ కాదు!.

వాత్స్యలం ప్రేమ కాదు!.

వీణ ను కాలేజ లో చేరే వరకు చూడలేదు. చూడగానే.. విద్యుత్ ప్రవాహపు చరుపు చెళ్ళు మంది. షాక్ ఆఫ్ ఎలక్ట్రో మోటివ్ ఫోర్స్! అంతలోనే.. షాక్ పోయి నిర్మల నిర్వాణ ప్రశాంతత. పూర్ణ చంద్రుని కాంతిలో వికసించిన కలువను చూసినట్టు అనిపించింది. మలయ పర్వతాల మీదనుంచి వచ్చిన తుషార శీతల పవనంలా అనిపించింది. కాంతి నిండిన మనోహరమైన కన్నులలో మనసుని శాసించే చల్ల దానాలు ఎన్నో!

'ప్రేమ, దోమా కాదు. అది కామ. ఈ వయసులో అందరికీ వచ్చే రోగం వీడికి వచ్చింది. పట్టాభి రామ్ దగ్గరికి తీసుకు వెళితే, ఆయన వీడి కళ్ళు తెరిపిస్తాడు.' తండ్రి కర్ణ కఠోరమైన స్వరం...

'ఆ. ఇదంతా ఈ వయసులో వచ్చే జబ్బు. దీనికి మందు లేదు. అన్ని వైరస్ లాగానే అది కూడా 'స్వయం నాశనం' చెందుతుంది. ఈ వైరస్ కొన్ని వారాల్లో, నెలలో, మరీ ఉధృతమైన రోగమైతే కొన్ని సంవత్సరాలు వుంటుంది. అంతే.. . జీవన క్రమంలో ఇదో దశ.. ఫేజ్ .. 'నువ్వు లేక నేను జీవించ లేను' అన్న వాళ్ళలో దాదాపు వంద శాతం మంది ఇంకా బతికే వున్నారు ఆ 'నువ్వు' లేక పోయినా!

తలుపు బయట మాటలు. ఎవరో ఆ మహానుభావుడు. ఇంత టేలెంట్ ఇక్కడే వుంటే ఇంకా పట్టాభి రామ్ ఎందుకు?

క్రమంగా తలుపు బయట ఇతర గొంతుకుల శబ్దం బలహీన మైంది. కొత్త 'వింత' అయి పోయింది. గొంతులు, ఆ తాలూకు మనుషులు రావడం తగ్గాయి.

ఇంటి వాళ్లే! రోజుకు కనీసం మూడు సార్లు తలుపు కొడతారు. ఇవాళ అక్క వచ్చింది. ఆమెకు విసుగు వచ్చే వరకు ఇలా 'ద్వార బంధ రోదన' వుంటుంది. తర్వాత, అదీ ఆగి పోతుంది...ఏదీ శాశ్వతం కాదు.

నిత్యమైన, స్వచ్ఛమైన చీకటి ఒక్కటే మిగిలి వుంటుంది.

వెలుతురు మోసం! దగా!. ఇదే నిజమని నమ్మిస్తుంది! స్వల్ప కాలానికి సంతోషాన్ని ఇస్తుంది.

వీణ ను చూస్తానని అమ్మ చెప్పింది. తేజ కళ్ళల్లో వెలుతురు! మోసకారి వెలుతురు!

నమ్మాడు. వీణ ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఆ సందుల్లో కారు వెళ్ళ లేక పోయింది. పెద్ద రోడ్డు దగ్గర దిగి సందులోకి వెళ్ళారు.

చిన్న పెంకుటిల్లు. ఒకటే తలుపు. ఇంటినీ, వీధినీ విడ దీస్తూ చిన్న అరుగు. వీణ తలుపు దగ్గరే వుంది. ఎప్పటి నుంచి ఎదురు చూస్తోందో? వీణ చూడగానే రక్తంలో, నరాలలో, మెదడులో, గుండెలో, మనసులో అనిర్వచనీయమైన ఆనందం! నల్లటి వత్తైన జుట్టు మెరుపు చుక్క లాటి ఆమె మోహం పై కప్పు కుంది. అప్పుడు తెలియలేదు అది విషాదపు తొలి మెట్టు అని.

లోపలికి ఆహ్వానించింది...

లోపల రెండు కర్ర కుర్చీలు, ఒక ప్లాస్టిక్ కుర్చీ. పాత కాలపు టీ పాయ్... శబ్దం చేస్తూ ఫేన్ తిరుగుతూ వుంది.

స్టీల్ గ్లాస్ లో మంచి నీళ్ళు తీసుకు వచ్చి ఇచ్చింది వీణ. అమ్మ నీళ్ళు తాగ లేదు. నడుము వంగిన ఒక ముసలాయన వచ్చాడు. 'మా నాన్న.' అంది వీణ. లోపలనుంచి అంత కన్న వంగిన ఒక ముసిలావిడ వచ్చింది... ఆవిడ

చేతిలో టీ కప్పులు. 'మా అమ్మ' అంది ఆవిడను చూపిస్తూ. తీక్షణమైన కాంతి వేడిలో పచ్చటి మొక్కలు ఎండి పోతాయి. అలాగే, లేమి అనే వేడికి వయసు, అందం, లాలిత్యం ఇగిరి పోయాయి. వయసు కన్న ముందే ముదిమి వచ్చింది.

అసహనంగా కూచుని వుంది అమ్మ...టీ తాగలేదు. ఎలాగో చిరాకు బయటకు కనపడకుండా నిగ్రహంతో నిర్వహించ గలిగింది. కారులో కూర్చున్న తర్వాత అంది. 'బాగుంది.. బాబూ.. చాలా బాగుంది.' అంది. ఆ మాటల్లో వ్యంగం స్పష్టంగా అర్థమైంది తేజ కు.ఆ రాత్రి నిద్ర పట్ట లేదు. బోలెడంత సిలబస్... చదవాల్సింది చాలా వుంది... రాత్రి హాలులో మాటలు వినపడ్డాయి.

'చూసావా పిల్లని.''ఆఁ.. అయ్యింది ఆ భోగం.'పిల్ల బాగుందా?''బాగుంటే చాలా? అదొక్కటేనా? పాత బొళ్ళ కొంప.. అలాగా జనం వుండే బస్తీ. పిల్ల పేరే చిత్రం గా వుంది. వీణ ట. వీణ. మరీ జాణ లా వుంది. మన వెంగళప్ప ని బుట్టలో పడేసింది. గొప్ప ఇంటి కోడలవాలని పేరాశ..'శూలాల్లాటి వెటకారపు మాటలు...'మర్యాదలు?'

'ఆఁ.. ముందు పంపు నీళ్ళు...తర్వాత టీ చూరు నీళ్ళు.''అయితే మన వాడికి జీవితాంత నిరీక్షణ.. వీణ కోసం.'పెద్ద పెట్టున నవ్వులు. 'అంతు లేని నిరీక్షణ. ఇక వీణ, ముసలి, గూని తండ్రి, చిరుగు చీర తల్లి, పొగ మంచు లాటి జ్ఞాపకాలే!'

మరొక్క సారి నవ్వులు. జంతువును చంపేటప్పుడు హైనా మృగాలు నవ్వే నవ్వులు. మర్నాడు వీణ కాలేజీ కి రాలేదు. మరో రెండో రోజులూ అదే పరిస్థితి.

నాలుగు రోజుల తర్వాత తేజ వెళ్ళాడు .......రాత్రికి రాత్రి ఎక్కడకో వెళ్లి పోయారుట.మరునాడు కాలేజీ కి ఉత్తరం రాసింది వీణ.'చీకటికి వెలుతురులో స్నేహం కుదరదు. మన స్నేహం నాకు, మా తల్లి తండ్రులకు, అంధకారం మిగిల్చింది. లేడి పిల్ల, తన తోటిదే కదా అని పులి పిల్ల తో స్నేహం చెయ్య కూడదు. అది ప్రకృతి విరుద్ధం. అందరినీ కలిపేది చీకటి. మళ్ళీ మన కలయిక వుంటే..... అక్కడే.' తేజ కి అర్థం అయ్యింది ఏమై వుంటుందో! దుర్మార్గులు తల్లి తండ్రులు...వీణను బతక నిస్తారా! ఎప్పటికైనా వీణ బ్రతుకు ప్రశ్నార్థకమే !చీకటి అంటే తిరోగ మనమనీ, తిరోగామి వైఖరి అని, వాదించే వాడు తేజ. ' చీకటి అంటే తిమిరం, ఈ 'తి' అనే అక్షరం తో మొదలయ్యే పదాలన్నీ ఈ వైఖరినే సూచిస్తాయని నేను అనుకుంటాను. తిరిపెం (భిక్షాటన), తిట్టు (దుర్భాష), తిక్క (మూర్ఖత్వం), తీట (దురద ), తీపు (సన్నని నొప్పి) ఇలా ఎన్నో.' ఇప్పుడు.. అది మారి పోయింది. చీకట్లు లోకానికి అందాన్నిస్తాయి. చీకటి తన నల్లని చుక్కని నిండు జాబిల్లి మీద కూడా పెట్టింది. చందమామ అందం దానితో ద్విగుణీకృత చీకటిలో సౌందర్యం వుంది. చిరు నవ్వుల పాపాయి పాల బుగ్గల మీద చుక్క బొట్టు, కంటి

పాప, కను బొమ్మలు, మబ్బులు, కాళీయ మర్దనుడూ, కలువలు, చీకటీ అన్నీ నలుపే! నల్లని రంగు బొల్లి రోగాన్ని దరి చేరనీయదు. తియని గొంతుల కోకిలలు, తళ తళ మెరుపులా నెమలి ఈకలు, తుమ్మెదలు నల్లనివే. నలుపు, చీకటి లేక

పోతే మనుషులే లేరు.

మనిషి లేని భూమి కరిగించిన సీసం పొంగే ఎడారే! మిణుగురు పురుగులూ, నల్లటి మేఘాల్లో తటిల్లతలూ, నక్షత్రాల కాంతి, చంద్ర కాంతి అందాలు, చీకటి లేక పోతే ఉండగలవా? ఈ గదిలో, ఈ నిబిడాంధకారంలో నల్లటి మబ్బులు కవోష్ణ జలరాసులను కురుపించాయి.

ఉప్పు సముద్రం చేరని వాన నీరు. ఇంకెందుకు.. ఇదీ 'ఉప్ప'నేగా.. 'చీకట్లు నల్లని కాంతులతో భూమి మీద అడుగు పెట్టాయి. నిశ అనే స్త్రీ భుజాల మీద ఎక్కి, శిరస్సు మీద నిలబడి, నక్షత్రాలనే స్త్రీల చెక్కిళ్ళను స్పృశించి, ఆకాశం లోకి పాకి, చంద్రుని తాకి, కొండలలో దూకి, మెల్లగా భూమి మీద ప్రవేశించింది చీకటి. చీకట్లు లోకానికి అందాన్ని చేకూరుస్తాయి.

చంద్రముఖి ముఖం మీద కస్తూరి బొట్టు పెట్టాయి. నల్లని వంకీల జుట్టు కలిగిన స్త్రీ కనుబోమ్మలనే విల్లు బాణాన్ని లొడిగాయి. కలువ వంటి కను రెప్పల మీద వాలాయి. లేడి కన్నుల వంటి కన్నులు కలిగిన స్త్రీ బంగారు చెక్కిలి మీద అగరు చుక్కని పెట్టాయి. వెండికొండ మీద మన్నులాగా కనిపించాయి. చంద్రుడనే పొలంలో జింక లా తిరిగాయి...' ఏవో పద్యాలు, అర్ధాలు, తెరలు తెరలు గా, పీచులు గా పీచులుగా, చెట్ల ఆకుల నీడలో నాట్యం చేసే చీకటి రేఖల్లా సుళ్ళు తిరుగుతూ తన లో కలుసుకుంటున్నాయి. చివరిలో ..'కానుగు చెట్ల నీడల్లో ఒక స్వప్న శయ్య మీద ఈ మహాంధకారంలో హాయిగా శాశ్వతంగా నిద్ర పోవడంలో మనస్సు శాంతి పొందింది.' 'ఎన్నో నాళ్ళ క్రితం నా కోసమే రాసావా .. నాకు చల్లని కానుగ చెట్ల నీడల్లో సేద తీరాలని వుంది. ఇక నిరీక్షించే ఓపిక లేదు. వీణ లేని బతుకు నాకొద్దు. నేను పిచ్చి వాడిననీ, లోక శత్రువుననీ అనని! ఈ వస్తు మాయ ప్రపంచంలో నాకు చోటు లేదు. .. ఇప్పుడు హాయి గా వుంది. ప్రశాంతంగా వుంది. చుట్టూ చీకటి దట్టంగా అలుముకుంటూ వుంది. భూమ్యాకర్షణ శక్తి అనే అవరోధం లేదు. శరీరం, మనసు తేలిక పడుతూ వుంది. లోకమా.. నన్ను క్షమించు. నన్ను అనుసరించకు. నా లా చీకటిని ప్రేమించకు.. చీకటిలో కలవాలని అనుకోకు.' భళ్ళున తలుపులు బద్దలయ్యాయి.

'బాబూ! ఇలా అయి పోయావేమిట్రా?.. ఇలా అవుతుందని అనుకోలేదే?' తేజ శరీరాన్ని ఒడి లో తీసుకుని ఏడుస్తూ వుంది తల్లి. 'తమ్ముడూ ? ఎవత్తిరా ఆ రాక్షసి? నీ ప్రాణాలు తీస్తోంది.' అక్క అక్కసులో తిడుతూ వుంది. ఆ తిట్లు తేజకి కోపం తెప్పించ లేదు. 'తేజా! డబ్బు తో అన్నీ కొన గలననుకున్నాను. అది తప్పని తెలిసింది.' మనసులో అనుకుంటూ తేజ దగ్గరగా వచ్చాడు తండ్రి. ఆయన కాలు తగిలి సీసా దొర్లుకుంటూ దూరంగా వెళ్లి పోయింది. దూరంగా వెళ్లి పోయింది. వెళ్లి...పోయింది.




"ఒరే! మనవడా! ఇంకొక్క రెండట్లు తినరా! మానాయనకదే! మాబాబుకదే! చచ్చినీకడుపునపుడతారా! "

" ఇపుడే నీ బాధపడలేకున్నా, ఇంకా నాకడుపున పుట్టిచంపుకు తింటానంటావుటే ! వద్దే వద్దు బామ్మా!ఐనా నీ ' లక్షట్లనోము' పూర్తి కానుఇంకాఎంతకాలం పడుతుందే! ఇలా రోజూ నాకు ఉదయం సాయంకాలం  మధ్యాహ్నం లంచికీ మూడొందలరవై రోజులూ అట్లు పెట్టి ఎందుకు తిట్లు తింటావే! ఈరోజు నుంచి నావల్లకాదు. నేను తినను.తినలేను." అంటూ లేచి చెయ్ కడుక్కొని ఇంట్లోంచి బయట పడ్డాను . మా బామ్మ లక్షట్ల నోముపట్టిందిట! దాన్నిపూర్తిచేయటం కోసమని ఇంటికొచ్చినవారి కందరికీ, అట్లుపోసి తిని పిస్తున్నది. మాఇంటికి నా స్నేహితులు రాను భయపడుతున్నారు.బంధువులు రావటం మానేశారు.

ఆఫీస్ లో నాలంచ్ బాక్స్ ఓపెన్ చేయగానే మొదట్లో అంతా వాసనపీల్చుకునేవారు రాను రానూ అంతానవ్వటం మొదలెట్టారు., ఇంతకు ముందు చాటుగా నవ్వుకునేవారు ,ఇప్పుడు పైకే నవ్వుతున్నారు.ఈ అవమానం బాధ భరించలేక మాబామ్మ లక్షట్ల నోము ఎలాపూర్తి చేయాలా అని ఆలోచించసాగాను. నాపక్క సీటులో ఉన్న సీతామహాలక్ష్మిని పేరు పురాతనంగా ఉంది కదా,ఆమాత్రం అట్ల గురించిన నాలెడ్జ్ లేకపోతుందాని అడిగాను .

" ఏమండీ సీతగారూ! ఒక లక్ష అట్లకు ఎన్ని బియ్యంకావాలి? " అని ఆమె స్పృహ తప్పి నంత పనై తేరుకుని " ఓమైగాడ్ ! లక్ష అట్లా! " అంది .

" ఔనండీ ! మాబామ్మ లక్ష అట్ల నోము పట్టింది . అదిపూర్తి కావాలనే రోజూ అట్లు తినిపిస్తున్నది. కాదంటే తాను నరకానిపోతానని ఏడుస్తున్నది. పైగా ఆమె నన్ను పెంచి పెద్దచేసింది. ప్లీజ్ కాస్తంత లెక్కకట్టి ఎన్ని బియ్యం ,మినప్పప్పుకావాలో చెప్తే ఒకరోజున అట్ల సంతర్పణ చేయిస్తానండీ!" అని బ్రతిమాలాను.

" నాకసలు అట్లుపోయటమే రాదండీ! ఐనా జీవితాంతం తిన్నా లక్ష అట్లు పూర్తికావనుకుంటా ." అంటూ నవ్వసాగింది.

" ప్లీజ్ సీతగారూ! కాస్తంతా సాయంచేయరూ!"అన్నాను దిగాలు మొహంతో ." రేపుమా అమ్మ నడిగిచెప్తాన్లెండి " అనిహామీ ఇచ్చింది.

మర్నాడు రాగానే అడిగాను. " ఒక వందగ్రాముల బియ్యానికి 25గ్రా.మినప్పప్పు తో చేస్తే మూడు అట్లు వస్తాయిటండీ , దాని ప్రకారం మీరే లక్ష అట్లకు ఎన్ని బియ్యం పప్పుకావాలో లెక్కేసుకోండి." అని తన ఫైల్స్ తెరిచి పనిలోపడింది .

నేను వెంటనే ఆఫీస్ కాయితాలే అనుకోండి , తీసుకుని లెక్కలు కట్టడం మొదలెట్టాను. పదికాయితాలు పూర్తయ్యాయి , ఐనా లెక్క తేలలేదు. నేనసలే లెక్కల్లో పూరు. ఇంతలో మా ఆఫీసర్ గారు నా ఫైల్ పూర్తైతే తీసుకు రమ్మని కబురంపగానే నేను లక్ష అట్లకు కట్టి న లెక్కల లెడ్జర్ తీసుకుని లోపలికెళ్ళి ఆయన ముందుంచాను.

ఆయన ఫైల్ తెరిచి చూసి ఏమీ అర్ధంకాక ,ముఖం పైకెత్తినా వేపు చూసి " ఏమిటయ్యా! ఇదేంటీ! బియ్యమేంటీ ,

మినప్పప్పేంటీ, నూనేంటి.. ఈక్యాలికులేషన్సేంటీ.? ఉద్యోగం మానేసి హోటలేమైనా పెట్టబోతున్నావా?" అన్నారు.అప్పుడుగాని నేను చేసినతప్పేంటో తెలిలేదు.

"పొరబాటైందిసార్ ! ఇదోపరధ్యానం లో ఇంకోటితెచ్చాను. ఒక్క నిముషంలో తెస్తాను ." అంటూ ఆయనచేతిలో ఫైల్ గుంజుకుని అసలు ఫైల్ తీసుకెళ్ళాను.

ఎలాగో గండం గడిచింది. మాబామ్మను మనసారా తిట్టుకుంటూ ఇంటి కెళ్ళాను.

అసలు మీకూ మా బామ్మ గురించి కొంచెంచెప్పాల్సిఉంది. మా అమ్మానాయనా రైల్ యాక్సిడెంటలో ఒక్కమారే పోతే, ఎక్కడో బెర్తుల చాటున పడివున్న నన్ను వెతికి తెచ్చుకుని , కంటికి రెప్పలాకాపాడుకుని పెంచిపెద్దచేసి చదువు సంస్కారం నేర్పి ఉద్యోగస్తుడ్ని చేసి, ప్రాణాలన్నీ నామీద ఉంచుకుని బ్రతుకు తున్నది బడుగుబామ్మ.ఐతే ఆమె కు పిత్రార్జితంగా అంటే వాళ్ళనాన్నకు ఆమెక్కొర్తే ,ఆమెకు మానాయ ఒక్కరే , అందువల్ల కోట్లు చేసే ఆస్థిని నన్నూ కాపాడుకుంటూ , నేను బాగుండటంకోసం ఎన్నెన్నో నోములూ వ్రతాలూ చేస్తున్నది.చిన్నతనంలో బామ్మ వాళ్ళబామ్మ దగ్గరుండి పట్టిచ్చిననోములన్నీ పూర్తిచేసి , చివరకు ' లక్షట్ల నోమూ పట్టింది. అదినా ప్రాణానికొచ్చింది.

బామ్మ కుపెద్ద లంకంత బంగళాఉంది, దానిచుట్టూ అన్నిరకాలపళ్ళచెట్ల తోట , పూలతోట దానికి ఇద్దరు తోటమాలులు మాఇంటి వెనకే గెస్ట్ హౌస్ లో ఉంటారు కుటుంబాలతో.ఆఇంటినంతా నవీకరించి అన్ని సౌకర్యాలతో పోర్షన్స్ గామార్చి , పదికాపురాలకు అద్దె కిచ్చింది, ఆసొమ్ముతో తోట నుండీ వచ్చే ఆదాతో, పొలంలో పండే పంటతో నన్నొక చిన్నపాటిజమీందార్ను చేసింది. కోట్లకు వారసుడ్ని చేసింది. మరిపెద్ద చదువులు చదివిస్తే దేశాలుపట్టిపోతానని ఎంకాం చదివించింది. నేనేమో ఎలాగో పోటీపరీక్షలురాసి LIC. లో ఉద్యోగం సంపాదించుకున్నాను. ఐనా చాలా సాదాసీదాగా తానుంటూ వృధావ్యయంచేయక .జీవనంసాగిస్తూ నాకోసమే నోములన్నీ , నాచదు వు కు కొన్నినోములూ ,నా ఆరోగ్యానికి కొన్ని నోములూ, నా ఉద్యోగానికి కొన్ని నోములూ ఇలా పాపం మాబామ్మ నాకోసం నోము లు పడు తూనే ఉంది. అలాంటి బామ్మను కాదనలేను.

మీకింకోవిషయం చెప్పాలి.మా ఇంట్లో అద్దెలకుండే వాళ్లకంతా అట్లు రోజూ వ్యక్తుల్ని లెక్కేసి పంపుతుంటుంది. మాఇంట్లో అద్దెలకుండే వారు , బామ్మాఅట్లుపోసి తెచ్చేలోగా ఇంట్లోంచిపారిపోయి ఏరాత్రికో వస్తుంటారు. మాఇంటికి ‘అట్లవారిల్ల ‘నిపేరుకూడా వచ్చింది.ఆ అట్ల ఇంట్లో పోర్షన్ ఖాళీగా ఉంది , అట్లకు భయపడకపోతే వెళ్ళిచేరండి" అనికూడాచెప్పు కుంటారు. దేవుకిని నివేదన చేసిన అట్లు పారేయ కూడదని వారి బాధన్నమాట! మాఇంటిముందు బిచ్చగాడి కేక ఏంటంటే " అమ్మా! అట్లుతప్పు ఏమున్నా పెట్టమ్మా!" అని ఆకేక విని అంతా నవ్వుకుంటారు.

మా బామ్మంటే నాకూ ప్రాణమే ! ఐనా 'ఈ లక్షట్ల నోమునెలా పూర్తిచేయాలి' అనేదే నాముందున్న సమస్య.

ఒకరోజుని మా బామ్మనే అడిగాను. "బామ్మా! ఇంతవరకూ ఎన్ని అట్లు పూర్తయ్యాయే! లెక్కకట్టిచెప్పు.మొత్తం పూర్తిచేసే మార్గం ఆలోచిద్దాం. అట్లునోము పూర్తైతేగానీ నాపెళ్ళి జరిగేలాలేదే!అసలింతకూ ఈ పిచ్చినోములేంటే !" అని నేనడిగినదానికి మా బామ్మ ఇలాచెప్పింది." మీ అమ్మ ఏనోమూ నోయక ఉద్యోగమని తీరికలేదని అనేది అలా అర్ధాంతరంగా పోయిందిరా! నీవైనా బావుం డా లని , నావంశాంకురానివి అందుకేరా నాయనా ఈ నోములన్నీని. "

" ఐనా ఎన్ని నోములునోస్తావేబామ్మా! నీం జీవితం అంతా నోములతోనే గడిచి పోతున్నది ! ఎన్ని నోములు నోచావే ఇప్పటికి?" అని పొరబాటున అడిగినందుకు , "16 కుడుముల తద్ది నోము,అక్షయ బొండాల నోము,అన్నం ముట్టని ఆదివారాల నోము,బచ్చల గౌరీ నోము, అట్ల మీద ఆవ పూల నోము,అట్ల తద్ది నోము,ఆపద లేని ఆదివారము నోము,చిలక ముగ్గుల నోము, చిత్ర గుప్త నోము,కన్నె తులసమ్మ నోము ,ఉప్పు గౌరీ నోము, చిట్టి బొట్టు నోము,దీప దాన నోము,కుందేటి అమావస్య నోము, ధైర్య లక్ష్మి నోము,గడప గౌరీ నోము,లక్ష పసుపు నోము,కైలాస గౌరీ నోము,కళ్యాణ గౌరీ నోము, కంద గౌరీ నోము,మాఘ గౌరీ నోము,మాఘ సప్తమి నోము,మార్గశిర లక్ష్మి వారాల నోము,మహాలక్ష్మి నోము , లక్ష వత్తులనోము , ముప్పైమూడు పౌర్ణాలనోము ఇంకా...."

" ఆపవేతల్లీ ఆపిహ . ఇంతకూ ఈ 'లక్షట్లనోము' ఎందుకోసమే బామ్మా! ఈ నోముతో మన ఇంటి పేరేమారిపోయిందికదే!"

" ఓరీ! కడుపు చలవకు అట్లు పెడతారురా! తిన్నవారు దీవిస్తారు."

" కాని మనంపెట్టే అట్లుతినేవారు విసుక్కుంటున్నారే! లోలోపల తిట్టుకుంటున్నారుకూడా! "

" అదేమోనాకు తెలీదు కానీ , డెబ్బై ఏళ్ళదాన్ని ఇంకా ఎన్నాళ్ళుంటానుగా ! నీపెళ్ళిచూసిపోవాలి, దానికి ముందే ఈ లక్షట్లనోము, ఉద్దేపనా పూర్తవాలి. దానికి దారిచూడు." అంది. ఇహ నేను ఆలోచన్లోపడ్డాను.

మా స్నేహితుడు రామాచారిని సాయమడిగాను. వాడికి నాటకానుభవమూ ఉందిలెండి. వాడుచక్కగా పురోహితుని వేషం

ధరించి మాఇంటికి పంచాంగంతో వచ్చాడు. మాబామ్మ కు ఉద్దేపనతీర్చను ముహూర్తం నిర్ణయించను వచ్చిన పూజారిగా పరిచయం చేశా ను. మాబామ్మ వాడికి తగుమర్యాదలు చేసి," పంతులుగారూ! ఈనోము పూర్తిచేయించి నేను నరకం పాలుగాకుండా కాపాడి, మా వాడి పెళ్ళికూడా మీ చేతులమీదుగా జరిపించండి.పెద్దముండాదాన్ని ఎంతోకాలం బ్రతకలేను." అనిబ్రతిమాలసాగింది. మావాడు

" మీరింతగాచెప్పాలాబామ్మగారూ!ఐతే మీరు నామాట శ్రద్ధగావినండి. వినాయక చవితికీ సత్యనారాయణ వ్రతానికీ బంగరు ప్రతిమ గానీ, వెండిప్రతిమగానీ, చివరకు పంచలోహప్రతిమ గానీ అదీలభ్యంకానిచో పసుపుతోనైనాచేసి పూజిస్తాం కదా!అలాగే ప్రత్యామ్నాయం గా అట్లపిండి అంతామీరు రుబ్బలేరు గనుక , ఒక గ్రైండర్ తెప్పిస్తాను,దాన్ని మీరు స్విచ్ వేసి ఆంచేయండి , నా ఎరికలో ఒక వసతి గృహముంది.అక్కడికి వెళదాం , మరో విషయం అట్ల సైజ్ తగ్గించి చిట్టిగారె ప్రమాణం చేశామంటే మీ నోము ఒక్క వారంలో పూ ర్తై ఉద్దేపన కూడా తీర్పిస్తాను. హాస్టల్లో మీరు స్టవ్ వెలిగిస్తే అక్కడివంటవారు దోసెలుపోసి బాగా ఆకలిమీదున్న అక్కడి ఐదొందలమంది పిల్లలకూ ఇస్తారు.మీ నోము ఒక్కవారం లో ఫినిష్. ఇహ ఉద్దేపన విషయానికొస్తే ,ఇదీనీ అవసరాన్ని బట్టి లభ్యతను అనుసరించి ఒక చిన్న అరచేతిలో పట్టే సూక్ష్మమైన రోలు పత్రాన్నిచిరమడతలో ఉంచి,చిట్టిగారె ప్రమాణపు అట్లు,వెయ్యికి ఒకటిచొప్పున మీ లెక్కప్రకా రం పదీపోసి ఆరోట్లో ఉంచి ఒక ముత్తైదువకు ఇప్పిస్తాను. మీ నోము,ఉద్దేపనా కూడా తీర్చేఏర్పాటు చేస్తాను." అని బామ్మను ఒప్పిం చా డు. లేకపోతే బామ్మ రోలు ఒళ్ళోపెట్టుకుని ఉద్దేపన తీసుకోవాలని పట్టుదలతో ఉందిలెండి.మా వాడి పధకం ప్రకారం ఒక్క వారం లో ఆవసతిగృహ విద్యార్ధులంతా, చిట్టిగారె ప్రమాణపు అట్లు తలో ఇరవై హాయిగాతిని త్రేన్చారు. మావాడు వాళ్ళచేత " బామ్మగారికీ జై, లక్షట్లనోముకూజై " అని నినాదాలుకూడా చేయించాడు. అంతా వరసగా వచ్చి బామ్మకు నమస్కరించారు. 'లక్షాట్లనో' మేమోగానీ పాపం ఆవసతిగృహ విద్యార్ధులకు ఒక్క వారం రోజులైనా కమ్మని ఆహారం అందించి నందుకు నేను మాబామ్మను మెచ్చుకోకుండా ఉండలేక పోయాను. ఇదండీ మామా నోముల బామ్మ ,లక్షట్ల నోము.'




ఆరోజు ఆదివారం. ఉదయం తొమ్మిదవుతోంది. అప్పుడే తలస్నానం చేసి బాత్రూం లో నుండి బయటికొచ్చిన చైతన్య టవలు తీసుకుని ఈలవేస్తూ బాల్కనీలోకి నడిచాడు.

ముందుగదిలో కూర్చుని బట్టల మిషను మీద కూర్చుని పనిచేసుకుంటున్న కృష్ణమూర్తి " ఏమిటో ఇవాళ సారు పొద్దున్నే లేచి రెడీ అవుతున్నారు ! " అన్నాడు కొడుక్కేసి చూస్తూ వ్యంగ్యంగా..

" మళ్ళీ తెల్లారిందా వాణ్ణి ఏదో ఒకటి అనడానికి ? " అంది వంటింట్లో నుండి సరస్వతి.

" నేనేమన్నా సపోర్ట్ చేయడానికి తమరున్నారుగా..."

భర్త మాటలకి ఏమీ అనలేక తనపనిలో తాను నిమగ్న మైపోయింది సరస్వతి.

ఇదేమీ పట్టించుకోకుండా చైతన్య బెడ్రూం లోకెళ్ళి జీన్స్ ప్యాంటూ, టీ షర్టూ వేసుకుని తల దువ్వుకున్నాడు. చేతికి వాచీ పెట్టుకుని గాగుల్స్ తీసుకుని బయటికొచ్చాడు.

" డాడీ ఓ ఫైవ్ హండ్రెడ్ రుపీస్ ఇవ్వు " అని అడిగాడు తండ్రిని.

" ఎందుకూ ? " మొహం చిట్లించాడు కృష్ణమూర్తి.

" ఖర్చు చేయడానికి "

" నీ పంచ్ డైలాగులు విని ఎంజాయ్ చేయడానికి ఓపిక లేదు నాకు "

" కాకపోతే ఏంటి డాడీ? ఇవాళ సండే కదా, అలా సరదాగా బయటికెళ్ళొస్తాను, పెట్రోలుకీ, సినిమాకీ కావాలి. " చిరాగ్గా మొహం చిట్లించి అన్నాడు చైతన్య.

" సోమవారం నుండి శనివారం వరకు ఉద్యోగాలు చేసేవాళ్ళకు ఆదివారం కావాలి తమరికి ప్రతిరోజూ ఆదివారమేగా? "

" ఏమిటండీ? కొడుకుతోఅ మాట్లాడే తీరేనా అది..? ముందు గదిలోకి వస్తూ అంది సరస్వతి.

" వాడు కొడుకులా ప్రవర్తిస్తున్నాడా ? ముప్పై ఏళ్ళొచ్చాయి. నాలుగు రోజులు ఇదనీ, నాలుగు రోజులు అదనీ ఏదీ పూర్తిగా చదవక కాలేజికి తిలోదకాలిచ్చాడు. గవర్నరు గిరీ తప్ప ఉద్యోగం చేయనని గాలికి తిరుగుతున్నాడు...." అని ఇంకా ఏదో కోపంగా అనబోతున్న కృష్ణమూర్తి మాటలకు అడ్డొచ్చాడి చైతన్య.

" అర్థం లేకుండా మాట్లాడకు డాడీ ! నచ్చిన చదువు, నచ్చిన ఉద్యోగం కాకుండా కాంప్రమైజ్ అవలేను లేదంటే అత్తెసరు జీతంతో అద్దెగదుల జీవితాన్ని గడపాలి...."

" అవున్రా, ఆ అత్తెసరు జీతంతోనే రోజూ ఐదువేళ్ళూ నీ నోట్లోకెళుతున్నాయి....ఈ అద్దె గదిలోనే తలదాచుకుంటున్నావు...."

" అంటే ఏంటి నీ ఉద్దేశం? నేనిలాగే ఉంటాననా? అయినా నా వయసెంతని....నాకు నచ్చిన ఉద్యోగం, లంకంత ఇల్లు సంపాదించి చూపిస్తాను..."

" ఎప్పుడు? నేను చచ్చాకనా? " కోపంగా అరిచాడు కృష్ణమూర్తి.

" హబ్బబ్బ...ఏమిటండీ ఆ మాటలూ? " చూస్తూ ఊరుకోలేక అంది సరస్వతి.

" కాకపోతే ఏమిటే? యాభైతొమ్మిదేళ్ళు వచ్చినా నా కష్టం నాకు తప్పడం లేదు. అప్పటికీ జీతం రాళ్ళు చాలక కళ్ళు సరిగా కనబడకపోయినా, ఇంట్లో ఉన్నంతసేపూ బట్టలు కుడుతూ కాలం వెళ్ళదీస్తున్నాను...."

ఏడుపు గొంతుతో అన్నాడు కృష్ణమూర్తి.

" నీ సెంటిమెంట్ సబ్జెక్ట్ వినడానికి నేనేమీ ప్రొడ్యూసర్ ని కాదు డాడీ. నేనడిగిన అమౌంట్ ఇస్తావా, ఇవ్వవా, చెప్పు..." లేచి నిలబడి ఖచ్చితంగా అన్నాడు చైతన్య.

కృష్ణమూర్తి విసురుగా లేచెళ్ళి తన షర్టు జేబులో నుండి రెండొందలు తీసుకొచ్చి టేబుల్ మీద పెడుతూ " నా దగ్గర ఇంతే ఉన్నాయి. నీ ఇష్టమొచ్చినట్టు తగలడు ! " అన్నాడు.

చైతన్య ఆ డబ్బులు తీసుకుని బయటికొచ్చి బైక్ స్టార్ట్ చేసాడు...

చైతన్య కృష్ణమూర్తికి ఒక్కగానొక్క కొడుకు. అతడితర్వాత ఒక అమ్మాయి. చిన్నతనంలో పరిస్థితులు అనుకూలించక, పెద్దగా చదువుకోని కృష్ణమూర్తికి చైతన్య తనలాగా జీవితాన్ని వెళ్ళదీసే స్థాయిలో కాకుండా పెద్ద చదువులు చదువుకుని మంచి ఉద్యోగం చేస్తాడనీ, తననేదో ఉద్ధరిస్తాడనీ అందరు తండ్రులలాగే కలలు కన్నాడు. ఉన్నంతలో కృష్ణమూర్తి కూతురి పెళ్ళి బాగానే చేసాడు. కానీ ఆ అప్పూ, కొడుకు చదువులకని చేసిన అప్పులు, వాటి వడ్డీలూ వెంటాడుతూ అతనికి విశ్రాంతినివ్వడం లేదు... ఏనాటికైనా కొడుకు చేతికంది వచ్చి తనను ఆదుకోకపోతాడాని వేయికళ్ళతో ఎదురు చూస్తున్న కృష్ణమూర్తికి నిరాశే మిగులుతోంది...చదువుల విషయం లో పెద్దగా నాలెడ్జ్ లేని కృష్ణమూర్తి, చైతన్య చదువేమిటో, అదేనాటికి పూర్తవుతుందో అర్థం కాక సతమతమవుతున్నాడు. అది అలుసుగా తీసుకుని, స్థిర చిత్తం లేని చైతన్య ఆ కోర్సులనీ, ఈ కోర్సులనీ ఏదీ పూర్తిచేయక, దేనిమీదా కాన్సంట్రేట్ చేయక కాలం వెళ్ళదీస్తున్నాడు...

బైక్ మీద చాలా దూరం వెళ్ళిన చైతన్య ఒకచోట మలుపు తిరగగానే సడెన్ గా బైక్ ఇంజన్ ఆఫ్ కావడంతో దిగి పక్కన స్టాండ్ వేశాడు. పక్కనే ఉన్న మెకానిక్ కుర్రాణ్ణి బైక్ చూడమని, కూల్ డ్రింక్ తాగడానికేమైనా బేకరీ కనిపిస్తుందేమోనని చుట్టూ చూసాడు. బేకరీ కనిపించలేదు కానె, ఓ చిన్న చెప్పుల దుకాణం లో ఓ అమ్మాయి చెప్పులుకుడుతూ కనిపించి చైతన్య దృష్టిని ఆకర్షించింది. అనాలోచితంగానే తేరిపారా చూశాడు... ఆ అమ్మాయినెక్కడో చూసినట్టనిపించింది. ...

ఎవరై వుంటారబ్బా... రెండు క్షణాలు ఆలోచించాక గుర్తొచ్చింది. తన క్లాస్మేట్ అభిరాం చెల్లెలు నిహారిక... వాళ్ళ నాన్నకు చెప్పుల దుకాణం వుందని తెలుసుగానీ, షాపులో ఈ అమ్మాయి వుండేంటీ?..

బైకు ఏమైందో చూడమని పురమాయించి షాపులోకి నడిచాడు చైతన్య.

అతడిని చూస్తూనే లేచి నిలబడి "రండి సార్! ఏం కావాలి? చెప్పులా, షూనా? కూర్చోండి!" అంది చిరునవ్వుతో నిహారిక.

"నీ పేరు నిహారిక కదూ!" నిలబడే అడిగాడు చైతన్య.

"అవును. మీరు...!?

"మీ అన్నయ్య అభిరాం క్లాస్మేట్ చైతయని. గుర్తొచ్చానా?!"

నీహారిక ఒక్క క్షణం ఆలోచించి గుర్తుపట్టి "ఓహ్... అన్నయ్యా...నువ్వా! బావున్నావా? కూర్చో.... ఆంటీ, అంకుల్ బావునారా? ఒరే చింటూ కాసిని మంచి నీళ్ళు పట్రా!" అంటూ హడావిడి చేసింది.

చతన్య అక్కడే వున్న స్టూల్ లాక్కుని కూర్చుంటూ" అందరూ బావున్నారమ్మా! నువ్వేంటే, షాపులో పని చేస్తున్నావ్? డాడీ, అభి ఎలా వున్నారు?" అని అడిగాడు.

నీహారిక కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి.

"చదువుకుంటున్నప్పటి నుంచే అన్నయ్య నాన్నకి చేదోడు వదోడుగా వుండేవాడు నీకు తెలుసు కదా! చదువయ్యాక పూర్తిగా షాపు చూసుకుంటూటే నాన్న సంతోషించాడు. కానీ, ఓ రోజు ఇంటికొస్తూ యాక్సిడెంట్ లో పోయాడు. దీన్ని తట్టుకోలేక నాన్నకి పక్షవాతం వచ్చింది. అమ్మ మా చిన్నప్పుడే పోయింది. ఒంటరి పక్షిలా మిగిలిన నాన్నని చూసుకోవడం నా బాధ్యత కదన్నయ్యా.."

షాపులో పైన పూలదండతో వున్న అభి ఫోటో పై అప్పుడు చైతన్య దృష్టి పడింది.మనసు చివుక్కుమంది. అభి తనతో ఎంతో క్లోజ్ గా వుండే వాడు.

"మరి, నువు ఇంకా పెళ్ళి.."

అయిందన్నయ్యా! మా వారు ప్రైవేటు ఉద్Yఓగం చేస్తూనే ఇక్కడ నాకు మెటీరియల్ తీసుకురావడంలాంటి సాయం చేస్తుంటారు. ఇంట్లో పిల్లలిద్దరిని, చంటి పిల్లాడిలాంటి నాన్నని చూసుకుంటూ ఇదిగో... ఈ షాపుని నడుపుతున్నాను. .. డిగ్నిటీ ఆఫ్ లేబర్ కదన్నయ్యా... పనిని మనం గౌరవిస్తే అది మనల్ని సమాజం లో అందరూ గౌరవించేలా నిలబెడుతుంది...

ఇంతలో కుర్రాడు మంచి నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చాడు.

"ఆంటీ, అంకుల్ బావున్నారా అన్నయ్యా? నీకు పెళ్ళైందా, పిల్లలు ఎంతమంది? ఎం చేస్తున్నావ్?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది నిహారిక...

"అ.. అదీ.. యాక్చువల్ చి.ఎ చేద్దామనుకున్నాను. బట్ దానికి మార్కెట్ లేదు. ఒక్క టూ ఇయర్స్ లో ఏదైనా కోర్స్ చేసి మంచి జాబ్ చేద్దామనుకుంటున్నా అని తడబడుతూ చెప్పాడు చైతన్య.

"అవునా? నువ్వీపాటికి లైఫ్ లో సెటిలైపోయుంటావనుకున్నా అన్నయ్యా! పాపం అంకుల్ మాత్రం ఎంత కాలం కష్టపడతారు.... నువు ఏదో ఒక ఉద్యోగం చేసి సంపాదిస్తూంటే ఆయన ఇప్పటికైనా విశ్రాంతి తీసుకుంటారు. పైగా, కోడలు రావాలని ఆంటీకి కూడా వుంటుంది కదా! కాలం ఎంతో విలువైంది. గడిచిపోయిన కాలం తిరిగిరాదు...

ఫోన్ మోగినట్టుగా నటించి తీసి మాట్లాడ్డం ప్రారంభించాడు చైతన్య.

"చెప్పరా! అక్కడే వున్నావా? బైక్ ప్రాబ్లం వల్ల లేటయింది. వచ్చేస్తున్నా! ఓ.కే... నేనొస్తానమ్మా! మళ్ళీ కలుస్తా!" అంటూ బయటికొచ్చాడు.

ఇంట్లో డాడీ నస భరించలేక బయటికొస్తే, తన పనేదో తను చేసుకోక శ్రీరంగ నీతులు చెప్తోంది."... అనుకున్నాడు చైతన్య.

నిహారిక మాటలేవీ చైతన్య తలకెక్కలేదు. అదే జరిగితే ఎంతో మంది తల్లిదండ్రులకు ఈ బాధ తప్పేది.

తమ బాధలను కష్టాలను పట్టించుకోని ఇలాంటి బిడ్డలున్న తల్లిదండ్రుల ఆశలెప్పటికీ ఎండమావులే....




ఆదివారం ఉదయం ఏడు గంటలు.

బద్ధకంగా నిద్రలేచాను. ఆర్రోజులూ కాలపు ముల్లుకి బంధించబడి ఒక యంత్రంలా గడిపే నాకు నిజంగా ఆదివారం ఆటవిడుపే! దాన్ని ఏ ఫంక్షన్లకో వెళ్లడం..ఎవరెవరిళ్ళకో వెళ్ళి..లేదా వాళ్ళని ఇంటికి పిలిచి వ్యర్థపరచుకోవడం ఇష్టముండదు. దాన్ని నాకిష్టమైన సాహిత్యం చదవడంలోనూ..కథలు రాయడంలోనూ..మంచి మంచి సినిమాలు చూడడంలోనూ గడపాలనిపిస్తుంది. అలా ఆదివారాన్ని నా కోసమే.. కేవలం నా కోసమే ఉపయోగించుకోవాలనిపిస్తుంది. ప్రతి క్షణం పొదుపుగా వాడుకోవాలనిపిస్తుంది. పైగా మాపిల్లలకి వేసవి సెలవులు ఇవ్వడంతో శ్రీమతి పుట్టింటికి వెళ్ళింది. ఫుల్ ఎంజాయ్ చేద్దామనుకున్నాను కాని ఈ ఆదివారంలో కొంతసమయం త్యాగం చెయ్యల్సొస్తోంది. అందుకే చిరాగ్గా వుంది. నిజానికి ఆదివారం నేను తొమ్మిదీ పదింటికి కాని లేవను. కాని ఇవాళ ఆఫీసున్నట్టే ఏడింటికి లేవాల్సొచ్చింది. ఛ..కొంతప్పుడు ఇష్టం లేకపోయినా ఫార్మాలిటీస్ కి కొంత సమయం కేటాయించాల్సొస్తుంది. తప్పదు.

మా ఆఫీసులో పనిచేసే వేణుకి నెల క్రితం యాక్సిడెంట్ అయి హాస్పిటల్లో వున్నాడు. అసలు ఆ యాక్సిడెంట్ తీవ్రతకి వాడు బ్రతక డనుకున్నారు. కాని గట్టిపిండం మేజర్ సర్జరీ జరిగాక కోలుకుంటున్నాడు. వేణు వయస్సు యాభై..యాభై అయిదు మధ్య వుంటుంది. అందరితో నమ్రతగా వుంటాడు. తన పనేదో తనేంటో. ఆఫీసులో అందరూ మిస్టర్ కూల్ అని పిలుస్తుంటారు. ఆఫీసులోని దాదాపు అందరూ చూసొచ్చారు. ఒక్క నేను తప్ప. ఆర్రోజులూ ఆఫీసు పనితో చాలా చాలా బిజీగా వుంటాను. ఆదివారం వెళదామనుకున్నా..బద్ధకంతో మరో ఆదివారానికి పోస్ట్ పోన్ చేసి నాకోసం నేనుగా జీవిస్తాను. ఈవారం తప్పనిసరిగా వెళ్ళి రావాలి. ఎందుకంటే చుట్టుపక్కలవున్న ఆఫీసుల వాళ్లు కూడా చూసొచ్చార్ట..ఒక్క నేను తప్ప. ఆఫీసులో అందరూ వెటకారం చేస్తున్నారు. నిజానికి నాకు హాస్పిటల్ వాతావరణమంటే తెగ చిరాకు. మా వాళ్ళెవరన్నా వుంటేనే ముళ్ళమీద కూర్చున్నట్టు పదినిముషాలుండి వచ్చేస్తాను. కాని తప్పదు కదా ఒక్క పదినిముషాలు ఎలాగోలా గడిపి వచ్చేయడమే!

అరగంటలో తయారై బైక్ మీద గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్లాను. కాంపౌండ్ లోపలికడుగెట్టగానే యుద్ధభూమిలోకి ప్రవేశం చేసినట్టని పించింది. పేషెంట్లు క్షతగాత్రుల్లా కాళ్లకి.. చేతులకి..కట్లతో..మూలుగులతో.. నిర్సంగా అడుగులేస్తున్నారు. వాళ్ళతో పెద్ద యాతనగా వుందని ముఖంలో విసుగుని కనిపింపచేస్తూ 'కావలసిన' వాళ్ళు. లోపలికెళితే ఫినాయిల్ వాసనతో కూడిన ఒక రకమైన ముక్క వాసన. డాక్టర్ల నుండి కిందిస్థాయి దాకా మాటల్లో చేతల్లో చూపించే నిర్లక్ష్యం. మానవాధముల మధ్య మహోన్నతములమన్న ఫీలింగ్.

నేను ముక్కుకి కర్చీఫ్ అడ్డం పెట్టుకుని కావాలసిన వార్డ్ దాకా వచ్చి లోపలికెళ్ళాను.

ఒక్కో మంచంమీద వున్న పేషెంట్ ని చూస్తూ నడుస్తున్నాను. ఆ వార్డ్ యమలోకంలా, ఒక్కో బెడ్ మీద పేషెంట్ ఒక్కోశిక్ష అనుభవిస్తున్నట్టు అనిపిస్తోంది. వేణు బెడ్ దగ్గరకి వచ్చాను. తలకి పెద్ద కట్టు వుంది. అతని దగ్గర ఎవరూ లేరు. బెడ్ పక్కగా వున్న మెటల్ స్టూల్ ని కొద్దిగా జరుపుకుని కూర్చున్నాను.

ఆ శబ్దానికి వేణు లేచి నన్ను చూసి పేలవంగా నవ్వాడు. నాకెందుకో అతడిని చూస్తే జాలేసింది.

"ఎలావుంది?"అడిగాను.

"ఫర్వాలేదు" అని లేవబోయాడు.

"వొద్దొద్దు..రెస్ట్ తీసుకో"

"నీ దగ్గర ఎవరూ లేరేంటి? ఏవన్నా అవసరం వస్తే?"మాటల్లో కొద్దిగా చిరాకుని కనబరుస్తూ మందలిస్తున్నట్టుగా అన్నాను.

"మా ఆవిడ పదేళ్ళ క్రితమే కాలం చేసింది. ఇద్దరు కొడుకులు. వాళ్ళవి రెక్కాడితే కాని డొక్కాడని బ్రతుకులు. నాకోసం ఎంతకాలం పక్కన ఉత్తగా కూర్చుంటారు?"అన్నాడు.

తెచ్చిన రెండాపిల్ పళ్ళు అతని చేతిలో పెట్టి లేచాను ఇహ వెళతానన్నట్టుగా.

వెంటనే నా చెయ్యి పట్టుకుని "కొద్ది సేపుండచ్చు కదా..ఇవాళ ఆదివారమే! ఎప్పుడు పనితో బిజీగా వుండే నేను ఇలా మంచానికి అంటిపెట్టుకుని వుండడం నరకప్రాయంగా వుంది. ఏమీ తోచక పిచ్చిగా వుంటోంది. పలకరించే నాధుడు లేడు.

చుట్టాలు..తెలిసున్న వాళ్ళు..ఆఫీసు స్టాఫ్..మర్యాద కోసం పరామర్శించి వెళ్ళిపోతారు తప్ప 'సాటి మనిషి మంచాన పడి వున్నాడే' అన్న భావం వాళ్ల కళ్లలో వెదకి చూసినా కన్పించదు. నిజం చెప్పు నాకు కావలసింది రెండు పళ్ళు..'తగ్గిపోతుందిలే' అనే ఓదార్పు మాటలూనా?"

"ఇద్దరు కొడుకులంటున్నావు..వంతుల వారీగా ఒక్కొక్కరూ వుండొచ్చుగా..వాళ్ళ తండ్రివే కదా!"

"ఈ హాస్పిటల్లో చేరేదే నాలాంటి వాళ్ళు. డబ్బుతో అద్భుతమైన ట్రీట్ మెంట్ ఇప్పించుకోలేని దౌర్భాగ్యులం. అడ్మిట్ అవడం తప్ప ఎప్పుడు డిస్చార్జ్ అవుతామో తెలిదు. అడుగడుగునా ఛీత్కారాలు. అవమనాలు. ఈ వార్డ్ లో ఏ మంచం దగ్గరన్నా పేషంట్ తప్ప మరొకర్ని చూశావా? ఒకవేళ వున్నా 'ఈ తద్దినం ఇంకెన్నాళ్ళో' అన్నట్టు వుంటారు తప్ప ప్రేమాభిమానాలతో కాదు. మా వాళ్ళ దృష్టిలో నేనే కావాలని యాక్సిడెంట్ చేయించుకున్నాను. 'పెద్దవాడివయ్యావు..చూసుకుని వెళ్ళక్కర్లేదూ' అంటాడు పెద్దాడు. 'నాన్నకి రిటైర్మెంట్ కి ముందే రెస్ట్ తీసుకోలన్పించిందేమో అందుకే రిస్క్ చేశాడు'అంటాడు చిన్నాడు ఎకసక్కెంగా.

పలకరిద్దామని వచ్చేవాళ్ళు పేషెంట్లని 'నువ్వు మాలోంచి వెలివేయబడ్డావు' అన్నట్టు కాకుండా 'నువ్వు కోలుకుని మాలో ఎప్పుడు

కలుస్తావు?' అన్న ఆదరణ చూపించాలి.

ఈ హాస్పిటల్ కాంపౌండ్ కి అవతల ఎంతో మంది ఎవరిపనుల్లో వాళ్ళు ఎంతో బిజీగా వుంటారు. కనీసం ఈ హాస్పిటల్ ముందు నుండి వెళుతున్నప్పుడైనా 'లోపల ఎంతమంది ఆఖరి శ్వాస తీసుకుంటున్నారు?..మృత్యువుతో పోరాడుతున్నారు? అని ఆలోచిస్తారా? లేదు ఎవరి సుఖం వాళ్లది. సాటి మనిషి ఏమైపోతే వాళ్ళకేం."

కాస్త ఊపిరి తీసుకోడానికి ఆగి కాసిన్ని మంచినీళ్ళు తాగి..మళ్లీ ప్రారంభించాడు."ఆ పక్క బెడ్డు పెద్దాయన్ని చూడు ఆయనకి హార్టేటాక్ వచ్చింది. చాలా సీరియస్ ట. డాక్టర్లు ఏ విషయం చెప్పలేమంటున్నారు. వాళ్లవాళ్ళ దృష్టిలో ఆయన చచ్చిపోయినట్టే! ఎప్పుడోసారి వస్తున్నారు.. ఉన్నాడో! పోయాడో చూడ్డానికి. ఆయన మంచివాడో..చెడ్డవాడో తెలియదు. తన వాళ్లకోసం ఎంతో కొంత శ్రమించే వుంటాడు! మన మనుష్యలోకంలోకొచ్చాడు. మనకీ కాస్త కనికరం వుండాలి కదా!    ఇవన్నీ నీకెందుకు చెబుతున్నానంటే..నువ్వు కథలు చదువుతావని..రాస్తావని నాకు తెలుసు..మీ మనసులు కాస్త మార్ధవంగా వుంటాయి. ఓల్డ్ ఏజ్డ్ హోం జీవితాలే కాదు హాస్పిటల్లోని పేషెంట్ల జీవితాలూ హృదయ విదారకంగా వుంటాయి. పట్టించుకునే నాధుడు లేక. దయచేసి ఈ విషయం మీద కథ రాసి పేషేంట్లకీ కాస్త సాంత్వన చేకూరేలా చేయి..ప్లీజ్. మేమూ మనుషులమే మళ్ళీ కోలుకునొచ్చి మీలో కలుస్తాం."అని ముగించాడు.

కలం కాగితం మీద పెట్టడం తప్ప ఇప్పటిదాకా నేను చేసిందేంలేదు.    రోడ్డు మీద బిజీగా వెళుతున్నప్పుడు హారన్ తో ఆంబులెన్స్ వస్తుంటే వాహనాన్ని పక్కకి తీసుకోవడానికి విసుగు. మృత్యువుతో పోరాడుతున్న వ్యక్తికి సహకరిస్తే మృత్యువు ఓడిపోదూ! కానీ మనం అలా చేయం. మనిషి ఆలోచనలు ఉత్తమంగా..అమలు అధమంగా వుంటే సరిపోదు. అందరినీ కలుపుకుపోవాలి..అందరికోసం బ్రతకాలి. ఈ ఆదివారం నాకు ప్రత్యేకమైనది. దిశానిర్దేశం చేసింది.

మరుసటిరోజు ఆఫీసుకి గంట ముందు బయల్దేరాను. దారిలో పేపర్ ..టిఫిన్లు కొనుక్కుని హాస్పిటల్ లోకడుగుపెట్టాను. నిన్నటిలాగా చిరాగ్గా లేదు ఆ వాతావరణం. బయటవున్న పేషెంట్ల మొదలు డాక్టర్లు..సిస్టర్లు..ఉద్యోగులకి విష్ చేస్తూ వేణూ దగ్గరకి వెళ్ళాను. అతడి పక్కన స్టూల్ మీద కూర్చుని ఇడ్లీ పొట్లాం అతడికి..చుట్టుపక్కల బెడ్ల వాళ్లకిచ్చి తినమని..వాళ్ళు తింటుండగా పేపర్ చదివి వినిపించాను. నా ఫోన్ నంబరు అతడి కేస్ షీట్ మీద రాయించి ఏ అవసరమొచ్చినా నాకు ఫోన్ చేయమని చెప్పాను. ఆ కాస్తకే అక్కడున్న వాళ్ళకి ఆత్మీయుడన యిపోయాను. తిరిగి సాయత్రం ఆఫీసయ్యాక వస్తానని చెప్పి బయల్దేరాను. ఎందుకో చాలా రిలీఫ్ గా అనిపించింది. నేను నాకోసం బ్రతికినప్పుడు అలా అనిపించలేదు.

ఇప్పుడు ఆదివారం సెలవుదినాల్లో..షాపింగ్ మాల్స్..చార్మినార్..ఎన్ టి ఆర్ గార్డెన్స్..కే కాదు వివిధ హాస్పిటల్స్ కి..వృద్ధ శరణాలయాలకి వెళుతున్నాను. వాళ్ళలో ఆత్మ స్థయిర్యాన్ని నింపి బ్రతికి తీరాలన్న కాంక్షని పెంచుతున్నాను.




మాచవరం గ్రామంలో నివసించే లింగయ్యశెట్టిది చిల్లర కొట్టు కిరాణా వ్యాపారం.నిజాయితీపరుడైన వ్యాపారిగా ఊళ్ళో మంచిపేరుందతడికి. సొంత ఇంటిలోనే కొట్టు నడిపేవాడు కనుక అద్దె బాధ కూడా లేదతడికి. భుక్తికి లోటు లేకుండా అప్పుల్లేకుండా హాయిగా గడిచిపోతుండేదతడి జీవితం. ఉన్న ఇద్దరు కొడుకులనూ పటన్మ్ లోని మంచి విద్యాలయంలో చదివిస్తున్నాడు.

అయినా అతడినేదో బాధ పట్టి పీడిస్తుండేది. పెద్ద పెద్ద మేడలూ మిద్దెలూ సంపాదించలేకపోతున్నాననీ, ఊళ్ళో ఉన్న కోటీశ్వరులమధ్య తానూ ఒకడిగా వెలిగి పోలేక పోతున్నాననీ ఆత్మ న్యూనతా భావం అతణ్ణి పట్టి పీడిస్తూండేది.

అతడి భార్య రంగమ్మ మాత్రం మనకున్నదాంట్లో మనశ్శాంతిగానే ఉన్నాం కదాని అతడితో అంటూండేది. సొంతిల్లు, వ్యాపారం,

చక్కగా చదువుకుంటున్న పిల్లలు అన్నీ సవ్యంగానే ఉన్నాయి, సంతోషంగానే గడిచిపోతోంది కదాని అంటూండేది.

ఇదిలా ఉండగా ఒకసారి దేశసంచారం చేస్తూన్న ముని ఒకాయన మాచవరం గ్రామ సరిహద్దుల్లోని నదీ తీరానికి వచ్చి ఉన్నాడని తెలిసుకొని ఊళ్ళోని జనమంతా తండోపతండాలుగా వెళ్ళి ఆయన దర్శనం చేసుకుని తమ కష్టాలు చెప్పుకోసాగారు.

ఇది తెలిసి లింగయ్యశెట్టి కూడా భార్యను తీసుకుని ఆ మునిని చూడబోయాడు.

" స్వామీ ! ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది జీవితం.బోలెడంత డబ్బూ, ఇంకా మంచి జీవితం, ఊళ్ళోని కోటీశ్వరుల మధ్య ఒకడిగా గుర్తింపూ నాకెందుకు సాధ్యం కావడం లేదు? " అని తన బాధను వ్యక్తం చేసాడు.

ముని కాసేపు కళ్ళు మూసుకుని ఆలోచించి, " నాయనా అక్కడున్న కడవతో ఎదురుగా పారుతున్న నదిలోంచి నీళ్ళు ముంచి తీసుకురా.." అని చెప్పాడు.అలాగేనని ముని చెప్పినట్టే చేశాడు లింగయ్యశెట్టి. ముని నది వేపు చూస్తూ, అదేమిటి నాయనా? నువ్వు ముంచుకొచ్చినా ఇంకా నదిలో నీళ్ళు పారుతూనే ఉన్నాయే? అనడిగాడు.

దానికి లింగయ్య ఆశ్చర్యంగా, " అదేమిటి స్వామీ, కడివెడు నీళ్ళు ముంచుకొచ్చినంత మాత్రాన, నదిలో నీళ్ళింకిపోతాయా? " అనడి గాడు.

ముని నవ్వి, " అదే నాయనా నేను నీకు చెప్పబోతున్నది. మనజీవితంలోని కోరికల్ పారే నది లాంటివి. అవి మారుతుంటాయే తప్ప తీరవు...ఒక కడివెడు కాదు కదా వంద..వేయి కడవలు ముంచుకొచ్చినా అంతే..ఇక ప్రాప్తం అనేదొకటుంటుంది. అది అచ్చు మన కడవ లాంటిదే... నదికెళ్ళినా, సముద్రానికెళ్ళినా మన ప్రాప్తమెంత ఉందో అన్నే మనకు చెందుతాయి... " అంటూ వివరించాడు..

లింగయ్యశెట్టి మునికి నమస్కరించి తేలికపడిన మనసుతో ఇంటికి బయల్దేరాడు.




వినాయకుడికి నిద్రపట్టక అటు ఇటు పొర్లుతున్నాడు.

"ఏమిటి నాయనా..నిద్రపట్టట్లేదా? వినాయక చవితి రాబోతోంది..పండగొచ్చిందటే నీకు అసలు విశ్రాంతి వుండదు. నిద్రపో నాయనా "

"లేదమ్మా..ఒక భక్తుడు అహర్నిశలూ..నన్ను స్తుతిస్తూ..ఒక విచిత్రమైన కోరిక కోరుతున్నాడు. అతని భక్తితో నన్ను తన వశం చేసుకుంటున్నాడు."

"కోరికా?..ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగింది.

"నేను చెప్పడమెందుకమ్మా? నువ్వే చూడు!" అని పైలోకం నుండి భూలోకం వైపు చూపుడు వేలు చూపించాడు.

"స్వామీ! నేను పుట్టి ఊహతెలిసినప్పటినుండి నిన్ను పూజించడం తప్ప మరో దేవుడి గుడికి వెళ్ళడం కాని..పూజలు..వ్రతాలు చేయడంగాని చేయలేదు. నువ్వంటే అమితమైన భక్తి..ఇష్టం. కానీ గుజ్జు రూపంతో..పెద్ద పొట్టతో..ఇంతింత చెవులతో..దంతాలతో..మరీ ముఖ్యంగా తొండంతో ఎంత అంద వికారంగా వుంటావు? మీ అమ్మా..నాన్నా..అన్నయ్యలతో సహా మిగతా దేవుళ్ళంతా నల్లగా..ఎర్రగా ఎలా వున్నా ఎంత అందంగా వుంటారు?..ఈ విషయంలో నీ భక్తుడిగా నేను ఎంత ఆవేదన చెందుతున్నానో తెలుసా? విఘ్ననాయకుడిగా మళ్ళీ అందరి కష్టాలూ నువ్వే గట్టెంక్కించాలి. అందుకే..అందుకే నేను అకుంఠిత దీక్షతో ప్లాస్టిక్ సర్జరీ కోర్స్ చేసి అందులో నేను నిష్ణాతుడినయ్యాను. ప్రపంచం గర్వించే అతికొద్దిమంది ప్లాస్టిక్ సర్జరీ చేసే డాక్టర్లలో నేనూ ఒకడిని..ఎంత పేరు తెచ్చుకున్నా..ఎంత పైకొచ్చినా మిమ్మల్ని చూసినప్పుడల్లా ఒకటే బాధ..నేను సదా కొలిచే నీకు ఏమీ చేయలేకపోయానని. అందుకే నాది ఒకే ఒక్క చిన్న విన్నపం. నీకు నేను ప్లాస్టిక్ సర్జరీ చేసి నీ తొండం తొలగించాలి..నీకు నా ప్రాణ స్నేహితుడైన డాక్టర్తో ఒబెసిటి ట్రీట్ మెంట్ ఇప్పించి నాజూగ్గా అందగాడిలా చేయాలి..మిగతా దేవుళ్ళంతా కుళ్ళుకోవాలి..దయచేసి నన్ను అనుగ్రహించు స్వామీ!" కళ్లనీళ్ళతో వినాయకుడి మందిరం ముందు కూర్చుని దీనాలాపన చేస్తున్నాడు డా||ఏకతొండం.

"అయ్యయ్యో..గణేశా..ఏమిటయ్యా నీ భక్తుడి ఆగడం..ప్లాస్టిక్ సర్జరీ చేస్తాడా నీకు?..నేనొప్పుకోను..ఆ శస్త్రచికిత్స ఫలవంతం కాకపోతే ఇంకేమన్నా వుందా? అందుచేత ఈ భక్తుడు నీకు తగడు..నువ్వు అతని మాట వినకు.."అంది కోపంగా..

"అలాగంటే ఎలాగమ్మా?..నేను భక్తసులభుడిని అదీ నాన్న గారి జన్యువుల నుండీ సంప్రాప్తించింది. భక్తులని నిరాశకి గురిచెయ్యలేను..అతని కోరిక ఇప్పటిది కాదు..కానీ ఇప్పుడు మరీ తీవ్రతరం చేశాడు..అది నన్ను తెగ ఇబ్బంది పెడుతోంది అందుకే నిద్రపట్టట్లేదు.."అన్నాడు.

"అయ్యో..నీకెలా చెప్పనయ్యా..నువ్వంటే నాకు పంచప్రాణాలు. నీకేమన్నా అయితే ఈ తల్లి ప్రాణం తల్లడిల్లిపోతుంది. అప్పుడొకసారి నీ చిన్నప్పుడు మీ నాన్న నీ తల నరికేస్తే, నేను ఏడ్చి పెడబొబ్బలు పెడితే ఏనుగు తలకాయ పెట్టి నిన్ను బ్రతికించి ఇచ్చాడు. అప్పుడొకసారి వినాయక చవితిరోజున చంద్రుడి దృష్టి సోకి నీ పొట్ట పగిలింది. అప్పుడూ నేనే మీ నాన్నని బ్రతిమాలి నిన్ను బ్రతికించుకున్నాను. ఆ చంద్రున్ని శపించాను. మీ నాన్న మహానుభావుడు అందరికీ భోళాశంకరుడే కానీ ఆయన మనకేం చెయ్యడు. అందుచేత నేను ఆ విపరీతానికి ఒప్పుకోనుగాక ఒప్పుకోను..ఆ!"అంది ఖరాఖండిగా.

భూలోకంలో..డా||ఏకతొండం ఇంట్లో-

"స్వామీ! ఈ భక్తపిపీలికాన్ని నువ్వు పట్టించుకోవట్లేదు. నువ్వే నా మొర ఆలకించనప్పుడు ఇహ నేను బ్రతికేం

ప్రయోజనం?..అందుకే అన్నం నీళ్ళు ముట్టక నువ్వు నా కోరిక తీర్చే వరకు ఇలాగే ఈ పూజా మందిరం వద్దనుండి కదలను.."అని కూర్చుండిపోయాడు.

"చూశావా అమ్మా..ఆ అలవిమాలిన భక్తి. భక్తులకే తలమాణికం ఇలాంటివాళ్ళు. తిండీ తిప్పలు మానేశాడు.. ఆసుపత్రికి వెళ్ళట్లేదు..అతని భక్తి ముందు నేను దాసోహం అనాల్సిందే!"

"ఈ భక్తులెక్కడ దొరికార్రా నాయనా నీకూ మీ నాన్నకి..ఆయన రాక్షసులకి వరాలిచ్చి ఇరుక్కుపోతే..నేను ఆ శ్రీహరిని శరణు కోరేదాన్ని..ఇప్పుడు నీ విషయంలో నేను ఎవరిని అడగాల్రో దేవుడో!"శోకాలు పెట్టింది గిరిపుత్రి.

"అవును విఘ్నేశా! అమ్మ భయంలో అర్ధం వుంది. రేపు ఆ మానవమాత్రుడి చేతిలో నీకేవన్నా జరగకూడనిది జరిగితే మీ అమ్మ నా మనశ్శాంతిని కరువుచేస్తుంది. నేను సృష్టి కార్యకలాపాలు వదిలి మన కుటుంబ సమస్యలో తలమునకలవ్వాలి. అందుచేత ఆ విపరీతాలన్నీ జరగకూడదనుకుంటే..నువ్వు అమ్మ మాట వినడమే శ్రేయస్కరం!"అనునయంగా చెప్పాడు శివుడు.

"నా తల్లిదండ్రులుగా మీ బాధని..భయాన్ని అర్ధం చేసుకున్నాను. కానీ భగవంతుడికి భక్తుడేగా ప్రధానం! మనకి ఉనికినిచ్చేదే అతను..అలాంటప్పుడు వాళ్ళని అనుగ్రహించడంలోనే ఆనందం వుంటుంది. పైగా అతను తన స్వార్ధం కోసం వరమడగలేదు. ఈ వికృతుణ్ణి జగదేకమోహనుణ్ణి చేస్తానంటున్నాడు. నేను వెళ్ళాల్సిందే! నన్ను ఆశీర్వదించండి!"అని కొద్దిగా భారంగా వంగి వాళ్ళ కాళ్ళకి తన చేతుల్ని ఆనించే ప్రయత్నం చేశాడు.

ఆ ఆది దంపతులు చేసేదేంలేక దిగులుగా ఆశీర్వదించారు.

వినాయకుడు భూలోకంలోని డా||ఏకలొండం ఇంటికి బయల్దేరాడు.

"నాయనా ఏకలొండం"

వినాయకుడి విగ్రహంలోంచి మాటలు వినిపించే సరికి నీరసంగా కళ్ళు తెరిచాడు డా||ఏకలొండం.

మొదలు అది భ్రమేమో అనుకున్నాడు. కానీ విగ్రహం కళ్ళు కదలడంతో కన్ఫర్మ్ చేసుకుని ఒక్క ఉదుటున లేచాడు. అతనిలో కొత్త శక్తి చోటు చేసుకుంది. చిన్నప్పట్నుంచి చదివింది ఇంగ్లీష్ మీడియం అయినా..పాత పౌరాణిక సినిమాల్లో దేవుడు కనిపిస్తే భక్తుడు ఆగకుండా పద్యాలు..స్తోత్రాలు అనర్గళంగా పాడినట్టు పాడేశాడు. అంత పాండిత్యం తనకెలా ఆసువుగా వచ్చిందో అర్థం కాలేదు.

"స్వామీ ఈ తమ భక్త పరమాణువుని అనుగ్రహించడానికి వేల యోజనాల దూరం నుండి వచ్చావా?" ఉద్వేగంగా అన్నాడు.

"తప్పదు కదా నాయనా..నీ భక్తితో నన్ను బంధించేశావు.. నన్ను శారీరకంగా అందంగా చేస్తానంటున్నావు.. నీ కోరిక తీర్చడానికే వచ్చాను. కానీ ఒక షరతు! త్వరలో వినాయక చవితి రాబోతోంది. అప్పటికి నన్ను పూర్తిగా ఆరోగ్యవంతుడ్ని చేయాలి. నేను భక్తుల పూజలు అందుకోవాలి కదా!"అన్నాడు.

"అలాగే స్వామీ! మీరు అనుగ్రహించారు అది చాలు. ఇప్పుడు వైద్యరంగం అనూహ్యమైన ప్రగతి సాధించింది. మందులు ఏ వ్యాధినైనా.. గాయాలనైనా త్వరితగతిన తగ్గించేస్తున్నాయి. మీకెందుకు నామీద భారం వేయండి. స్వామీ నాదో చిన్న కోరిక మీకు ఇలా ఆపరేషను చేస్తున్నానని పబ్లిసిటీ చేసుకుంటాను. అది మీ భక్తుడిగా నా వృద్ధికి సోపానమవుతుంది" అన్నాడు.

"తథాస్తు.."

వినాయకుడు భూలోకానికి ఆపరేషను కోసం వచ్చాడంటే ముందు ఎవరూ నమ్మలేదు. కానీ జీవం ఉట్టిపడే ఆ రూపం..ఆయన చూపించిన కొన్ని మహిమలూ చూసి జన సందోహం ఆయన నిజ వినాయకుడే అని నమ్మింది. అంతేకాదు ఆయన్ని తన భక్తితో లొంగదీసుకున్న డా||ఏకలొండంని ఆకాశానికెత్తింది.

హాస్పిటల్ ప్రాంగణమంతా మీడియాతో భక్తులతో కిట కిటలాడుతోంది. పైనుండి అమరులు..భూలోకవాసులు ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.ఆరోజు వినాయకుడు ఆపరేషన్ తర్వాత మొట్టమొదటిసారి బయటకి రాబోతున్నాడు. అందరిలో కుతూహలం.వినాయకుడు బయటకొచ్చాడు.

జీన్స్..టీ షర్ట్..లో గాగుల్స్ ధరించి మ్యాన్లీగా వున్నాడు. నిజంగా అద్భుతమే!కానీ ఎందుకనో ఎవ్వరూ ఆ రూపాన్ని యాక్సెప్ట్ చేయలేదు. యుగ యుగాల్నుండి 'వినాయకుడంటే ఇలా వుంటాడన్న' రూపానికి ప్రతిరూపాన్ని తమ మనసులో ప్రతిష్టించుకోలేకపోతున్నారు. ఆ అందాన్ని తట్టుకోలేకపోతున్నారు. అది జెలసీతో మాత్రం కాదు.

దేవుళ్ళూ..మనుషులు నిరాశగా వెనుదిరిగాక వినాయకుడు"చూశావా భక్తా! నన్ను ఈ రూపంలో ఎవ్వరూ ఒప్పుకోవడంలేదు. తానొకటి తలిస్తే మరొకటి జరిగిందనడానికి ఇదే ఉదాహరణ. ఏం చేస్తాం. నేను వెళ్ళొస్తాను." అని అక్కడికి కొద్దిదూరంలో వున్న హనుమంతుడ్ని చూసి"ఏం హనుమా! కనీసం ఈ రూపాన్ని నువ్వన్నా ఒప్పుకున్నావన్నమాట"అన్నాడు ఆనందంగా.

"లేదు..మొదట నీ రూపాన్ని చూసి నా వాచిన మూతి సరిచేయించుకుని..వెనక తోక తీసేయించుకుందామనుకున్న మాట వస్తవం. కానీ నీ ఈ రూపం ఎందుకో నాకు నచ్చలేదు. అందం కాదు ప్రధానం..మనస్తత్వం. నీ మంచితనంతో నువ్వు భక్తులమనసుల్లో చోటుసంపాదించావు. అందుకే విఘ్నాలు లేకుండా చూస్తావని భక్తులు వినాయక చవితికి నవరాత్రుల పూజలు ఘనంగా చేస్తారు. తమ ఇంట్లో ఏ శుభకార్యం తలపెట్టుకున్నా ముందు నీకు పూజ చేస్తారు. ఇంకా నయం నేను కూడా శస్త్రచికిత్స చేయించుకున్నా కాదు."అని రివ్వున ఆకాశంలోకి దూసుకెళ్ళిపోయాడు.

అంత అందంగా మారి కూడా విచారంగా కైలాశానికి వెళ్ళాడు.సంవత్సరం మొత్తం తయారుచేసిన వినాయకుడి విగ్రహాలు ఆ సంవత్సరం అమ్ముడవలేదు. వినాయకచవితి సరిగా జరగలేదు. ఉత్తరభారతంలో "గణపతి బప్పా మోరియా"వినిపించలేదు. దక్షిణంలో "ఓ బొజ్జ గణపయ్య.."చదవలేదు.

వినాయకుడికి బాధగా అనిపించింది. అతని బాధని చూడలేక 'మళ్ళీ పూర్వరూపునొసగమని' ప్రాణనాధుణ్ణి ప్రాధేయపడింది పార్వతి."చూడు పార్వతీ..అప్పుడంటే మనకేది కావాలంటే అలా చేసేసుకునేవాళ్ళం..కానీ ఇప్పుడు ఇక్కడ ప్రభుత్వం ఏర్పడింది. నేను మన కుటుంబం కోసం వరాల దుర్వినియోగం చేస్తే అదో స్కాం అవుతుంది. తర్వాత విచారణలూ..శిక్షలు. మనం ఎంతో నచ్చ చెప్పాం విన్నాడా? లేదు. వినాయకుడి మోడర్న్ రూపం ఇహ అంతే!"అని మాయమైపోయాడు.

"నాయనా..వినాయకా..లే వినాయక చవితి వచ్చేసింది..భక్తుల కోలాహలం ప్రారంభమైంది..నువ్వెళ్ళి అనుగ్రహించాలి.."తల్లి నిద్రలేపడంతో ఈ లోకానికి వచ్చి "ఓహ్! ఇదంతా కలా!"అని నిట్టూర్చి 'డా||ఏకతొండం ఆలోచనని ఎలా ఏమార్చాలా?' అన్న ఆలోచనలో పడిపోయాడు.




"ఏమండీ బాత్రూంలో వేణ్ణీళ్ళు పెట్టాను. నెమ్మదిగా లేచి మీరు స్నానం చేసి వస్తే మనం బయలుదేరవచ్చు" అప్పుడే తలస్నానం చేసిన శైలజ తడిజుట్టును టవల్ తో తుడుచుకుంటూ అంది భర్త సంతోష్ తో.

బెడ్ మీద దిండుకు జారగిలబడి వీక్లీ తిరగేస్తూ కూర్చున్న సంతోష్ ఆ మాటతో చివ్వున తలెత్తి చూసి, " ఎక్కడికి ? " అనడిగాడు.

"అదేమిటండీ? అలా అడుగుతారూ? మీరు నిమజ్జనం లోగా కోలుకుని ఇంటికొస్తే వినాయకుడికి సహస్రనామార్చన చేయిస్తానని మొక్కుకున్నానని చెప్పాగా? " ఆశ్చర్యంగా అంది శైలజ.

" నేను రాను, నువ్వెళ్ళు" కోపంగా అనేసి మళ్ళీ పుస్తకంలో మొహం పెట్టాడు సంతోష్.

" దేవుడి పూజకి రానంటారేమిటండీ? అపచారం, అదీ వినాయకుడు, ఆగ్రహిస్తే ఇంకేమైనా ఉందా? " లెంపలేసుకుంది శైలజ.

" ఇంకేమైనా ఉండడమేమిటి శైలూ....? జరగాల్సిందంతా జరిగాక?" కోపం, బాధ కలగలిపిన భావం వ్యక్తమయింది అతడి గొంతులో.అతడి ఉద్దేశం అర్థమై దగ్గరగా వచ్చి, మంచం పక్కగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ " ఏవండీ అంత ప్రమాదం నుండి మీరు ప్రాణాలతో బయటపడి ఇంత త్వరగా కోలుకోవడం అదృష్టం, ఆ దేవుడి దయ కాదా, అలాంటిది దేవుడి మీద అలిగి పూజకి రానంటారేం ? " అంది అనునయంగా." ఏమిటి శైలూ దేవుడి దయ? ఎప్పుడూ నేను తిరిగే రోడ్డు, ఎంతో జాగ్రత్తగా చేసే నా డ్రైవింగ్. ఎన్నడూ లేంది సరిగ్గా ఆ వినాయక మంటపం ముందే నాకు ఈ యాక్సిడెంట్ కావాలా, ఏంటీ విచిత్రం..??"

వారం క్రితం జరిగిన బైక్ యాక్సిడెంట్ తలుచుకుంటూ అన్నాడు సంతోష్.

సరిగ్గా వారం క్రితం... తెల్లారితే వినాయక చవితి..రాత్రి పదకొండయింది. పనులు ముగించుకొని బైక్ మీద తిరిగొస్తున్నాడు సంతోష్. ఇంకో ఐదు నిముషాల్లో ఇల్లు చేరబోతున్నాడనగా హై వే మీద స్లో గా బైక్ నడుపుతున్న సంతోష్ ని వెనకనుండి ఏదో గుర్తు తెలియని వెహికిల్ ఢీ కొట్టడంతో పక్కకి ఎగిరి పడిపోయాడు. సమయానికి అటుగా వెళ్తున్న అతడి ఫ్రెండ్ రవి సంతోష్ ని చూసి వెంటనే అంబులెన్స్ కి ఫోన్ చేయడం, హాస్పిటల్లో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది...అయిదారు రోజులు ట్రీట్ మెంట్ చేసి డిశ్చార్జ్ చేసారు. ...

శైలజ ఏదో అంబోయేంతలో కాలింగ్ బెల్ మోగడంతో వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా సంతోష్ ఫ్రెండ్ రవి నిల్చుని ఉన్నాడు. " ఓ , మీరా అన్నయ్యా, రండి " అంటూ చిరునవ్వుతో లోపలికి దారి తీసింది, శైలజ.

" కారు తీసుకుని వచ్చానమ్మా, వాడు రెడీ అయ్యాడా? " లోపలికొస్తూ అడిగాడు రవి

" ఆయన పూజకి రారటన్నయ్యా, తనకి యాక్సిడెంట్ చేయించాడని వినాయకుడి మీద అలిగాబుఅట..." చెప్పింది శైలజ.

" వినాయకుడు యాక్సిడెంట్ చేయించాడా, అదేంటి కొత్తగా?? " ఆశ్చర్యపోయాడు,రవి.

" అవున్రా, కాకపోతే మరేమిటి? ఎప్పుడూ లేంది, రోజూ తిరిగే రోడ్డు మీద, అదీ, వినాయక మంటపం ముందు నాకంత ఘోరం

జరిగితే ఏ దేవుడు అడ్డుకున్నాడు? ఎందుకు దేవుడి పూజలు చెయ్యాలి? " మెల్లిగా బెడ్రూంలో నుంచి బయటకి వస్తూ అన్నాడు సంతోష్." వార్నీ, అదేం లాజిక్ రా నాయనా చెరువు మీద అలిగి, మొహం కడుక్కోవడం మానేశాడట, వెనకటికి నీలాంటివాడెవడో... మంటపం ముందు యాక్సిడెంట్ అయిందని, దేవుడి మీద కోపమేంట్రా? " సోఫాలో పేపర్ చేతులోకి తీసుకున్నాడు రవి..

" ఓకేరా, నీ అలక అలాగే కంటిన్యూ చెయ్యి దేవుడి మీద....కానీ, కాసేపటికోసం నాతో రండి, మీకో సాన్ చూపించాలి. " అంటూ భార్యాభర్తలిద్దర్నీ బయల్దేరదీశాడు రవి.

ముగ్గురూ రవి కార్లోనే స్టార్ట్ అయ్యారు. కారుని నేరుగా తీసుకొచ్చి, సంతోష్ కి యాక్సిడెంట్ అయిన చోట ఆపాడు. " సంతోష్, నిన్ను వెనక నుండి వెహికలేదో డాష్ కొట్టిన తర్వాత నువ్వు ఎక్కడ పడిపోయావో ఏమైనా గుర్తుందా? " అనడిగాడు సంతోష్ ని...

" లేదురా మళ్ళీ నాకు స్పృహ వచ్చింది హాస్పిటల్లోనే కదా? " గుర్తు చేసుకున్నాడు సంతోష్.

" కదా, నేను చెబుతా, విను, తెల్లారితే వినాయక చవితి. కాబట్టి, నేల కొంత చదును చేసి, మంటపం వేశారు ఇక్కడి బస్తీ కుర్రాళ్ళు. పైనుంచి కప్పడానికి తెచ్చిన టార్పాలిన్ షీట్ అందులో ఉంది. బహుశ అప్పటిదాకా పని చేసిన కుర్రాళ్ళు అవన్నీ ఎక్కడివక్కడ పెట్టేసి ఇళ్ళకు వెళ్ళిపోయి ఉంటారు. నువ్వు ఎగిరి నేరుగా దుప్పటిలా ఉన్న టార్పాలిన్ మీద పడిపోయావ్. లైట్ వెలుతురులో స్పష్టంగా కనపడేలా. ఒక్కసారి ఊహించు, అక్కడ ఆ మంటపమే లేకపోతే, హై వే పక్కన ఎంత లోయ ఉందో చూడు, అందులోకి పడిపోతే కనిపించడం కాదు కదా, కనీసం అరిచినా ఆ రాత్రి రోడ్డు మీదపోయేవాళ్ళకు వినిపించదు. ఏమంటావ్? " అంటూ వివరంగా చెప్పాడు రవి. కారు దిగి పరిసరాలన్నీ గమనించిన సంతోష్ కి రవి చెప్పినట్టిగా జరిగి వుంటే, ఎలా ఉండేదన్న ఊహకే ఒళ్ళు జలదరించింది. లోయలోకి పడిపోవాల్సిన తనను బొజ్జ గణపయ్యే తన తొండంతో ఆపి టార్పాలిన్ లో మెల్లిగా జారవిడిచినట్లనిపించింది. అతడి చేతులు అప్రయత్నంగా ఒక్కటై వినాయకుడికి నమస్కరించాయి. అతడి భుజం మీద చేయి వేసి రవి, " చూడు సంతోష్, పాతదే అయినా ఒక సామెత చెబుతా విను. ఒక గ్లాసులో సగం నీళ్ళుంటే ఆశా, నిరాశావాదుల వెర్షన్స్ వేరువేరుగా ఎలా ఉంటాయో ఇదీ అంతే, పది దెబ్బలు తగిలిన వాడు పదకొండో దెబ్బ నుండి రక్షించావని దేవుడికి దండం పెట్టుకోవచ్చు, పది దెబ్బలతో బాధ అనేది తెలిసేలా చేసావని దేవిడుకి కృతజ్ఞుడై ఉండనూ వచ్చు. పది దెబ్బలు తగులుతూంటే, ఆపలేదని దేవుడి మీద ద్వేషం పెంచుకోనూవచ్చు. కానీ, ఏదైనా కర్మ ఫలాన్నీ, ప్రాప్తాన్నీ అనుసరించే జరుగుతాయని మర్చిపోవద్దు. పద, ఇంటికెళ్ళి, తమరు స్నానం కానిస్తే, తీసుకొచ్చి మిమ్మల్ని కూర్చోబెట్టి పూజ చేయిస్తాను...." అంటూ కారు స్టార్ట్ చేసాడు రవి.